

పరంజ్యోతి

# భక్తి.. ప్రపత్తి



భక్తిప్రపత్తులు.. ఆధ్యాత్మిక పరిభాషలో ఎక్కువగా వినిపించే పదబంధం ఇది. భక్తి.. ప్రపత్తి.. ఈ రెండింటికీ చాలా తేడా ఉంది. అయితే, ఈ రెండూ భగవదనుగ్రహాన్ని పొందడానికి, మోక్షసాధనకు గల భిన్నమైన మార్గాలు. 'భక్తి' గురించి మనందరికీ తెలిసిందే. దైవాన్ని ఆరాధించడం, ప్రేమించడం, పూజించడం, ప్రార్థించడం, వేడుకోవడం, భగవన్నామస్మరణ చేయడం.. ఇలా ఎన్నో రకాలుగా మన భక్తిని చాటుకుంటాం. జనసామాన్యమంతటికీ అందుబాటులో ఉన్న ఆధ్యాత్మిక సాధన ఇదే. కానీ భక్తి చాలామందికి తాత్కాలిక అంశం మాత్రమే. భక్తి నేతి ధారవలె నిరంతరం కొనసాగుతుండాలని భగవాన్ రమణులు చెప్పారు. ఆపత్కాల భక్తి వల్ల అంత ప్రయోజనం ఉండదు. అలాగని సాధారణ ప్రజకు నిరంతరం భగవన్నామ స్మరణలో మునిగి ఉండడమూ సాధ్యం కాదు. పైగా భక్తిమార్గం నుంచి మనను పక్కకు తప్పించడానికి 'మాయ'కు ప్రతిరూపమైన మనస్సు ఉండనే ఉంది. మనం సరైన దారిలో నడవకుండా చేయడమే దాని పని. అది సదా ఈ శరీరమే 'నేను' అనుకోవడం, దేహపోషణకు ఎక్కువ ప్రాధాన్యమివ్వడమనే దేహాభిమానాన్ని పెంచిపోషిస్తుంటుంది. వాస్తవానికి 'నేను' అంటే కనిపించే ఈ 'దేహం' కాదు. 'ఇది నా కాలు.. ఇది నా చెయ్యి.. ఇది నా కడుపు.. నా గుండె.. నా తల' అంటుంటాం. అలా మనం అనుకొనే ఆ 'ఇది' అంటే ఏమిటి? అని ఆలోచిస్తే అర్థం అవుతుంది. 'నేను'అంటే ఆత్మ. మనందరం ఆత్మస్వరూపులమే. ఈ శరీరాన్ని చైతన్యవంతంగా ఉంచుతున్న చలనశక్తే అసలైన మనం. అదే ఆత్మచైతన్యం. ఆ విషయాన్ని అర్థం చేసుకుని గట్టిగా పట్టుకోవాలి. ఇది భక్తుడి బాధ్యతే. భగవంతుడి పనికాదు. అందుకే ఈ విధానాన్ని 'మర్కట కిశోర న్యాయం' అంటారు. భక్తిమార్గంలో సాధకుడు కూడా ఇలాగే ఎన్ని కష్టాలెదురైనా భగవంతుణ్ని పట్టుకునే ఉండాలి. ప్రహ్లాదుడు ఇందుకు ఉదాహరణ.

ఇక ప్రపత్తి.. భక్తి కంటే ఉన్నతమైనది. భారమంతా భగవంతునిపై వేసి సంపూర్ణ శరణాగతి వేడే విధానాన్నే ప్రపత్తి అంటారు. అది 'మర్కట కిశోర న్యాయం' వలె కాక.. 'మార్జాల కిశోర న్యాయం' వలె ఉంటుంది. మార్జాలం అంటే పిల్లి. అది ఒక ఇంట్లో మరుగు చూసుకుని పిల్లలను కంటుంది. కానీ, ఆ కూనలను పెద్దయ్యేవరకూ ఒకేచోట ఉంచదు. చాలాచోట్లకు తిప్పుతుంటుంది. వాటిని జాగ్రత్తగా తన నోట కరుచుకుని తీసుకెళ్తుంది. పిల్లికూనలు కోతిపిల్లల్లాగా కాక.. పూర్తిగా తల్లిపైనే ఆధారపడి ఉంటాయి. ప్రపత్తి మార్గం ఈ కోవలోనిదే. 'నీట ముంచినా.. పాల ముంచినా నీవే స్వామి.. మంచిజరిగినా, చెడు జరిగినా నీవే దిక్కు' అంటూ సాగిలపడే పద్ధతి ఇది. ఈ పద్ధతిలో పరమాత్మను కొలిచేవారు తమ గురించి తాము పట్టించుకోరు. తమ అవసరాల గురించి పట్టించుకోరు. దీంతో దేవుడే వారి భారం వహిస్తాడు. తన భవిష్యత్తు గురించి ఆలోచించకుండా.. అరుణాచలేశ్వరుణ్ని నమ్మి ఇల్లు వీడిన భగవాన్ రమణుల వంటివారు ఇందుకు ఉదాహరణ.

-మాదిరాజు రామచంద్రరావు, 9393324940

# బియ్యం కార్డులు... 1.30కోట్లు

▸▸ నేటినుంచి పంపిణీ ప్రారంభం

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల స్థానంలో ప్రవేశపెట్టిన బియ్యంకార్డుల పంపిణీని నేటినుంచి చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటీ 30లక్షల కుటుంబాలకు కార్డులు మంజూరు చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఆమోదం తెలిపింది. ఇప్పటివరకూ రాష్ట్రంలో 1.47కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయి. అంటే 17లక్షల కార్డులు తగ్గిపోయినట్టే. అయితే వాటిలో 7.5లక్షల కార్డులు పూర్తిగా అర్హత లేనివిగా గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 8లక్షల కార్డులను పునఃపరిశీలన చేయనున్నారు. లక్షన్నర కార్డులపై 18, 19తేదీల్లో తిరిగి సర్వే నిర్వహించనున్నారు. క్యూఆర్ కోడ్, వాటర్‌ప్రూఫ్ టెక్నాలజీతో రూపొందించిన కొత్త కార్డులను నేటినుంచి వలంటీర్లే ప్రతిఇంటికీ వెళ్లి అందజేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 20లక్షల మంది ప్రతినెలా రేషన్ తీసుకోవడం లేదు. అంతే స్థాయిలో కార్డులు అనర్హత జాబితాలోకి వస్తాయని అంచనా వేశారు. అయితే ప్రస్తుతానికి 7.5లక్షల కార్డులు మాత్రమే పూర్తిగా అనర్హమైనవిగా తేలాయని, మిగిలినవాటి గురించి పునఃపరిశీలనలో తేలుస్తామని అధికార వర్గాలు అంటున్నాయి. కాగా, ఈనెల 21నాటికి బియ్యం కార్డుల పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌరసరఫరాల కమిషనర్ కోన శశిధర్ తెలిపారు. అయితే దీనికి తుదిగడువు కచ్చితంగా ఏమీలేదని, ఇదో నిరంతర ప్రక్రియ అని చెప్పారు. 8లక్షల కార్డులపై వీఆర్‌వోలతో పునఃపరిశీలన చేపడతామన్నారు. ఈనెల 25 తర్వాత అర్హత ఉన్నవారు ఎవరైనా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే 5రోజుల్లోనే కార్డు జారీ చేస్తామన్నారు.

| | |
|---|---|
| ప్రస్తుతం ఉన్న కార్డులు | కోటీ 47లక్షలు |
| కొత్తగా ఇస్తున్నవి | కోటీ 30లక్షలు |
| అనర్హులు | 7.5లక్షలు |
| పునఃపరిశీలన చేయాల్సినవి | 8లక్షలు |
| ఇంకా సర్వే చేయాల్సినవి | 1.5లక్షలు |
| తగ్గిపోయిన కార్డులు | 17లక్షలు |

# ఏపీ ఓటర్లు @ 4,00,02,782



అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్య పెరిగింది. దాదాపు 5లక్షల మంది మహిళలు మగవారి కంటే అధికంగా ఓటర్లుగా నమోదయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సమగ్ర సవరణ- 2020(స్పెషల్ సమ్మరీ రివిజన్, ఎస్ఎస్ఆర్) ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. రాష్ట్రంలో కొత్త ఓటర్ల నమోదు, డూప్లికేట్ ఓటర్ల తొలగింపు తర్వాత రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కె.విజయానంద్ ఈ తుది జాబితాను శుక్రవారం విడుదల చేశారు. దీనిప్రకారం రాష్ట్రంలో 4,00,02,782 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ముసాయిదా ఓటర్ల జాబితా(డ్రాఫ్ట్ పబ్లికేషన్-23.12.2019)లో 3,98,34,776మంది ఓటర్లు ఉన్నారు. కొత్తగా 1,63,030 ఓట్లు నమోదు కాగా, ఓటర్ల పరిశీలన కార్యక్రమం తర్వాత వలస వెళ్లడం, స్థానికంగా లేకపోవడం లాంటి వివిధ కారణాలతో 60,412ఓట్లు తొలగించారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పురుష ఓటర్లు 1,96,81,827మంది నమోదు కాగా 2020 ఎస్ఎస్ఆర్‌లో 1,97,90,730మంది నమోదయ్యారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో 2,01,48,913 మంది మహిళా ఓటర్లు నమోదవగా ఇప్పుడు వారిసంఖ్య 2,02,07,984కు పెరిగింది. డ్రాఫ్ట్ జాబితాలో 4,036మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉండగా, ఇప్పుడు 4,068మంది నమోదయ్యారు. మొత్తం ఓటర్లలో 7,436మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 65,388మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో 45,920 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటి సంఖ్యను ఇప్పుడు 45,836కు తగ్గించారు.

| జిల్లాల వారీగా ఓటర్లు | |
|---|---|
| శ్రీకాకుళం | 22,45,874 |
| విజయనగరం | 18,61,812 |
| విశాఖపట్నం | 36,12,431 |
| తూర్పుగోదావరి | 42,54,300 |
| పశ్చిమగోదావరి | 32,49,865 |
| కృష్ణా | 35,85,928 |
| గుంటూరు | 40,24,514 |
| ప్రకాశం | 26,59,344 |
| నెల్లూరు | 24,31,967 |
| కడప | 22,55,309 |
| కర్నూలు | 32,84,867 |
| అనంతపురం | 33,03,599 |
| చిత్తూరు | 32,32,972 |
| మొత్తం | 4,00,02,782 |

# విద్యార్థులను కుక్కేస్తున్నారు!

ఐదంతస్థుల భవనాల్లో.. ఇరికిరుకు గదుల్లో తరగతులు
వంద మందికి ఒకే మరుగుదొడ్డి
హాస్టళ్లలో ఆహారం నాసిరకం
అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన
జూనియర్ కాలేజీల్లో పరిస్థితి ఇదీ...

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో అత్యంత దుర్భరమైన, దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. అనేక కాలేజీలు నాలుగు, ఐదంతస్థుల్లో తరగతులు నిర్వహిస్తున్నాయి. ఇరుకిరుకు గదులు.. వందల సంఖ్యలో విద్యార్థులు. వంద మందికి ఒకటి రెండు మరుగుదొడ్లే. కనీస సదుపాయాలు ఉండవు. హాస్టళ్లలో ఆహారం అత్యంత నాసిరకం. పౌష్టికాహారం మాటేలేదు. తగినన్ని నీళ్లు లేవు. అడుగుడుగునా నిబంధనలు ఉల్లంఘనలు" ఇదీ ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో నెలకొన్న పరిస్థితి అని తనిఖీ బృందాలు విస్మయం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 130 కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో శుక్రవారం తనిఖీలు జరిగాయి. అధిక ఫీజులు వసూలు చేస్తున్న 10 కాలేజీల చొప్పున ఎంపిక చేసి పాఠశాల విద్య, నియంత్రణ కమిషన్ పర్యవేక్షణలో మండల విద్యాధికారులు(ఎంఈవో) తనిఖీలు నిర్వహించారు. ఒక్కో టీమ్‌కు ఇద్దరు చొప్పున జిల్లాకు 20 మంది ఎంఈవోలు, కమిషన్ మెంబరు ఒకరు.. మొత్తం 21 మంది తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ తనిఖీల్లో ఆయా కాలేజీల్లోని లోపాలను గుర్తించారు. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను కాలేజీలు అమలు చేయడం లేదని, సిలబస్ ఫాలో కావడం లేదని, ఫీజుల్లో చాలా వ్యత్యాసాలు ఉన్నాయని తేల్చారు. అనంతపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఓ మహిళకు నెలకు రూ.7 వేలు జీతం చెల్లిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. ప్రతి సంవత్సరం గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటుచేసి దాని ప్రకారమే సిబ్బందికి జీతాలు చెల్లించాలి. ముఖ్యంగా నాన్ టీచింగ్ స్టాఫ్‌కు చాలా తక్కువ జీతం ఇస్తున్నారు. ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తుండం, వెలుతురు తగినంత లేకపోవడం వల్ల పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాస్టళ్లలో అయితే వేకువ జామున 4 గంటలకే పిల్లలను లేపుతున్నారు. ఇది చదువుకునేందుకు కాదు సుమా.. తక్కువ మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉండటం వల్ల.. ఆలస్యంగా చేసే వారికి ఇబ్బందులు తప్పవు. దీంతో వారిని 4గంటలకే నిద్రలేపుతున్నారు. దీంతో విద్యార్థులకు సరైన నిద్ర కూడా ఉండడం లేదు. ఒకవేళ నిర్దేశిత సమయం కంటే ఆలస్యమైతే ఇక ఆరోజు వారికి స్నానం చేసే అవకాశం ఉండదు. దీంతో శారీరక రోగాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఆహారం కూడా సరిగ్గా ఉండటం లేదు. చాలీచాలని అన్నంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. కాగా, తనిఖీ బృందాలు నమోదు చేసిన లోపాలను కమిషన్‌కు నివేదించనున్నాయి.

## తెలుగు కార్మికుల సంక్షేమానికి చేయూతనివ్వండి

▸▸ కర్ణాటక సీఎంకు చలసాని శ్రీనివాస్ వినతి



యడియూరప్పకు వినతి పత్రం అందజేస్తున్న చలసాని శ్రీనివాస్

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కర్ణాటకలో లక్షలాదిగా ఉన్న తెలుగు కార్మికుల సంక్షేమానికి చేయూత నివ్వాలని ఆంధ్రా మేధావుల వేదిక వ్యవస్థాపకులు చలసాని శ్రీనివాస్ ముఖ్యమంత్రి యడియూరప్పకు విజ్ఞప్తి చేశారు. బెంగళూరులో శుక్రవారం ఆయన యడియూరప్పకు రాష్ట్రంలోని ఆంధ్రుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. కన్నడిగులు, తెలుగువారు ఒకే భాషా సమూహంగా వేలాది సంవత్సరాలుగా అన్నదమ్ముల్లా కలిసి మెలసి జీవిస్తున్నారని పేర్కొన్నారు. నేడు పలు ప్రాంతాల్లో తెలుగుపై వివక్ష చూపడం పరిపాటిగా మారిందని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై స్పందించిన యడియూరప్ప కర్ణాటకలో తెలుగువారి భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు.


APPOINTMENTS

SRI VANI EDUCATIONAL SOCIETY
GROUP OF INSTITUTIONS
Chevuturu(V), G.Konduru(M),Vijayawada,Krishna(Dt)-521229

WALK-IN-INTERVIEW

Applications are invited for the following positions:
Professor / Associate/Assistant Professors in ECE, EEE, CSE, Mechanical, Maths, Physics, Chemistry, English, Pharmacy (Pharmaceutics, Pharmaceutical Analysis, Pharmaceutical Chemistry), Gardeners, Electrician, LabTechnicians, Drivers, Plumbers, Carpenters, Librarian, Accountant, Security Guards, Attenders.

*Eligibility & Salaries are as per the norms of AICTE.*
*Experienced Candidates will be given priority.*

Eligible candidates may attend interview at institution on 15th, 16th &17th February 2020 along with original certificates & one set of Xerox copies.

Email : srivaniprincipal@gmail.com
Contact No : 92999 93324 PRINCIPAL

Dhanekula Institute
OF ENGINEERING AND TECHNOLOGY
(Approved by AICTE, Affiliated to JNTU, Kakinada)
Programmes Accredited by NBA : B.Tech in CE, MEC, ECE & EEE
NAAC Accredited & An ISO 9001- 2015 Certified Institution
Ganguru, Vijayawada-521 139. (A.P.) Ph.No. 8333924842/43
website : www.diet.ac.in, EAMCET Code: DHAN

RECRUITMENT

Applications are invited from eligible candidates for various Teaching positions for existing courses.

| Vacancies | Department |
|---|---|
| Associate Professor & Assistant Professor | Mechanical Engineering, Electronics and Communication Engineering |

Qualifications as per AICTE Norms.
Interested candidates may forward Soft copy of resume with photograph and necessary certificates on or before 20.02.2020.
Mail ID: careers@diet.ac.in
Date : 14-02-2019
Sd/- Chairman


# ఎన్నెన్ని సిత్రాలో!

▸▸ వారిది ఒకటే బ్యాచ్.. పదోన్నతుల్లో తకరారు

▸▸ మెరిట్‌పై నిర్ణయంలో అంతులేని తాత్సారం

▸▸ 15ఏళ్లు ఎస్‌వోగా పనిచేస్తే ఏఎస్‌వోనా?

▸▸ 1999 గ్రూప్-2 ప్రభుత్వ ఉద్యోగుల ఆవేదన

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 15 ఏళ్లు సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసిన వ్యక్తి ఏమవ్వాలి? ప్రమోషన్ వచ్చి సహాయ కార్యదర్శి కావాలి. కానీ ఆయన సహాయ సెక్షన్ అధికారి అయ్యారు. అలా జరగదంటారా?! ఒకే బ్యాచ్‌లో మెరిట్ ఉన్న అభ్యర్థికి కాకుండా తక్కువ మెరిట్ ఉన్న ఉద్యోగికి ప్రమోషన్ వస్తుందా?...ఇదీ జరగదంటారా?... మెరిట్ ప్రకారం ఇద్దరికి రావాల్సిన పదోన్నతి ఒక్కరికే వచ్చింది.. ఇది కూడా జరగదంటారా?...అన్నీ జరిగిపోతున్నాయి. పాలనకు సంబంధించి సచివాలయమే గుండెకాయ. అలాంటిచోట పనిచేసే ఉద్యోగుల్లో కొందరికి న్యాయం జరగని వైనం చర్చనీయాంశంగా మారింది. వీరంతా 1999 గ్రూప్-2 బ్యాచ్‌కు చెందిన ఉద్యోగులు!

1999లో ఏపీపీఎస్సీ 243పోస్టుల భర్తీకి గ్రూప్-2 నోటిఫికేషన్ ఇచ్చింది. 2000 ఆగస్టు నాటికి ఖాళీ అయ్యే డైరెక్ట్ రిక్రూటీ పోస్టులను కూడా భర్తీచేస్తామని పేర్కొంది. దీన్నే 10/99 నోటిఫికేషన్ బ్యాచ్‌గా పిలుస్తున్నారు. నిబంధనల ప్రకారం ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను నోటిఫికేషన్‌లో కలపలేదని కొందరు అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాలతో 973 ఎగ్జిక్యూటివ్, 199 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను కలుపుతూ 2005లో మరోసారి భర్తీ చేశారు. ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఆప్షన్ ఇవ్వకుండా తమకు అన్యాయం చేశారంటూ కొందరు నాన్‌ఎగ్జిక్యూటివ్ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ తర్వాత 2015లో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. సింగిల్ మెరిట్ లిస్టు తయారు చేయమని ఏపీపీఎస్సీని ఆదేశించింది. ఈ ప్రక్రియలో అభ్యర్థులు నష్టపోకుండా సింగిల్ మెరిట్ లిస్టు ప్రకారం ఇంటర్ సీనియారిటీ అమలు చేయాలని ఆదేశించింది. 124 జీవో ప్రకారం 2005లో ఇచ్చిన లిస్టును రద్దుచేసి, అంతా సింగిల్ మెరిట్ లిస్టు కిందకే తీసుకురమ్మని చెప్పింది. ఏపీపీఎస్సీ 2017లో సింగిల్ మెరిట్ లిస్టు ప్రకటించింది. దీని వల్ల వందల మంది శాఖలు మారారు. అప్పటికే 15ఏళ్లుగా పలు శాఖల్లో పనిచేస్తూ, పదోన్నతులు తీసుకొని కీలక పోస్టుల్లో పనిచేస్తున్న 79మంది రెవెన్యూలోకి వచ్చారు. వారిని సెలక్షన్ గ్రేడ్ అయిన డిప్యూటీ తహసిల్దార్ (డీటీ)గా నియమించారు. ఇదే లిస్టు ప్రకారం రెవెన్యూ నుంచి కూడా 44మంది ఇతర శాఖలకు వెళ్లాలి. ఈ విషయంలో రెవెన్యూశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు, రెవెన్యూలో పనిచేస్తున్న సింగిల్ మెరిట్ లిస్టు వారిని కూడా సెలక్షన్ గ్రేడ్ అయిన డీటీ కేడర్‌కు తీసుకురావాలి. అదీ చేయలేదు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆ 79మంది అధికారులు సీసీఎల్‌ను కోరారు. ఇది పరిష్కారం కాకపోగా, దీనికి కొనసాగింపుగా డిప్యూటీ కలెక్టర్ పదోన్నతుల వ్యవహారం ముందుకు రావడంతో మరింత అలజడి మొదలైంది.

### అలజడి పెంచిన డిప్యూటీ

రెవెన్యూశాఖలో మూడునెలల క్రితం తొమ్మిది మందికి డిప్యూటీ కలెక్టర్ పదోన్నతులు ఇవ్వాలని సన్నహాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రతిపాదనలు పంపించారని, కొందరికి మేలు చేసేలా మంత్రాంగం జరిగిందని విమర్శలు వచ్చాయి. 'రెవెన్యూలో మళ్లీ పాతకథే' శీర్షికన నవంబరు 17న ఆంధ్రజ్యోతి వార్తా కథనం వెలువరించింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఫైళ్లను మరోసారి నిశిత పరిశీలన చేసి డీపీసీని నిలిపివేశారు. ఇటీవల మరోసారి డీపీసీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. డీపీసీ సమావేశం కూడా ఈసారి 22మంది తహసీల్దార్‌లకు డిప్యూటీ కలెక్టర్ పదోన్నతులు ఇచ్చేలా ప్రతిపాదించింది. శాఖలో తొలినుంచి పని చేస్తున్న(సింగిల్ మెరిట్ లిస్టు)వారికి మాత్రమే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఈలిస్టులో పేర్లు ఉండి మెరిట్‌లో ముందున్న వారిని పక్కన పెట్టారు. దీంతో వివాదం రాజుకుంది. ఈ వ్యవహారంపై నేరుగా సీఎం జగన్‌కు చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ సానుకూలంగా స్పందించనుందని సమాచారం.

### మెరిట్ ఉన్నా మొండిచెయ్యేనా!

1999 గ్రూప్-2 నోటిఫికేషన్ కింద అనేక దఫాలుగా నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా కొంతమందికి 2018లో కూడా ఉద్యోగాలు వచ్చాయి. వారిలో కొందరు విధుల్లో చేరిపోయినా కొంతమందికి ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. ఒకే నోటిఫికేషన్, ఒకే తీర్పు, అంతా ఒక్కటే అయినా అందరికీ న్యాయం చేయడం లేదనివాపోతున్నారు. దాదాపు 10మందివరకు ఇలా పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్నారు. 1999 నోటిఫికేషన్‌లో భాగంగా 10మే 2018 సెలక్షన్ లిస్ట్‌లో పెంచల వీరేంద్రకు పంచాయతీరాజ్ విస్తరణ అధికారిగా ఉద్యోగం వచ్చింది. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినా ఇతనికి ఉద్యోగం ఇవ్వాలని సంబంధిత యూనిట్ అధికారులకు అటు ఏపీపీఎస్సీ, ఇటు జీఏడీ కానీ ఆదేశాలు ఇవ్వడం లేదు. కోర్టు తీర్పు ప్రకారం న్యాయం చేయాలని వీరు కోరుతున్నారు.

### సర్వీసంతా బూడిదపాలేనా!

సచివాలయంలోని ఆర్థికశాఖలో చేరి ఐదేళ్లపాటు పి.శంకరప్ప సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేశారు. కోర్టు తీర్పు అమలుచేయడంలో తేడాలతో ఏఎస్ఓగా డిమోషన్ పొందారు. ప్రస్తుతం ఇదే హోదాతో మున్సిపల్ శాఖలో పనిచేస్తున్నారు. ఒకశాఖ నుంచి మరోశాఖకు మార్చినప్పుడు పాత అనుభవాన్నీ పరిగణనలోకి తీసుకొని పదోన్నతులు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును పాటించకపోవడమే వారికి ఈ కష్టం తెచ్చిపెట్టింది.

## విద్యాహక్కు చట్ట నిబంధనలకు రాష్ట్రాలు కట్టుబడాల్సిందే

▸▸ 8వ తరగతి వరకైనా మాతృభాషలోనే విద్యాబోధన

▸▸ హైకోర్టులో కేంద్ర ప్రభుత్వం వాదనలు

▸▸ తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్ట నిబంధనలకు రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉండాల్సిందేనని కేంద్రం స్పష్టంచేసింది. ఏపీ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని, కనీసం 8వ తరగతి వరకైనా మాతృభాషలోనే విద్యాభ్యాసం జరగాలని చట్టంలో ఉందని పేర్కొంది. తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తొలగించి ఆంగ్ల మాధ్యమాన్ని చెప్పడమంటే అది విద్యాహక్కు చట్ట నిబంధనలకు విరుద్ధంగా నడచుకోవడమేనని తెలిపింది. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 1-6 వరకు ఆంగ్లమాధ్యమాన్ని అమలు చేసేందుకు అనువుగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 85, 81 జీవోలు రద్దు చేయాలని కోరుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్ గుంటుపల్లి శ్రీనివాస్, సామాజిక ఉద్యమకారుడు రాంభొట్ల శ్రీనివాస సుధీష్ వేర్వేరుగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం ముందు శుక్రవారం విచారణ జరిగింది. కేంద్రప్రభుత్వం తరపున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ కృష్ణమోహన్ వాదనలు వినిపిస్తూ.. సిలబస్, మాధ్యమ బోధన గురించి నిర్ణయించాల్సింది అకడమిక్ అథారిటీ అన్నారు. దానితో సంబంధం లేని పాఠశాల విద్యా కమిషనర్ ప్రతిపాదన ఆధారంగా ఆంగ్లమాధ్యమం ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. జాతీయ విద్యావిధానం, విద్యాహక్కు నిబంధనల్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వ జీవోల చట్టబద్ధతను తేల్చాల్సి ఉందన్నారు. తెలుగు మాధ్యమం లేకుండా చేయడమంటే తెలుగు కోరుకునే వారి పట్ల వివక్ష చూపినట్లే భావించాల్సి ఉంటుందన్నారు. ఇంప్లీడ్ పిటిషనర్ల తరపున న్యాయవాదులు పి.మహేశ్వరరావు, వైకే. శివాజీ వాదనలు వినిపిస్తూ.. ఆంగ్ల మాధ్యమం అమలుతో రాష్ట్రంలో సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయం అమలైతే పేదవర్గాలు అభివృద్ధి చెందుతాయని, దీనిని కొనసాగించాలని అభ్యర్థించారు. పిటిషనర్ల తరపు న్యాయవాదులు ఇంద్రనీల్ బాబు, అనూప్ కౌశిక్, సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం ఆంగ్లమాధ్యమంపై సరైన అధ్యయనం చేయలేదని, నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమైనదన్నారు. ప్రభుత్వం జారీచేసిన జీవోలు విద్యాహక్కు చట్టానికి అనుగుణంగా లేవన్నారు. మైనారిటీ భాషలను రక్షిస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. మెజారిటీ ప్రజల భాషను ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజీ ఎస్.శ్రీరాం వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర విద్యాచట్టంలో సవరణ చేస్తూ బిల్లు దాఖలు చేశామని, రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తున్నామన్నారు. నిబంధనల మేరకే జీవోలు జారీ చేశామన్నారు. ఆంగ్లమాధ్యమంలోనూ తెలుగును తప్పనిసరి సబ్జెక్టు చేశామని, అందువల్ల మాతృభాషకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని వివరించారు. మైనారిటీ పాఠశాలల్లో మైనారిటీ భాషలైన తమిళం, కన్నడం, ఉర్దూ, ఒరియా మాధ్యమాలు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. మాతృభాషలోనే విద్యాభ్యాసం ఉండాలని విద్యాహక్కు చట్టంలో పేర్కొనలేదని, 'ఆచరణ సాధ్యం మేరకు మాతృభాషలో' అని మాత్రమే పేర్కొన్నారని గుర్తు చేశారు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల నుంచి సుమారు 48వేల తీర్మానాలు రాగా, అందులో 97శాతం ఆంగ్లమాధ్యమం కావాలని అభ్యర్థనలు ఉన్నాయని వివరించారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం... తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

## లోకం తీరు




అబ్బే... అది తుపాకీ శబ్దం కాదు... సిలిండర్ పేలినట్టుంది సార్..!

### 3 రోజులు పొడి వాతావరణమే!

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పొడి వాతావరణం నెలకుంటుందని అమరావతి వాతావరణ కేంద్రం శుక్రవారం తెలిపింది. ఉత్తరాంధ్ర, యానాం, దక్షిణ కోస్తా, రాయలసీమలో మూడు రోజులు పొడి వాతావరణమే ఉంటుందని పేర్కొంది.



### కాంగ్రెస్ అదృశ్యం వల్లే ఢిల్లీలో బీజేపీ ఓటమి

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అదృశ్యం కావడం వల్లే బీజేపీ ఓడిపోయింది. బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య ముఖాముఖి పోరు జరిగింది. ఢిల్లీలో కాంగ్రెస్ కావాలనే అదృశ్యమైందా? ఆ పార్టీ అభిమానులు ఆప్‌కు ఓట్లు వేశారా? అనేది తెలియదు.

- ప్రకాశ్ జావడేకర్, కేంద్ర మంత్రి



### ఆందోళనకారుల వాదన వినాలి

సీఏఏ వ్యతిరేక ఆందోళనకారుల వాదనను ప్రభుత్వం వినాలి. చర్చలు జరపకుండా యువతను, విద్యార్థులను శాంతింపజేయలేం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలంటే దేశంలో శాంతి, సామాజిక సామరస్యాన్ని నెలకొల్పాలి.

- అహ్లూవాలియా, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు



### జగమొండి గాయాలను మాన్పే 'స్మార్ట్ బ్యాండేజీ'

బోస్టన్, ఫిబ్రవరి 14 : ఈ ఫొటోలో మీకు కనిపిస్తున్నది స్మార్ట్ బ్యాండేజీ. దీన్ని వైర్‌లెస్ పరిజ్ఞానంతో వైద్యులు కూర్చున్న చోటు నుంచే నియంత్రించవచ్చు. స్మార్ట్‌ఫోన్ సైజు ఉండే ఈ బ్యాండేజీని అమెరికాలోని కనెక్టికట్ వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. దీన్ని అన్ని గాయాలకూ కట్టుగా వాడొచ్చు. మరీ ముఖ్యంగా షుగర్ వ్యాధిగ్రస్తులను దీర్ఘకాలం పాటు సతాయించే జగమొండి గాయాలు, అల్సర్లకు ఇది తిరుగులేని విరుగుడుగా పనిచేయనుంది. ఈ బ్యాండేజీని గాయం ఉన్న ప్రదేశానికి కట్టగానే.. దాన్ని విశ్లేషించి, అక్కడ ఏ ఔషధం.. ఏ యాంటీబయాటిక్ వాడితే మంచిదో దానంతట అదే నిర్ణయిస్తుంది. ఆ సూచనలను వైద్యుడికి పంపి, అక్కడి నుంచి లభించే ఆదేశాల ప్రకారం.. బ్యాండేజీలోని అతిసూక్ష్మ సూదులు బయటికి తెరుకొని గాయమైన ప్రదేశానికి ఔషధాన్ని అందిస్తాయి.



### అప్పుడు 214 కేలరీలు.. ఇప్పుడు 527 కేలరీలు

లండన్, ఫిబ్రవరి 14 : ప్రపంచవ్యాప్తంగా అంచనాలకు మించిన స్థాయిలో ఆహార వృథా జరుగుతోందని నెదర్లాండ్‌లోని వాగెనిన్‌గెన్ వర్సిటీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార-వ్యవసాయ సంస్థ(ఎఫ్ఏవో) 2015 అంచనాల ప్రకారం ఒక్కో వ్యక్తి సగటున ప్రతిరోజూ 214 కేలరీల విలువైన ఆహార పదార్థాలను చెత్తబుట్టపాలు చేస్తున్నారు. ఇప్పుడా లెక్క అమాంతం పెరిగి రోజుకు 527 కేలరీలకు పెరిగిందని ఎఫ్ఏవో వెల్లడించింది. అంటే ఐదేళ్ల కిందటి అంచనాలతో పోల్చుకుంటే ఆహార వృథా జరుగుతున్న మోతాదు రెట్టింపయిందన్న మాట. రోజువారీ తలసరి ఆదాయం రూ.480కు మించిన వాళ్లలో చాలా మంది పరిమితికి మించిన ఆహార వృథా చేస్తున్నారని నివేదిక తెలిపింది.

## ఎట్టకేలకు ఓ శిక్ష!

ఈ విన్యాసాలన్నీ చూస్తున్నవేనంటూ పెదవి విరిచేయకుండా, హఫీజ్ సయీద్ మీద అభియోగాలు రుజువై ఆయనకు శిక్షపడినందుకు సంతోషించాల్సిందే. ఆయన మతం పేరిట విరాళాలు సేకరించి ఉగ్రవాదానికి ఆర్థికసాయం చేస్తున్నాడంటూ భారత్ అనాదిగా చేస్తున్న వాదనను పాక్ కోర్టు తీర్పు ఎత్తిపట్టింది. హఫీజ్ పలుమార్లు అరెస్టు కావడం, జైలుకుపోవడం, గృహనిర్బంధంలో ఉండటం అనాదిగా జరుగుతున్నదే. కానీ, ఉగ్రవాదానికి ఊతం ఇచ్చారన్న రెండు అభియోగాలను ఉగ్రవాద వ్యతిరేక కోర్టు నిజమని గుర్తించి ఇలా జైలు శిక్షలు వేయడమంటే భారత్ వాదనను సమర్థించడమే. కేవలం రెండునెలల్లో ఈ కేసుల విచారణ ముగించి, పాక్ ప్రభుత్వం హడావుడిగా ఆయనకు జైల్లోకి నెట్టడం వెనుకగల కారణాలు, ఆయన జైల్లో ఎంతకాలం ఉంటాడన్న ప్రశ్నలు వేరే విషయాలు.

ఈ తీర్పును అమెరికా స్వాగతించింది. ప్రక్షాళన ఆరంభించినందుకు సంతోషించింది. ముంబైనగరంపై పన్నెండేళ్ళక్రితం జరిగిన ఉగ్రదాడిలో ఆరుగురు అమెరికన్లు కూడా ఉన్నందున, హఫీజ్‌ను ఆ దారుణానికి బాధ్యుడిని చేయవలసిందిగా కూడా పాకిస్థాన్‌ను కోరింది. ఇది భారత్‌ను మాటమాత్రంగా సంతృప్తిపరచడం తప్ప మరెందుకూ కొరగాదు. 173మంది మరణానికి కారణమైన 2008ముంబై ఉగ్రదాడి మాత్రమే కాక, పార్లమెంటు దాడి, రెండువందలమందిని బలితీసుకున్న ముంబై రైలుపేలుళ్ళ ఘటనల్లో హఫీజ్ సయీద్ పాత్ర ఉన్నది. ఆయనను అప్పగించమనీ, కేసులు పెట్టి శిక్షించమనీ భారత్ అడుగుతూనే ఉన్నది. ఎన్ని ఆధారాలు ఇచ్చినా మరిన్ని కావాలని పాకిస్థాన్ అంటూనే ఉంటుంది. పాకిస్థాన్ సైన్యం ప్రత్యక్ష పర్యవేక్షణలో పని చేస్తూ పొరుగుదేశాల్లో అగ్గిరాజేసే హఫీజ్‌కు ఇప్పుడు ఇలా శిక్షపడటం వెనుక ఆ దేశాన్ని తరుముకొస్తున్న ప్రధాన సమస్య ఒకటున్నది. అంతర్జాతీయ ఉగ్రవాద లావాదేవీల నిఘా సంస్థ 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)' సమీక్షా సమావేశం పారిస్‌లో మరో రెండురోజుల్లో ఆరంభమై వారంపాటు జరుగుతుంది. ఇప్పటికే 'గ్రే లిస్టు'లో ఉన్న పాకిస్థాన్‌ను అలాగే కొనసాగించాలా, లేక 'బ్లాక్ లిస్టు'లోకి తోసేయ్యాలా అన్నది ఈ సమావేశం నిర్ణయిస్తుంది. బ్లాక్‌లిస్టులోకి పోతే అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న పాకిస్థాన్‌కు అంతర్జాతీయ సమాజం నుంచి సాయం పూర్తిగా నిలిచిపోతుంది. మరీ ముఖ్యంగా, ఐఎంఎఫ్ మంజూరు చేసిన ఆరువందలకోట్ల డాలర్ల రుణం విడుదల కాకుండా ఆగిపోతుంది.

గత ఏడాది ఈ ఎఫ్ఏటీఎఫ్ ఆంక్షలనుంచి చావుతప్పి బయటపడిన పాకిస్థాన్, ఉగ్రవాద సంస్థలను నియంత్రించే విషయంలో తన సచ్ఛీలతను ఫిబ్రవరి 20లోగా రుజువుచేసుకోవాల్సి ఉన్నందునే హఫీజ్‌ను హడావుడిగా ఇలా జైల్లోకి తోసినమాట నిజం. దీనిని అమెరికా అద్భుతమని ప్రశంసించడం కూడా కొత్తదేమీ కాదు. గత ఏడాది సైతం ఎఫ్ఏటీఎఫ్ సమావేశానికి కాస్తంత ముందు హఫీజ్‌ను పాక్‌పాలకులు నిర్బంధించారు. అది ముగిసిన వెంటనే ఆయన బయటకు వచ్చేశాడు. పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అమెరికా పర్యటనకు ముందు కూడా బెయిల్‌కోసం కోర్టుకు పోతున్న దశలో హఫీజ్‌ను అడ్డగించి గృహనిర్బంధంలో ఉంచారు. ఇప్పుడు కూడా ఎఫ్ఏటీఎఫ్ ముప్పు తొలగి, పాకిస్థాన్ తిరిగి యధాతథస్థితి పొందగానే మరో కోర్టు ద్వారా హఫీజ్ బయటపడేందుకు పాక్ ప్రభుత్వం సహకరించవచ్చు. హఫీజ్ అరెస్టులు, నిర్బంధాల సందర్భంలో న్యాయస్థానాల్లో ప్రభుత్వం బలహీనమైన వాదనలు వినిపించడం, కోర్టులు కేసులు కొట్టివేయడం అనాదిగా ఉన్నదే.

ఎఫ్ఏటీఎఫ్ ముప్పు లేకుంటే హఫీజ్ వైపు పాకిస్థాన్ కన్నెత్తి చూసేది కాదు. ఈ అరెస్టును మిగతా ప్రపంచం విశ్వసించకపోవడానికి దాని ఘన చరిత్రే కారణం. ప్రపంచం నమ్మినా నమ్మకపోయినా, ఎఫ్ఏటీఎఫ్‌లో నెగ్గుకొస్తే పాకిస్థాన్‌కు చాలు. కేవలం ఒక్క అరెస్టుతో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని అద్భుతంగా అడ్డుతున్నదని సమావేశం సంతృప్తిచెందుతుందో లేదో చూడాలి. 'బ్లాక్‌లిస్టు'లో పడకుండా ఆపడానికి అవసరమైన మూడు ఓట్లు వేయడానికి చైనా, టర్కీ, మలేసియా ఎలాగూ సిద్ధంగా ఉన్నాయి. కానీ, గ్రే లిస్టు దాటాలంటే పన్నెండు ఓట్లు కావాలి. ఈ పారిస్ సమావేశంలో పాక్ ప్రతిపాదిత చర్యలను నిశితంగా పరిశీలిస్తామని ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ ఇటీవల మనకు హామీ ఇచ్చాయి. ఈ రెండు దేశాలూ ఆ మాట మీద ఉంటాయో లేదో, అఫ్ఘానిస్థాన్ ఊబినుంచి బయటపడేందుకు పాకిస్థాన్‌ను నమ్ముకున్న అమెరికా ఏం చేయబోతున్నదో చూడాలి.

## తిరుగుబాటే శరణ్యమా!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిపై ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి ఆమోదయోగ్యం కాదు. రాజధానిగా అమరావతికి దేశ ప్రధాని చేతులమీద శంకుస్థాపన జరిగింది. దీనికి సాక్షులుగా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్ర గవర్నరు, అధికార, అనధికారులు ఉన్నారు. ఆనాడు, ఈనాడు బాధ్యతగల స్థానాల్లో వున్న వీరంతా జరుగుతున్న పరిణామాలను గురించి నోరువిప్పి మాట్లాడటంలేదు. దేశ ప్రజలకు వీరిపై నమ్మకం పోయే పరిస్థితి ఉన్నది.

రాజధాని నిర్మాణానికి తనవంతుగా కేంద్ర ప్రభుత్వం రూ.1500కోట్లు ఇచ్చింది. మొత్తం రూ.10,000 కోట్లు దాకా ఖర్చు చేశారు. సచివాలయం, హైకోర్టు నిర్మాణాలు పూర్తయి పనిచేస్తున్నాయి. అధికార్లు మంత్రులు నివాసాలు నిర్మిస్తున్నారు. విద్య, వైద్య సంస్థలు ఏర్పాటుయ్యాయి. 29 గ్రామాల్లోని ఏర్పాటుచేసి భూములను అభివృద్ధి చేస్తామని రైతులతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. శాశ్వత భవనాలకు పునాదులు నిర్మించారు. ఈ పరిస్థితుల్లో రాజధానిని తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయం రాష్ట్ర ప్రజలను ఆవేదనకు గురి చేస్తున్నది. 10 సంవత్సరాల కాలానికి ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌పై హక్కు ఉన్నప్పటికీ అమరావతికి సచివాలయం, హెచ్ఓడీ కార్యాలయాలను తరలించారు. 200 కార్యాలయాల్లోని 10,000 మంది పైగా ఉద్యోగులు హైదరాబాదులో కుటుంబాలను వదిలి తరలివచ్చారు. తీవ్రమైన మానసిక ఒత్తిడితో ఉద్యోగులు పని చేస్తూ ఇప్పుడిప్పుడే కుదటపడుతున్న సందర్భంలో రాజధాని మార్పు వారిలో తీవ్ర నిర్వేదాన్ని కలిగిస్తోంది.



మూడో వంతు అధికార్లు, ఉద్యోగులు ఈనాటికీ హైదరాబాద్ నుండి వారానికోసారి అమరావతికి వచ్చిపోతున్నారు. విశాఖకు కార్యాలయాలు తరలిస్తే ఈ సదుపాయం ఉండదు. దూరాభారం, అధిక ఖర్చుతో ఉద్యోగులు నష్టపోతారు. అమరావతిలో నివాసం ఏర్పాటుచేసుకున్న ఉద్యోగులు కూడా తమ కుటుంబాలను తిరిగి తరలించాల్సి ఉంటుంది. ప్రజలకు కూడా విశాఖ పోవాలంటే అసౌకర్యంగా వుంటుంది.

> రాజధాని తరలింపు విషయంలో జరుగుతున్న పరిణామాలు ప్రజలకు ఎన్నో విషయాలు తెలియచేస్తున్నాయి. రాజకీయ పార్టీల వైఖరి, సంఘాలు, సంస్థల దిగజారుడు తనం, రాజ్యం నిర్బంధం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవకాశవాద వైఖరి, చట్ట సభల పనితీరు, న్యాయస్థానాల జోక్యం విషయాల మీద భ్రమలు తొలిగి వాటి బలాలు, బలహీనతలు బయటపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలు విఫలమైనప్పుడు ప్రజలకు తిరుగుబాటే శరణ్యం అవుతుంది.

ఇప్పటికే మహానగరంగా రూపుదిద్దుకొంటున్న విశాఖకు రాజధాని వల్ల అదనంగా జరిగేదేమీ ఉండదు. అధికారం వికేంద్రీకరణ వల్ల ప్రయోజనం ఉంటుంది కాని, కార్యాలయాల వికేంద్రీకరణ వల్ల కాదు. రాష్ట్రంలో ఒకే రీతిన విధానాలు అమలు చేయడానికి ప్రతి శాఖకు ఒక హెచ్ఓడీ ఉన్నారు. అన్ని హెచ్ఓడీ ఆఫీసుల అనుసంధానంతో సచివాలయం పని చేస్తుంది. అధికారులతో ప్రతినిత్యం ప్రత్యక్ష సమావేశాలు జరిపితేనే పరిపాలన వేగంగా జరగడం లేదు. ఇక కార్యాలయాలు మూడు చోట్ల ఉంటే సమన్వయం కొరవడుతుంది.

రాజధాని మార్పుపై ప్రభుత్వం చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవు. లక్ష కోట్లు పెట్టుబడి పెట్టి అమరావతిని అభివృద్ధి చేయలేం అంటున్నారు. ఇప్పుడున్న భవనాలు వాడుకొని రోడ్డు సౌకర్యాలు కల్పిస్తే అర్థికభారం పెద్దగా ఉండదు. ప్రజలే పెట్టుబడి పెట్టుకుని వారి భూములను కాలక్రమంలో అభివృద్ధి చేసుకుంటారు. భూములిచ్చిన రైతులకు భూమి తిరిగి ఇచ్చివేస్తామని చెప్పడం దుర్మార్గం. ప్లాట్లుగా విభజించిన పొలాలను, 25% భూముల్లో నిర్మాణాలు జరిగాక ఆరేళ్ల తర్వాత ఎలా వాపసు ఇస్తారు? 33,000 మంది రైతులను మోసం చేస్తే ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పోతుంది. బాధ్యతగల మంత్రులే ప్రజలమధ్య వైషమ్యాలు, ప్రాంతీయ విద్వేషాలు రగిల్చే విధంగా మాట్లాడుతున్నారు. ఇది రాజ్యాంగాన్ని ఉల్లంఘించటమే. రాజధాని రైతులు 50రోజులుగా ఉద్యమిస్తుంటే వారి అభీష్టానికి వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నారు. పార్టీ ప్రతినిధులుగా వ్యవహరించడం ప్రజా ప్రతినిధులు చేయకూడని పని.

ప్రభుత్వం చెబుతున్న ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై విచారణ జరిపి దోషులను శిక్షించవచ్చు. వారి ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రజా ప్రయోజనాలకు వాడుకోవచ్చు. అంతేకాని ఈ నెపంతో సామాన్య రైతులను నష్టపరచాలనుకోవడం సరికాదు. ప్రజలకిచ్చిన హామీలు ఎగవేయడానికి, ప్రత్యేక హోదా వంటి సమస్యలు దాటవేయడానికే మూడు రాజధానుల సమస్యను సృష్టించారు. భూముల దురాక్రమణ, రియల్ ఎస్టేట్ ద్వారా దోచుకోవడం అలవాటైన రాజకీయ నాయకులు దీనికి వత్తాసు పలుకుతున్నారు.

మరోపక్క రాష్ట్రంలో మండుతున్న ఈ రాజధాని సమస్యను ఎలా వాడుకోవాలో అన్న ఆలోచనలో రాజకీయ పార్టీలు వున్నాయి. సినిమా డైలాగులు చెప్పడం తప్పితే ప్రజల మధ్య ఉంటూ ఉద్యమానికి నాయకత్వం వహించేస్థితిలో లేరు. రాజకీయ నాయకులకంటే ఉద్యోగ సంఘాల నేతలు మరింతగా దిగజారిపోయారు. ఎక్కడికైనా పోయి పనిచేస్తాం అంటూ ప్రభుత్వం అడగకుండానే ప్రకటిస్తున్నారు. నాలుగు ముక్కలుగా విడిపోయిన ఉద్యోగ సంఘనాయకులు ప్రభుత్వ దయాదాక్షిణ్యాల కోసం ఉద్యోగులను పణంగా పెట్టడానికి సిద్ధమయ్యారు. ఉద్యోగుల సమస్యల గురించి మాట్లాడకుండా శాసనమండలి రద్దు గురించి మాట్లాడుతున్నారు. రాజధాని రైతుల మీద జరుగుతున్న నిర్బంధకాండ, పోలీసుల అణచివేత బాధాకరం. మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్న తీరును ప్రభుత్వం సమర్థించడం వల్ల పోలీసులపై ప్రజలకు ద్వేషభావం ఏర్పడుతుంది. విధాన మండలిని రద్దు చేసిన తీరు చూస్తే ప్రజాస్వామ్యం పేరుతో అమలవుతున్నది ఫాసిజంగా బోధపడుతుంది. రాజధాని వ్యవహారంలో కేంద్రం పాత్ర అవకాశవాద వైఖరిని తలపిస్తోంది. తన్నుకు చేస్తుంటే తమాషా చూస్తున్నట్లుగా ఉన్నది.

రాజధాని తరలింపు విషయంలో జరుగుతున్న పరిణామాలు ప్రజలకు ఎన్నో విషయాలు తెలియచేస్తున్నాయి. రాజకీయ పార్టీల వైఖరి, సంఘాలు, సంస్థల దిగజారుడు తనం, రాజ్యం నిర్బంధం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవకాశవాద వైఖరి, చట్ట సభల పనితీరు, న్యాయస్థానాల జోక్యం విషయాల మీద భ్రమలు తొలిగి వాటి బలాలు, బలహీనతలు బయటపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలు విఫలమైనప్పుడు ప్రజలకు తిరుగుబాటే శరణ్యం అవుతుంది.

■ **జి. హనుమంతరావు**

చైర్మన్, ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఏపీ అండ్ తెలంగాణ

# తుక్డే తుక్డే గ్యాంగులే విజేతలు!

■ పి. చిదంబరం



'పళని' పలుకు

పార్లమెంటు సమావేశాల్లో గౌరవనీయ సభ్యులు (ముఖ్యంగా విపక్షాలకు చెందినవారు) ప్రభుత్వంపై ప్రశ్నాస్త్రాలు సంధిస్తారు. ఒకోసారి పలు ప్రశ్నలకు లేదా ఒకే ప్రశ్నలోని వివిధ అంశాలకు కలిపి ఒకటే సమాధానం రావడం కద్దు. అటువంటి ముచ్చట నొకదాన్ని ప్రస్తావించదలుచుకున్నాను.ఈనెల 11న లోక్‌సభ కార్యకలాపాల రికార్డులో ఈ క్రింద పేర్కొన్న ప్రశ్న, సమాధానం నమోదయింది (ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రి, ఇతర మంత్రులతో సహా భారతీయ జనతా పార్టీ నాయకుల ఉద్ఘాటనలు, వక్కాణింపులపై ఆ ప్రశ్నోత్తరాలు ఒక బాధాకరమైన వ్యాఖ్యానం కానట్టయితే అవెంతో ఉల్లాసం కలిగించేవే సుమా!)

సరే, ప్రశ్నకు వద్దాం. (అ) 'తుక్డే తుక్డే గ్యాంగ్' అనే సంస్థ దేనినైనా గుర్తించి, దాన్ని హోం మంత్రిత్వ శాఖ, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, లేదా మరే ఇతర కేంద్ర/ రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణ సంస్థల/ పోలీసు విభాగాల లేదా ఏదైనా కేంద్ర/ రాష్ట్ర గూఢచార సంస్థల వర్గీకృత జాబితాలలో చేర్చారా? (ఆ) 'తుక్డే తుక్డే గ్యాంగ్' అనే పరిభాషను హోం మంత్రిత్వ శాఖ లేదా ఇతర లా ఎన్‌ఫోర్స్‌మెంట్ / ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అందించిన సమాచారం ఆధారంగా సృష్టించారా? (ఇ) 'తుక్డే తుక్డే గ్యాంగ్' నాయకులు, సభ్యులుగా భావిస్తున్న వ్యక్తుల జాబితాను హోం మంత్రిత్వ శాఖ / నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లేదా మరేవైనా శాంతిభద్రతల పరిరక్షణ లేదా గూఢచార సంస్థలు రూపొందించాయా? (ఈ) 'తుక్డే తుక్డే గ్యాంగ్ ' సభ్యులపై (భారతీయ విచారణా స్మృతి లేదా ఇతర చట్టాలలోని ఏ నిబంధనల కింద) శిక్షార్హమైన చర్యలు చేపట్టేందుకు హోం మంత్రిత్వ శాఖ లేదా మరే ఇతర లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు లేదా గూఢచార సంస్థలు సంకల్పించాయా? (ఉ) సంకల్పించినట్టయితే వాటి వివరాలు తెలియజేస్తారా?

ఈ ప్రశ్నలకు ప్రభుత్వం ఇలా సమాధానమిచ్చింది: శాంతిభద్రతల పరిరక్షణ సంస్థ ఏదీ అటువంటి సమాచారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురాలేదు.

2019 మే నెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారాన్ని మళ్ళీ స్వాయత్తం చేసుకున్నది. తదాది, భారత్ సమైక్యత, సమగ్రతలకు ప్రమాదం ముంచుకొస్తోందని, ఈ సువిశాల దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు వివిధ బృందాలు చురుగ్గా పనిచేస్తున్నాయనేది వాస్తవమని చాలామంది భారతీయులు విశ్వసించేలా చేయడంలో పాలకులు సఫలమయ్యారు. ఈ విచ్ఛిన్నకర బృందాలను వేర్వేరు సమయాలలో నక్సలైట్లు, మావోయిస్టులు, ఇస్లామిక్ ఉగ్రవాదులు, అర్బన్ నక్సల్స్ వంటి వివిధ పేర్లతో ప్రజల దృష్టికి తీసుకు వెళ్ళారు. ప్రతిష్ఠాత్మక జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలోని ఒక విద్యార్థి సంఘం నిరసన ప్రదర్శన (ఈ ఘటన కారణంగా కన్నయ్య కుమార్, మరో ముగ్గురు విద్యార్థినేతలపై దేశద్రోహ అభియోగాలు మోపారు!) నిర్వహించిన అనంతరం, ఆ విద్యార్థి నిరసనకారులపై 'తుక్డే తుక్డే గ్యాంగ్' అనే ముద్ర వేశారు. గమనార్హమైన విషయమేమిటంటే బీజేపీ ప్రభుత్వ విధానాలు, కార్యాచరణలను వ్యతిరేకిస్తున్న ప్రతి బృందంపైన ఇదే ముద్ర వేయడం ఒక ఆనవాయితీ అయిపోయింది. చివరకు తుక్డే తుక్డే గ్యాంగ్ అనే నామధేయం రాజకీయ చర్చలలోకి కూడా ప్రవేశించింది. నాగరిక సభ్యతలు పరిపూర్ణంగా తెలిసిన విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్ కూడా తరచూ ఆ పరిభాషను ఉపయోగించడం ఎంతైనా విచారకరం.

స్వల్ప కాలంలోనే పలు బృందాలపై ఈ ముద్రవేయడంతో తుక్డే తుక్డే గ్యాంగ్స్ అనేవి నిజంగా వున్నాయని, దేశ సమైక్యత, ప్రయోజనాలకు ప్రమాదకరంగా అవి విస్తరిస్తున్నాయని ప్రజలు విశ్వసించకతప్పని పరిస్థితి ఏర్పడింది. విద్యావేత్తలు, ఆర్థిక వేత్తలు, రచయితలు, కళాకారులు, విద్యార్థులు, కార్మిక సంఘాల నాయకులు, రైతులు, నిరుద్యోగ యువజనులు, మహిళలు, బాలలు, ప్రతిపక్ష రాజకీయ నాయకులు మొదలైన వారందరూ తుక్డే తుక్డే గ్యాంగ్ సభ్యులు అనే ప్రఖ్యాతిని సముపార్జించుకున్నారు. పౌరసత్వ సవరణ చట్టం, ప్రతిపాదిత జాతీయ జనాభా పట్టిక ప్రక్రియకు వ్యతిరేకంగా వందలాది మహిళలు, బాలలు (న్యూఢిల్లీలోని) షాహీన్ బాగ్‌లో అవిరామంగా నిరసన తెలుపుతున్నారు. తుక్డే తుక్డే గ్యాంగ్ అనే ముద్ర తాజాగా సముపార్జించుకున్న బృందాలు షాహీన్ బాగ్ నిరసనకారులే. ఈ గుంపుల జాబితా రోజురోజుకూ పెరుగుతూనే వున్నది .

ఇటీవలే ముగిసిన ఢిల్లీ విధానసభ ఎన్నికల ప్రచార ఘట్టంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు ర్యాలీలలో ప్రసంగించారు. రెండు ర్యాలీలలోనూ తుక్డే తుక్డే గ్యాంగ్‌లపై ఆయన ధ్వజమెత్తారు. ఈ తుక్డే తుక్డే గ్యాంగుల నిరసన ప్రదర్శనల చిత్రమాలికలను వార్తా పత్రికలు, టెలివిజన్ ఛానెల్స్, సామాజిక మాధ్యమాలు నిత్యం చూపుతూనే వున్నాయి. అయితే ఒక చిన్న సమస్య ఉన్నది. తుక్డే తుక్డే గ్యాంగుల సభ్యులు ఒక చేతిలో జాతీయ పతాకంతో, మరో చేతిలో భారత రాజ్యాంగం ప్రతితో నిరసన ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు. అంతేకాకుండా వారు తరచూ జాతీయ గీతాలను మహోత్సాహంగా ముక్త కంఠంతో ఆలపిస్తున్నారు. మరి ఈ తుక్డే తుక్డే గ్యాంగులకు వ్యతిరేకంగా అధికార పార్టీ ప్రముఖులు చేస్తున్న విమర్శలు, ఆరోపణలను మీడియాలో ఆ గుంపులకు సంబంధించిన చిత్రమాలికలు ధ్రువపరచడం లేదు. రెండూ పరస్పర విరుద్ధంగా ఉంటున్నాయి. ఈ వైరుధ్యాన్ని ప్రజలు గమనించారు. ప్రతి సామాజిక సమూహమూ తాను దేనినైతే విశ్వసించదలుచుకున్నదో దానినే పరిపూర్ణంగా నమ్మినట్టు కనిపిస్తున్నది.




> ఢిల్లీ ఎన్నికలు భారత్‌కు 'వియత్నాం ప్రాముఖ్యత'ని సమకూర్చాయి. దేశ రాజధాని పౌరుల ఆశ్చర్యజనక తీర్పుతో లౌకికవాదం, సమానాధికారాన్ని సమర్థించిన సార్థక విజయం భారత ప్రజాస్వామ్యానికి లభించింది. తుక్డే తుక్డే గ్యాంగులు గెలిచాయి! తమ రాజ్యాంగ లక్ష్యాలను సాధించుకునే దాకా ఆ సమూహాలు మరింత శక్తిమంతమవుతూ వర్ధిల్లుగాక !!

ఇటీవల పార్లమెంటులో ఒక మంత్రి చేసిన ప్రకటన ఎంతో మందిని ఉలికిపాటుకు గురి చేసింది. గత కొద్ది నెలలుగా తాము చేసిన ఆరోపణలకు, మంత్రి ప్రకటనకు మధ్య వున్న ద్వైధీభావాన్ని వివరించేందుకు భారతీయ జనతా పార్టీ నాయకుడు ఎవరూ ముందుకు రావడం లేదు. మితవాద భావజాలంలో అసాధారణమైనదేదీ లేదు. ఆ భావజాలం స్వతసిద్ధంగా లోపభూయిష్టమైనదీ కాదు. మితవాద నాయకులు ప్రగాఢ మత విశ్వాసులుగా వుండడం కద్దు. అయితే మితవాద నాయకులు మతాన్ని రాజకీయీకరణ చేసి, మతం ఆధారంగా ప్రజల మధ్య చీలికలు సృష్టించడానికి (నా మతమూ, నీ మతమూ అనే భావనను సృష్టించడం) ప్రయత్నించినప్పుడే రాజ్యాంగం ఉల్లంఘనకు గురవుతున్నది, సామాజిక సామరస్యం విచ్ఛిన్నమవుతున్నది. భారతీయ జనతా పార్టీ సరిగ్గా ఇదే చేసింది. వివిధ వర్గాల ప్రజలలో భయాందోళనలు సృష్టించి, అనిశ్చితి పరిస్థితులను కల్పించేందుకై గత ఆరు సంవత్సరాలుగా ప్రభుత్వంలోనూ, రాజ్య వ్యవస్థకు సంబంధించిన ఇతర సంస్థలలోనూ తమ మత విశ్వాసాలను ఆయుధాలుగా ఉపయోగించే వ్యక్తులకు గత ఆరు సంవత్సరాలుగా ప్రభుత్వంలోను, రాజ్యవ్యవస్థకు సంబంధించిన వివిధ సంస్థలలోను కీలక బాధ్యతలు అప్పగిస్తోంది. విఖ్యాత రాజనీతిశాస్త్రవేత్త డాక్టర్ నీరా చంధోకే (ఢిల్లీ విశ్వ విద్యాలయం) ఇలా వ్యాఖ్యానించారు: 'రాజకీయీకరణ అయిన అధికారానికి, మత ప్రయోజనాలకు ఉపయోగపడుతున్న అధికారానికి, మతసంబంధిత అస్తిత్వాలను స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్న అధికారానికి వ్యతిరేకంగా లౌకికవాదం పోరాడుతున్నది. రాజకీయీకరణ అయిన మతం రాజ్యవ్యవస్థను స్వాయత్తం చేసుకోకుండా రాజకీయీకరణ అయిన మతాన్ని నియంత్రించే ప్రయత్నమే లౌకికవాదం. మన సమాజంలో ఇటువంటి ప్రయత్నాలు తప్పనిసరి. ఎందుకంటే మత ప్రాతిపదికన మన దేశ విభజన జరిగింది. రాజకీయాలలో మత ప్రమేయాన్ని నిరోధించినప్పుడే సామాజిక సామరస్యం వర్ధిల్లుతుంది'.

మతాన్ని రాజకీయ లక్ష్యాలకు ఉపయోగించుకుంటున్న వారికి, రాజకీయీకరణ, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోదలుచుకున్నవారికి మధ్య ప్రస్తుతం కొట్లాట జరుగుతున్నది. ఈ ఘర్షణ ఢిల్లీ, లక్నో, కొల్‌కతా, హైదరాబాద్ , పుణే, కోచి వీధులలోను, ఇంకా దేశ వ్యాప్తంగా అనేక చిన్న పట్టణాలలోను, విశ్వవిద్యాలయాలలోనూ కొనసాగుతున్నది. మన లౌకిక, ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాన్ని రక్షించుకోవాలనే అవగాహన వున్నవారందరూ ఈ ధర్మపోరాటంలో పాల్గొంటున్నారు. ఈ ధర్మ పోరాటం చేస్తున్న, ఆ సమరాన్ని మరింత విస్తృతంగా ప్రజాశ్రేణుల్లోకి తీసుకువెళుతున్న వ్యక్తులు రాజకీయ పార్టీలకు చెందిన వారు కాదనేది గమనార్హమైన విషయం. సాధారణంగా ఇంటి పట్టునే వుండే మహిళలు, బాలలు, ప్రభుత్వాల తీరుతెన్నులతో తీవ్ర అసంతృప్తితో వున్న యువజనులు, రాజకీయాల పట్ల నిర్లిప్తులైన విద్యార్థులు ఈ పోరాటంలో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రచండ శీతగాలులు, భాష్పవాయు గోళీలు, లాఠీలు, చివరకు బుల్లెట్లకు సైతం వారు ఏమాత్రం భయపడడం లేదు (ఉత్తరప్రదేశ్‌లో ఈ నిరసనకారులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో 23 మంది చనిపోయారు). ఢిల్లీ ఎన్నికలు భారత్‌కు 'వియత్నాం ప్రాముఖ్యత'ని సమకూర్చాయి. దేశ రాజధాని పౌరుల ఆశ్చర్య జనక తీర్పుతో లౌకికవాదం, సమానాధికారాన్ని సమర్థించిన సార్థక విజయం భారత ప్రజాస్వామ్యానికి లభించింది. తుక్డే తుక్డే గ్యాంగులు గెలిచాయి! తమ రాజ్యాంగ లక్ష్యాలను సాధించుకునే దాకా ఆ సమూహాలు మరింత శక్తిమంతమవుతూ వర్ధిల్లుగాక!!

*(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)*

# కశ్మీర్‌లో 'మిత్ర' ద్రోహం

■ రామచంద్ర గుహ



గతానుగతం




జ్ఞానసక్తికి వృత్తిపరమైన పరిమితులు వుండవు. ఢిల్లీ న్యాయవాది అనీల్ నారియా అటువంటి జ్ఞాన సంపన్నులలో ఒకరు. భారతదేశ చరిత్ర, రాజకీయాలపై సమగ్ర అవగాహన, నిష్పాక్షిక వివేచనతో ఆయన స్ఫూర్తిదాయకమైన విద్వత్ కృషి చేశారు. న్యాయవాద వృత్తిలో తలమునకలై వుండి కూడా విశ్రాంత వేళలలో ఆయన రాసిన పరిశోధనాత్మక వ్యాసాలు సత్యావిష్కరణకు నిండు తార్కాణాలు. ఆయన రాసిన పలు వ్యాసాలను, అవి మొట్టమొదట ప్రచురితమైనప్పుడే చదివి నా అవగాహనను పెంపొందించుకున్నాను, నా జ్ఞానపరిధిని మరింత విస్తృతం చేసుకున్నాను. ప్రచురితమైన పలు సంవత్సరాల అనంతరం కూడా నేను తరచూ వాటిని చదువుతుంటాను. భారత స్వాతంత్ర్యోద్యమం మీద; గాంధీ, భగత్‌సింగ్, ఇంకా సావర్కార్ మొదలైన చరిత్ర నిర్మాతల మీద అనీల్ నారియా అసాధారణ అంతర్దృష్టి, సాధికారతతో రాశారు. అయితే వర్తమాన చర్చనీయాంశాలకు ఉపయుక్తమైన రెండు వ్యాసాల గురించి మాత్రమే ప్రస్తావిస్తాను. జమ్మూకశ్మీర్ రాష్ట్ర రాజకీయాల గురించి కొన్ని సంవత్సరాల క్రితం రాసిన వ్యాసాలవి.

మొదటి వ్యాసం 2002 ఆగస్టులో ఢిల్లీ మ్యాగజైన్ 'మెయిన్ స్ట్రీమ్'లో వెలువడింది. నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు అడ్డూఅదుపు లేకుండా సాగించిన హత్యాకాండను విపులంగా వివరించిన వ్యాసమది. 1989లో కశ్మీర్‌లో జిహాదీ తిరుగుబాటు ప్రారంభమయింది. స్వతంత్ర కశ్మీర్ ఏర్పాటే లక్ష్యం కావాలని కొందరు ఉద్యమించారు. అలా కాకుండా పాకిస్థాన్‌లో విలీనమవ్వడం మంచిదని మరికొందరు గట్టిగా అభిప్రాయపడ్డారు. ఈ రెండు ప్రత్యామ్నాయాలను నిర్ద్వంద్వంగా తిరస్కరించి, భారతరాజ్యాంగం పరిధిలో న్యూఢిల్లీతో ఒక ఒప్పందానికి రావడమే కశ్మీర్ ప్రజలకు శ్రేయస్కరమని ఇంకొందరు వాదించారు. అయితే స్వతంత్ర కశ్మీర్ ఏర్పాటు లేదా పాక్‌లో విలీనాన్ని డిమాండ్ చేస్తున్న వారు భారత్‌లోనే ఉండిపోవాలని అభిలషిస్తున్నవారిపై ఒక పథకం ప్రకారం దాడులు చేయడం ప్రారంభించారు.

1990 దశకంలో ఉగ్రవాద అమానుషాలు ఉధృతమయ్యాయి. భారత్‌లో అంతర్భాగంగా ఉండిపోవాలని కోరుతున్నవారు ఉగ్రవాదుల దృష్టిలో శత్రువులుగా మారిపోయారు. పాకిస్థాన్ ఆయుధ సహాయం, ఆర్థిక మద్దతు పొందుతున్న ఉగ్రవాదులు భారత్ అనుకూల వర్గాల వారిపై దాడులకు పూనుకున్నారు. ముఖ్యంగా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ కార్యకర్తలు ఉగ్రవాద హింసాకాండకు బలయ్యారు. షేక్ అబ్దుల్లా నేతృత్వంలో ఆవిర్భవించిన క్షణం నుంచీ నేషనల్ కాన్ఫరెన్స్ లౌకికవాద విలువలకు కట్టుబడివున్న పార్టీ. మతప్రోక్త పాకిస్థాన్ రాజ్యవ్యవస్థను ఈ పార్టీ మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నది. 1990–2002 మధ్య ఇస్లామిక్ ఉగ్రవాదుల హింసాకాండను ఎదుర్కొని బలయిన నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు, కార్యకర్తల గురించి అనీల్ తన వ్యాసంలో వివరించారు. ఇలా హతులైన వారిలో శాసనసభ్యులే గాక గ్రామ స్థాయి, సమితి స్థాయి నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు డజన్ల సంఖ్యలో ఉన్నారు. పార్టీ అగ్రనాయకుడు డాక్టర్ ఫరూఖ్ అబ్దుల్లాపై ఉగ్రవాదులు పలుమార్లు హత్యాయత్నం చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుల, కార్యకర్తల హత్యాకాండను అంతర్జాతీయ మీడియా పూర్తిగా విస్మరించింది. భారతీయ మీడియా సైతం ఆ హత్యాకాండ గురించి ఏ మాత్రం పట్టించుకోక పోవడం మరింత శోచనీయం.

ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి అనీల్ నారియా యాభైమందికి పైగా నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుల, కార్యకర్తల హత్యా వివరాలను అక్షరబద్ధం చేశారు. నిజానికి ఆ హతుల జాబితా కేవలం సూచనాత్మకమైనదే గానీ, సమగ్రమైనది కాదు. ఇంకా పలువురు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు ఉగ్రవాద హింసాకాండకు తప్పక బలయివుంటారని ఆయన పేర్కొన్నారు.

ఈ హత్యాకాండ వెనుకవున్న కటువైన రాజకీయ తర్కం గురించి అనీల్ నారియా ఇలా వివరించారు: 'గత యాభై సంవత్సరాలుగా కశ్మీర్‌లో భారత్ లెక్కకు మించిన తప్పులు చేసింది. అయినప్పటికీ కశ్మీరీ ముస్లింలు భారత రాజ్యాంగ పరిధిలో చర్చల ద్వారా సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవడానికి సుముఖంగా ఉన్నారు. ఇది జరగకూడదని ఉగ్రవాదులు నిశ్చయించుకున్నారు. అందుకే అటువంటి భారత్ అనుకూల అభిప్రాయంతో వున్న వారిని భౌతికంగా అంతమొందించేందుకు పూనుకున్నారు'. అనీల్ ఇంకా ఇలా రాశారు: 'భారతదేశంలోని అత్యంత పురాతన రాజకీయ పార్టీలలో నేషనల్ కాన్ఫరెన్స్ ఒకటి. ఇప్పుడు ఈ పార్టీ మనుగడకు ముప్పు ముంచుకొస్తోంది. ఎన్నికలలో ఓడించడం ద్వారా కాకుండా, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులను భౌతికంగా అంతమొందించడం ద్వారా ఆ పార్టీని కశ్మీర్ రాజకీయ జీవితం నుంచి తుడిచి పెట్టేందుకు ఇస్లామిక్ ఉగ్రవాదులు పూనుకున్నారు. వారు పాల్పడుతున్న హత్యాకాండ తీవ్రత సగటు భారతీయునికి పూర్తిగా తెలియని విషయం. నిజం చెప్పాలంటే ఈ మహోన్నత లౌకికవాద పార్టీని కాపాడే విషయం గురించి భారత ప్రజలు ఏ మాత్రం పట్టించుకోలేదు. ఆ పార్టీ భవిష్యత్తు గురించి బాధపడిన రాజనీతి శాస్త్రవేత్తలు బహు కొద్ది మంది మాత్రమే. ఆ పార్టీ చరిత్రను రికార్డు చేసిన చరిత్రకారులు సైతం పెద్దగా లేరు. ఉగ్రవాదులు ఆ పార్టీ కార్యకర్తలను చంపడం ప్రారంభమయినప్పుడు ఆ అమానుష ఘటనల గురించి మీడియా పట్టించుకోనేలేదు. పట్టించుకున్నా అప్రాధాన్య వార్తలుగా మాత్రమే నివేదించాయి. ఉబుసుపోక కబుర్లుగా ఆ హత్యల వివరాలను అందించాయి. ఉగ్రవాద బీభత్సంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఎంతగా నష్టపోతుందో విశాల భారతదేశానికి సమగ్రంగా తెలియజేయడంలో భారతీయ మీడియా ఉపేక్ష వహించింది'.

అనీల్ నారియా రెండో వ్యాసం 2005లో చండీగఢ్ పత్రిక 'ది ట్రిబ్యూన్'లో వచ్చింది. పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ కార్యకర్తలు ఉగ్రవాద హింసాకాండకు ఎలా లక్ష్యమవుతున్నదీ ఈ వ్యాసంలో ఆయన సవివరంగా తెలిపారు. ఈ వ్యాసం వెలువడిన నాటికి మూడు సంవత్సరాల క్రితం జమ్మూకశ్మీర్‌లో పీడీపీ అధికారంలో వున్నది. కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని పీడీపీ ఏర్పాటు చేసింది. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన కారణంగా పీడీపీ కార్యకర్తలను శత్రువులుగా ఉగ్రవాదులు పరిగణించారు. హింసాకాండ ప్రజ్వరిల్లింది. ముప్పై మందికి పైగా పీడీపీ నేతలు, కార్యకర్తలను ఉగ్రవాదులు బలిగొన్నారు. అధికారాన్ని కోల్పోయిన తరువాత కూడా పీడీపీ కార్యకర్తలు ఉగ్రవాదుల కిరాతకాలకు బలవుతూనే వున్నారు. అనీల్ ఇలా వ్యాఖ్యానించారు: 1989లో హిందూత్వ ఉద్యమం ఉధృతమయిన దరిమిలా భారతదేశమంతటా, మరీ ముఖ్యంగా నరేంద్ర మోదీ పాలనలో ఉన్న గుజరాత్‌లో మైనారిటీ వర్గాల వారిని, ప్రత్యేకించి ముస్లింలను జాతి వ్యతిరేకులుగా విష ప్రచారం చేయడం ప్రారంభమయింది. ఇందుకు విరుద్ధంగా కశ్మీర్‌లో సంప్రదాయ ముస్లిం నాయకులను నిర్మూలించే క్రూరత్వానికి ఉగ్రవాదులు పాల్పడ్డారు. ఆ సంప్రదాయ ముస్లిం నాయకులు భారత్‌కు అనుకూలంగా ఉన్నారనే నెపంతో ఉగ్రవాదులు వారి జీవితాలను చిదిమివేశారు.'

> ఇప్పుడు కశ్మీరీలకు మనం ఏమి చెయ్యాలి? కశ్మీరీలను మరింత గౌరవాదరాలతో చూడాలి. విలక్షణ, సమున్నత కశ్మీరీ సంస్కృతిని గౌరవించి కాపాడాలి. కశ్మీరీల మత విశ్వాసాలను సమాదరించాలి. భారత జాతీయ ఆర్థిక వ్యవస్థలో యువ కశ్మీరీల వృత్తిగత పురోగతికి అన్నివిధాల తోడ్పడాలి. ఇవన్నీ జరిగిన నాడు, స్వతంత్ర దేశంగా ఏర్పడడం లేదా పాకిస్థాన్‌లో విలీనమవడం కంటే భారత్‌లో అంతర్భాగంగా వుండేందుకు కశ్మీరీలు తప్పక మొగ్గుచూపుతారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు.

నరేంద్రమోదీ ప్రభుత్వం ఇప్పుడు నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ అగ్రనాయకులను నిరవధిక గృహ నిర్బంధానికి గురిచేసిన నేపథ్యంలో అనీల్ నారియా వ్యాసాలను మరోసారి చదవాల్సిన అవసరం ఎంతైనావున్నది. 2019 ఆగస్టు 5న అధికరణ 370 ని రద్దుచేసిన తరువాత, న్యూఢిల్లీ పాలకులు ఒక అనుచిత చర్యకు పాల్పడ్డారు. భారత్ పక్షం వహించిన కశ్మీరీ నాయకులను అన్యాయంగా జైలు పాలు చేయడమే ఆ అమానుషం. ఇదొక విషాదకర పరిణామం. అవినీతి, వంశపారంపర్య పాలనతో సహా ఎన్ని అవలక్షణాలు ఉన్నప్పటికీ నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ నాయకులు భారత్‌కు అనుకూలురు. భారత రాజ్యాంగ పరిధిలో భారత ప్రభుత్వంతో గౌరవప్రదమైన ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే అన్ని విధాల శ్రేయస్కరమని విశ్వసిస్తున్న కశ్మీరీ ముస్లింలకు ఆ నాయకులు ప్రతినిధులు. కశ్మీర్‌లో భారత్‌కు అనుకూలంగా ఉన్న వారు కశ్మీరీ ప్రజానీకంలో ఎన్నడూ అత్యధిక సంఖ్యలో లేకపోవచ్చునేమో కానీ ఆ మైనారిటీ వర్గం పలుకుబడి ఎన్నడూ నిరర్థకమైనది కాదు. 1990 దశకంలో ఉగ్రవాదులు కశ్మీర్‌ను రక్తసిక్తం చేశారు. అయితే, 2002 ఎన్నికల అనంతరం హింసాకాండ తగ్గుముఖం పట్టింది. ఆ అందాల భూమికి పర్యాటకుల రాక మళ్ళీ ప్రారంభమయింది. కశ్మీర్ వివాదాన్ని శాశ్వతంగా పరిష్కరించేందుకు అదొక మంచి అవకాశమని ఆనాటి ప్రధానమంత్రి వాజపేయి భావించారు. కశ్మీరీలకు స్నేహ హస్తాన్ని చాచారు. ఆయన అనంతరం ప్రధాన మంత్రి అయిన డాక్టర్ మన్మోహన్ సింగ్ కూడా భారత్ భావనను సామాన్య కశ్మీరీలకు మరింత ఆమోదయోగ్యంగా చేయవలసిన అవసరాన్ని గుర్తించారు. రాజ్యాంగ బహుత్వవాదంతోనూ, ఆర్థికాభివృద్ధి ఫలాలను అందించడం ద్వారా కశ్మీరీలను భారత్‌కు సంపూర్ణంగా సన్నిహితులను చేసేందుకు ఆయన సంకల్పించారు.

ఇప్పుడు మనం కశ్మీరీలకు ఏమి చెయ్యాలి?

కశ్మీరీలను మరింత గౌరవాదరాలతో చూడాలి. వారి విలక్షణ, సమున్నత సంస్కృతిని గౌరవించి కాపాడాలి. వారి మత విశ్వాసాలను సమాదరించాలి. భారత జాతీయ ఆర్థిక వ్యవస్థలో యువ కశ్మీరీల వృత్తిగత పురోగతికి అన్నివిధాల తోడ్పడాలి. ఇవన్నీ జరిగిన నాడు, స్వతంత్ర దేశంగా ఏర్పడడం లేదా పాకిస్థాన్‌లో విలీమవడం కంటే భారత్‌లో అంతర్భాగంగా వుండేందుకు కశ్మీరీలు తప్పక మొగ్గుచూపుతారు. ఈ సంభావ్యతలో ఎలాంటి సందేహం లేదు.

అయితే, 2019 ఆగస్టు 5న, ఆ తరువాత మోదీ ప్రభుత్వం కశ్మీర్‌లో చేపడుతున్న చర్యలు ఈ ఆశాభావాన్ని పూర్తిగా ధ్వంసం చేసేశాయి. మళ్ళీ చాలా సంవత్సరాలకు గానీ ఆ ఆశలు మోసులెత్తే అవకాశం లేదు. విశాల భారతదేశంలో మరెవ్వరికీ లేని విధంగా తమకు మాత్రమే ఇంటర్నెట్, ఇతర అధునాతన కమ్యూనికేషన్స్ సదుపాయాలను పూర్తిగా నిలిపివేసినప్పుడు భారత్ జాతీయ ఆర్థిక వ్యవస్థలో తమ ఎదుగుదలకు అవకాశమున్నదని కశ్మీరీలు ఎలా విశ్వసిస్తారు? భారత ప్రభుత్వ నిర్ణయాలు, కార్యాచరణలు తమ పండ్లతోటల సాగును, పర్యాటక రంగాన్ని, హస్తకళల పరిశ్రమలను చావుదెబ్బ కొట్టినప్పుడు, భారత్ తమ సంక్షేమానికి పూచీ వహిస్తుందని కశ్మీరీలు ఎలా భావిస్తారు? కేంద్రంలోని అధికార పక్షం, ప్రభుత్వం, మంత్రులు అనుక్షణమూ ముస్లింలను ప్రమాదకారులుగా చిత్రిస్తున్నప్పుడు తమ సంస్కృతిని భారత్ గౌరవిస్తుందని ఎలా అనుకోగలుగుతారు? ఎన్నడూ హింసాకాండను ప్రేరేపించని, హింసాత్మక పద్ధతులను అనుసరించని, భారత రాజ్యాంగానికి పూర్తిగా నిబద్ధమైన తమ మాజీ ముఖ్యమంత్రులు ముగ్గురిని నిరవధిక గృహనిర్బంధంలో ఉంచిన భారత ప్రభుత్వాన్ని కశ్మీరీలు రాజకీయంగా ఎలా విశ్వసిస్తారు?

1990వ దశకంలో పాకిస్థాన్ అండదండలతో ఉగ్రవాదులు కశ్మీర్ ప్రధాన స్రవంతి నాయకులను తమ లక్ష్యంగా చేసుకున్నారు. ఇప్పుడు ఆ నాయకుల నిర్బంధాన్ని, అణచివేతను భారత ప్రభుత్వమే లక్ష్యంగా చేసుకున్నది! కశ్మీర్ లోయలో ఇస్లామిక్ ఉగ్రవాదం మరణ మృదంగం మోగిస్తున్నప్పుడు భారత్ లౌకిక వ్యవస్థ, సమ్మిళిత సంస్కృతిని సంరక్షించేందుకు జీవితాలను త్యాగం చేసినవారు నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ కార్యకర్తలు మాత్రమేనని అనీల్ నారియా సప్రమాణంగా చరిత్రబద్ధం చేశారు. మరి ఇప్పుడు మన ప్రభుత్వమే ఆ రెండు పార్టీల నాయకులను సందేహాస్పద, అల్పమైన ఆరోపణలపై గృహనిర్బంధంలో ఉంచింది! ఇది మిత్ర వంచన కాదూ? కశ్మీర్‌లో మన పక్షాన నిలబడినవారిని ఇలా వేధించడం భారత్‌కు మేలు చేస్తుందా?

*(వ్యాసకర్త చరిత్రకారుడు)*

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 15 ఫిబ్రవరి 2020
navya@andhrajyothy.com





ఆహారం- ఆరోగ్యం

# సరైన డైట్‌తో శరీర దుర్గంధానికి చెక్!

**తేన్పులు వచ్చినపుడు నోట్లో నుంచి చెడు వాసన వస్తోంది. నోటి దుర్వాసన కూడా ఉన్నట్టు అనిపిస్తోంది. ఇవి పోవాలంటే తీసుకోవాల్సిన డైట్ గురించి చెప్పండి. శరీర దుర్గంధానికి, డైట్‌కి సంబంధం ఉందా?**

**- వాసంతి,** హైదరాబాద్

మీరు మూడు ప్రశ్నలు అడిగారు. నోటి దుర్వాసన, తేన్పులు, శరీర దుర్గంధం... నోటి దుర్వాసన అనేది కేవలం నోటికి సంబంధించినది. రెండు పూటలా పళ్లు తోమకపోవడం, ఆహారంలో ఫ్రూట్స్, వెజిటెబుల్స్ లేకపోవడం, నిద్రకు ముందు తీపి పదార్థాలు తిని నోరు కడుక్కోకపోవడం, పళ్లకు పుచ్చులు, రంధ్రాలు ఉంటే వాటికి చికిత్స చేయించుకోకపోవడం వల్ల బ్యాక్టీరియా చేరి దుర్వాసన వస్తుంది. ఇది ఇన్ఫెక్షన్‌కి దారి తీస్తుంది. నోటి దుర్వాసన రాకుండా ఉండాలంటే ఆహారంలో పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా తీసుకోవాలి. రెండు పూటలా దంతాలు శుభ్రం చేసుకోవాలి.

తేన్పుల విషయానికొస్తే... సరిగా అరుగుదల లేకపోవడం వల్ల, ఎక్కువ కొవ్వు ఉన్న పదార్థాలు తినడం వల్ల, పండ్లు కూరగాయలు సరిగా తినకపోవడం వల్ల, మందులు, ఇన్‌ఫెక్షన్స్ వల్ల వచ్చే అవకాశం ఉంది. కారణం తెలుసుకుని తగిన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా ఆహారంలో పండ్లు, కూరగాయలు, మజ్జిగ అధికంగా ఉండేట్టు చూసుకోవాలి. ప్రతి రోజూ సులువుగా మల విసర్జన జరిగేలా చూసుకోవాలి. నీరు బాగా తాగాలి.

శరీర దుర్గంధం అనేది మనం తీసుకునే ఆహారం, వేసుకునే బట్టలు, చెమట, బ్యాక్టీరియా, వాడే సబ్బులు, పెర్‌ఫ్యూమ్స్ వల్ల మార్పు చెందుతూ ఉంటుంది. శరీర శుభ్రత అనేది శరీర దుర్గంధాన్ని డిసైడ్ చేస్తుంది. ముఖ్యంగా జెనిటల్స్ శుభ్రత, మల మూత్ర విసర్జన తర్వాత తీసుకునే జాగ్రత్తలు, నావల్ (నాభి), చంకలు, చెవులు, ముక్కు, నోరు శుభ్రతపై కూడా ఆధారపడి ఉంటుంది. ప్రతిరోజూ ఆహారంలో పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా ఉండాలి. ఇవి శరీర మలినాలను విసర్జించడమేగాక, కొత్త కణాల్ని పుట్టించి ఆరోగ్యాన్ని ఇస్తాయి. శరీరాన్ని కాంతిమంతం చేస్తాయి. శరీర పరిశుభ్రత అంటే కేవలం చెడు వాసన నివారించడానికే కాకుండా, ఆరోగ్యం కోసం కూడా అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆహారం, వ్యాయామం, నిద్ర ఎంత ముఖ్యమో, శరీర శుభ్రత కూడా ఎవరికైనా అంతే ముఖ్యం.



• **డాక్టర్ బి.జానకి,** న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com

---

విశేషం

**ఒకవైపు ముస్లిం సంప్రదాయం... మరోవైపు బతుకు సమరం... మహిళల పట్ల కఠినమైన ఆంక్షలున్న పాకిస్థాన్‌లో ఒక మహిళ మగాడిలాగా ఇంటి నుంచి బయటకు వచ్చింది. వేషం మార్చుకుని కాయకష్టం చేయడం మొదలెట్టింది. తన చిన్నారి కోసం ఆ తల్లి చేసిన సాహసం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది.**

# అతడు కాదు ఆమె!



కూతురుతో

పాకిస్థాన్‌లో 'నాకు నచ్చినట్టు బతుకుతాను' అని ఒక మహిళ బయటకు అడుగుపెట్టడం ఆషామాషీ కాదు. ఆమె అడుగు ముందుకు పడదు... సాయం అందదు. కానీ లాహోర్‌కు చెందిన ఫర్వీన్‌కు అడుగు బయట పెట్టాల్సి వచ్చింది. ఆమె మగాడై ఉంటే... లేదా ఆ ఇంట్లో ఒక అబ్బాయి అయినా ఉండుంటే ఫర్వీన్‌కు ఆ అవసరం ఉండేది కాదేమో! కానీ తను బతకడానికి, తన బిడ్డను బతికించుకోవడానికి ఆ తల్లి రూపం మార్చుకోవాల్సివచ్చింది. మగాడిలా దుస్తులు ధరించింది. జుత్తును కత్తిరించింది. భద్రత కోసం పురుషుడిలా జీవనం సాగిస్తోంది! మనుగడ కోసం మగాడి రూపంలో ఒదిగిపోయింది. ఇంట్లో సంపాదించే మగాడు లేని పరిస్థితుల్లో తనతోపాటు తొమ్మిదేళ్ల కూతురు కడుపు నిండాలంటే తను పనిచేయక తప్పదు మరి.

అందుకే ఫర్వీన్ ఓ ఉపాయం ఆలోచించింది. జుట్టును పొట్టిగా కత్తిరించింది. టీషర్ట్, జీన్స్ ప్యాంట్ అచ్చం మగాడిలానే డ్రెస్ చేసుకొంది. జీవనోపాధి కోసం లాహోర్‌లోని అనార్కలి బజార్‌లో సొంతంగా ఒక షాపు నిర్వహిస్తుందామె. అంతేకాదు మారువేషంలో ట్యాక్సీ కూడా నడుపుతోంది. ఇదంతా ఎందుకంటే ఆమె మహిళ అని తెలిస్తే ఎవరూ పని ఇవ్వరు. అంతేకాదు మగాళ్ల మధ్యలో ఆమెకు రక్షణ ఉండదు.

ప్రస్తుతం ఆమె తన కూతురుతో కలసి ఒక హాస్టల్లో ఉంటోంది. ఆమె గురించి తొలిసారిగా 'హ్యూమన్స్ ఆఫ్ లాహోర్'లో రాశారు. ఆ తల్లి చాలా ఇబ్బందుల్లో ఉందని తెలిశాక చాలామంది ఆమెకు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. రెండు లక్షల రూపాయలు పోగుచేసి ఆమెకు విరాళంగా అందించారు. పురుషాధిక్య ప్రపంచంలో మహిళ ఒంటరిగా మనుగడ సాగించడం చాలా కష్టం. అలాంటి చోట ఫర్వీన్ ఒక మగాడిలా ఉండేందుకు పడ్డ కష్టాలు ఎవరి హృదయాన్నయినా కదిలిస్తాయి. అయితే బతుకు సమరంలో ఆమె ఇంటి నుంచి బయటికి వచ్చేప్పుడు మగాడిలా మారడం సాహసమనే చెప్పాలి. విరాళంగా వచ్చిన మొత్తంతో ప్రస్తుతం ఆమె తన జీవితాన్ని చక్కదిద్దుకునే ప్రయత్నం చేస్తోంది.




---

గుడ్‌ఫుడ్

# చిటికెడు ఇంగువతో శ్వాస సాఫీగా!



దేశీయ వంటకాలలో ఇంగువది ప్రత్యేక స్థానం. పప్పు, సాంబారు, పులిహోరలో కాసింత ఇంగువ వేస్తే వాటి రుచే వేరు. ఘాటువాసనతో ఉండే దీనిలో ఔషధ గుణాలు బోలెడున్నాయి. ఆహారంలో చిటికెడు ఇంగువ చేర్చుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు అందం పెరుగుతుంది. అదెలాగంటే ...

- ఇంగువలోని యాంటీ సెప్టిక్ గుణాలు ఉదర సంబంధ సమస్యలైన కడుపు ఉబ్బరం, అజీర్తిని తగ్గిస్తాయి. రోజూ కొద్దిగా ఇంగువను పప్పు లేదా గ్రేవీలో వేసుకుంటే జీర్ణవ్యవస్థ చక్కగా పనిచేస్తుంది. గ్లాసెడు నీళ్లలో చిటికెడు ఇంగువ పొడి కలిపి తాగినా ఫలితం ఉంటుంది.
- దీనిలోని యాంటీ వైరల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఆస్తమా, బ్రాంకైటిస్, పొడి దగ్గు వంటి శ్వాసపరమైన ఇబ్బందులను తొలగిస్తాయి. ఇంగువలో అల్లంపొడి, తేనె కలిపి తాగినా ఉపశమనం లభిస్తుంది.
- రక్తం చిక్కదనాన్ని పెంచడం, రక్తపీడనాన్ని తగ్గించడంలో ఇంగువ తోడ్పడుతుంది. దీనిలోని కౌమరిన్ రక్త ప్రవాహన్ని మెరుగుపరచడంతో పాటు రక్తం గడ్డకట్టడాన్ని నివారిస్తుంది.
- నెలసరి సమయంలో ఒక కప్పు మజ్జిగలో కొద్దిగా ఇంగువ, మెంతుల పొడి, చిటికెడు ఉప్పు కలిపి తాగితే పొత్తికడుపులో నొప్పి ఇట్టే మాయం అవుతుంది.
- వేడి నీళ్లలో ఇంగువ వేసుకొని రోజులో రెండు మూడు సార్లు తాగితే తలనొప్పి తగ్గిపోతుంది.
- ఇంగువ యాంటీడోట్‌గా పనిచేస్తుంది. అల్లం, ఇంగువ పేస్ట్ మిశ్రమాన్ని కీటకాలు కుట్టడం వల్ల ఏర్పడిన దద్దుర్ల మీద రాస్తే అవి మాయమవుతాయి.



- దీనిలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలు, వాటి వల్ల ఏర్పడే మచ్చలను పోగొట్టి ముఖాన్ని అందంగా మార్చుతాయి. ముల్తానీ మట్టి, రోజ్‌వాటర్, ఇంగువ మిశ్రమం మొటిమల్ని తగ్గిస్తుంది.
- కేశ సౌందర్యం పెంచుకునేందుకు కూడా ఇంగువ పనికొస్తుంది. యోగర్ట్, బాదం నూనె, ఇంగువ పేస్ట్ తలకు రుద్దుకొని ఆరిన తరువాత వేడి నీళ్లతో శుభ్రం చేసుకుంటే కురులు తాజాగా, ఆరోగ్యంగా కనిపిస్తాయి.

---

వంటిల్లు

**కూరగాయలు, ఆకుకూరలతో రెగ్యులర్ వంటలు బోర్‌కొడితే, కాస్త వెరైటీ కోసం అరటికాయలను ట్రై చేయొచ్చు. వీటిని కేవలం చిప్స్‌కే పరిమితం చేయకుండా, అరటికాయలతో అనేక రెసిపీలు ప్రయత్నించొచ్చు. అరటికాయ గుజ్జు తీయగా ఉన్నప్పటికీ మసాలా దట్టిస్తే ఎవరైనా 'అదరహో' అనాల్సిందే. అరటికాయలతో చేసే రైతా, కోఫ్తా, కుర్మా, పకోడీలతో పాటు హల్వాను పిల్లలు ఇష్టంగా తింటారు. ఆలస్యమెందుకు... అరటికాయలతో అదరగొట్టండి మరి!**

# అరటితో అదరహో!



## బనానా రైతా

**కావలసినవి**

అరటికాయ - ఒకటి, పెరుగు - పావుకేజీ, జీలకర్ర పొడి - ఒక టీస్పూన్, ఆవాలు - అర టీస్పూన్, మినప్పప్పు - అర టీస్పూన్, ఎండుమిర్చి - ఒకటి, కరివేపాకు - కొద్దిగా, ఉప్పు - తగినంత.

**తయారీ**

- కుక్కర్‌లో అరటికాయలు వేసి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.
- తరువాత పొట్టు తీసి గుజ్జుగా చేసుకోవాలి.
- ఒక పాత్రలో పెరుగు తీసుకుని గట్టిగా లేకుండా గిలక్కొట్టాలి.
- ఇప్పుడు అందులో అరటికాయ గుజ్జు, జీలకర్రపొడి, ఉప్పు వేసి కలపాలి.
- ఒక పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక ఆవాలు, మినపప్పు వేసి వేగించాలి.
- ఎండుమిర్చి, కరివేపాకు వేయాలి.
- ఈ పోపుని రైతాపై పోయాలి.
- వెజిటబుల్ బిర్యానీలో ఈ రైతా వేసుకొని తింటే ఎంతో టేస్టీగా ఉంటుంది.

## అరటికాయ కోఫ్తా

**కావలసినవి**

అరటికాయలు - రెండు, వెన్న - అర టీస్పూన్, యాలకుల పొడి - అర టీస్పూన్, దాల్చినచెక్క పొడి - అర టీస్పూన్, మిరియాల పొడి - అర టీస్పూన్, అల్లం - చిన్న ముక్క, సోంపు పొడి - అర టీస్పూన్, గోధుమపిండి - ఒక టీస్పూన్, మొక్కజొన్న పిండి - ఒక టీస్పూన్, జున్ను - 150 గ్రాములు, పచ్చిమిర్చి - నాలుగైదు, డ్రై అంజీరా - మూడు, దానిమ్మ గింజలు - అరకప్పు, నిమ్మకాయ - ఒకటి, నూనె - సరిపడా, ఉప్పు - తగినంత.



**తయారీ**

- అరటికాయలను చిన్న ముక్కలుగా కట్ చేసుకుని ఐదు నుంచి ఏడు నిమిషాల పాటు ఉడికించాలి.
- తరువాత వాటిని చల్లటి నీటిలో వేసి పొట్టు తీసి, గుజ్జుగా చేయాలి.
- ఒక పాన్ తీసుకుని అరటికాయ గుజ్జు వేసి, వెన్న, ఉప్పు వేసి కలపాలి.
- యాలకుల పొడి, దాల్చినచెక్క పొడి, సోంపు పొడి వేయాలి. దాల్చిన చెక్కపొడి, అల్లంను దంచి వేసి కలియబెట్టాలి. కాసేపు వేగనిచ్చి దించాలి.
- ఒక పాత్రలో జున్ను, అంజీరా ముక్కలు, పచ్చిమిర్చి, దానిమ్మగింజలు, నిమ్మరసం, ఉప్పు వేసి కలపాలి.
- గోధుమపిండి, మొక్కజొన్నపిండి, వేగించి పెట్టుకున్న అరటికాయల గుజ్జు వేసి కలియబెట్టాలి.
- ఈ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుంటూ కోఫ్తాలుగా చేసుకుంటూ నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి.
- చట్నీతో తింటే అరటికాయ కోఫ్తాలు రుచిగా ఉంటాయి.

## బనానా హల్వా

**కావలసినవి**

అరటికాయలు - మూడు, పంచదార - 150గ్రాములు, నెయ్యి - ఐదు టేబుల్‌స్పూన్లు, పాలు - ఒకటిన్నరకప్పు, జీడిపప్పు - పది పలుకులు, బాదం - పది పలుకులు, యాలకుల పొడి - అర టీస్పూన్.

**తయారీ**

- ముందుగా అరటికాయలను కుక్కర్‌లో ఉడికించాలి. తరువాత పొట్టు తీసి గుజ్జుగా చేయాలి.



- జీడిపప్పు, బాదం పలుకులను ముక్కలుగా చేసుకోవాలి.
- ఒక పాత్రలో నెయ్యి వేసి కాస్త వేడి అయ్యాక అరటికాయ గుజ్జు వేసి వేగించాలి.
- తరువాత పాలు, పంచదార వేసి కలియబెట్టాలి. చిన్నమంటపై ఉడికించాలి.
- బాదంపలుకులు, జీడిపప్పు ముక్కలు వేయాలి.
- మిశ్రమం చిక్కగా అయ్యాక యాలకుల పొడి చల్లితే నోరూరించే బనానా హల్వా రెడీ.

## పకోడీ

**కావలసినవి**

అరటికాయలు - ఆరు, జీలకర్ర పొడి - రెండు టీస్పూన్లు, కారం - ఒక టీస్పూన్, ధనియాల పొడి - ఒక టీస్పూన్, ఛాట్ మసాలా - ఒకటిన్నర టీస్పూన్, అల్లం - చిన్న ముక్క, పచ్చిమిర్చి - ఆరు, నిమ్మకాయలు - నాలుగు, మామిడికాయ పొడి - ఒక టీస్పూన్, ఉప్పు - తగినంత, సెనగపిండి - అరకేజీ, బియ్యప్పిండి - 200 గ్రాములు, ఎండుమిర్చి - రెండు.

**తయారీ**

- అరటికాయల పొట్టు తీసి కట్ చేసి పెట్టుకోవాలి.
- ఒక పాత్రలో సెనగపిండి, బియ్యప్పిండి తీసుకుని బాగా కలపాలి.
- అందులో జీలకర్ర పొడి, కారం, ధనియాల పొడి, ఛాట్ మసాలా, పచ్చిమిర్చి, మామిడికాయ పొడి, తగినంత ఉప్పు, మెత్తగా దంచిన అల్లం, ఎండుమిర్చి వేసి, కొద్దిగా నీళ్లు పోసి కలియబెట్టాలి.
- ఇప్పుడు ఒక పాన్‌లో నూనె పోసి వేడి అయ్యాక అరటికాయ ముక్కలను మిశ్రమంలో అద్దుకుంటూ నూనెలో వేసి వేగించాలి.
- చట్నీతో వేడి వేడిగా సర్వ్ చేసుకోవాలి.



## కుర్మా



**కావలసినవి**

అరటికాయలు - ఎనిమిది, బంగాళదుంపలు - అరకేజీ, పెరుగు - పావుకేజీ, ఉల్లిపాయలు - రెండు, నూనె - సరిపడా, టొమాటోలు - నాలుగు, క్రీమ్ - 300గ్రాములు, కొత్తిమీర - ఒకకట్ట, ఉప్పు - తగినంత, అల్లంవెల్లుల్లి పేస్టు - రెండు టేబుల్‌స్పూన్లు, పచ్చిమిర్చి - నాలుగైదు, జీలకర్ర - ఒక టీస్పూన్, పసుపు - అర టీస్పూన్, కారం - ఒక టీస్పూన్, ఆవాలు - ఒక టీస్పూన్.

**తయారీ**

- ఒక పాన్‌లో నూనె వేసి అల్లం వెల్లుల్లి పేస్టు వేసి వేగించాలి.
- తరువాత ఆవాలు, జీలకర్ర, ఉల్లిపాయలు వేయాలి.
- కాసేపు వేగిన తరువాత పెరుగు వేయాలి.
- బంగాళదుంప ముక్కలు, అరటికాయ ముక్కలు వేసి కలపాలి. ఇవి లేత గోధుమ రంగులోకి వచ్చిన తర్వాత టొమాటో ముక్కలు కూడా వేసి పావు గంటపాటు చిన్నమంటపై ఉడికించాలి.
- టొమోటోలు బాగా ఉడికిన తర్వాత రుచికి తగ్గ కారం వేయాలి. ఈ మిశ్రమంలో క్రీమ్ వేసి కలుపుకోవాలి.
- చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసి అన్నంతో లేదా చపాతీతో ఈ కుర్మాను తినొచ్చు.



టెక్ గురు

**టెక్నాలజీ వినియోగంతో అన్ని రంగాలూ కొత్త పుంతలు తొక్కుతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలోనూ టెక్ వినియోగం బాగా పెరిగింది. ఎంతలా అంటే ఏడాది తరువాత పూర్తయ్యే ఫ్లాట్ ఎలా ఉంటుందో అడ్వాన్స్ చెల్లించే సమయంలోనే చూడొచ్చు. ఇంట్లో గ్యాస్ లీకైనా, కిటికీ అద్దం పగిలినా ఆ సమాచారం మీ మొబైల్‌లో సంక్షిప్త సందేశం రూపంలో తెలిసిపోతుంది. ఇదంతా టెక్నాలజీ గొప్పతనమే!**

# రియాల్టీ రంగంలో వర్చ్యువల్ మేజిక్!

పెద్దపెద్ద భవన నిర్మాణ సంస్థలు తాము నిర్మించే ఆకాశ హర్మ్యాలకు ఏ ప్రమాదం వాటిల్లకుండా ఉండటం కోసం 'ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ' వినియోగిస్తున్నాయి. నిర్మాణ సమయంలోనే భారీ సంఖ్యలో సెక్యూరిటీ కెమెరాలను వినియోగించడం ద్వారా ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పర్యవేక్షించడంతో పాటు అనుమానితులు ఎవరైనా ఆ ప్రదేశంలోకి ప్రవేశిస్తున్నట్లయితే ఆ విషయాన్ని వెంటనే సెంట్రల్ సర్వర్‌లో గుర్తిస్తున్నారు.

అలాగే వాహనాలను ప్రత్యేకమైన స్కానర్ల ద్వారా పరీక్షించడం కూడా జరుగుతోంది. ఢిల్లీ, హైదరాబాద్, ముంబయ్ వంటి నగరాల్లో పలువురు నేరస్థులకు సంబంధించి పోలీస్‌ల దగ్గర ఉన్న డేటాబేస్‌ని తమ దగ్గర ఉన్న ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీతో అనుసంధానం చేయడం ద్వారా భవనంలోకి ప్రవేశించే వ్యక్తుల్లో ఎవరైనా నేరస్థులు ఉంటే క్షణాల్లో గుర్తించే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దాంతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే వీడియో మానిటరింగ్ నెట్‌వర్క్‌ని కూడా కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు వినియోగించుకుంటున్నాయి. ఉదాహరణకు ఎక్కడైనా అనుమానితులు ఒక బ్యాగ్‌ను 30 నిమిషాలపాటు ఒక చోట వదిలేస్తే దానికి సంబంధించిన అలర్ట్ సంబంధిత సెక్యూరిటీ విభాగానికి వెళ్లే విధంగా ఏర్పాటు చేస్తున్నారు.

### వివిధ దశల్లో...

భవన నిర్మాణ పనిని వేగవంతం చేయడం కోసం ఒక భవనానికి సంబంధించిన ప్లాన్ మొదలుకొని, బడ్జెట్ కేటాయింపు, నిర్మాణ సామగ్రిని సమకూర్చుకోవటం, నిర్మాణ పనులను పర్యవేక్షించడం వంటి అన్ని రకాల దశల్లో ఇప్పుడు టెక్నాలజీని బాగా వినియోగిస్తున్నారు. అంతేకాదు భవన నిర్మాణ కార్మికుల ఆరోగ్యం, భద్రత విషయంలో కూడా టెక్నాలజీ ఉపయోగిస్తున్నారు. డ్రోన్ల ద్వారా భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. డ్రోన్ ద్వారా సేకరించిన విజువల్ డేటాని ఆసరాగా చేసుకుని దాన్ని ఎనలటిక్స్‌తో విశ్లేషించడం ద్వారా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తున్నారు. ఈ ప్రక్రియను 'ఫొటోగ్రామెట్రీ' అనే పేరుతో పిలుస్తారు. ఆ డేటా ఆధారంగా నిర్మాణ స్థలానికి సంబంధించి 2డి, 3డి మోడల్స్ సిద్ధపరుస్తారు. ఆ సమాచారం ఆధారంగా తదుపరి నిర్మాణానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. బడ్జెట్ కేటాయింపుల కోసం "బిల్డ్ సప్లై" వంటి సాఫ్ట్‌వేర్‌ను కూడా ఉపయోగిస్తున్నారు.

### ముందే అనుభూతి చెందేలా!

ఒక భవనం నిర్మాణం పూర్తయ్యాక ఎలా ఉంటుందో వర్చ్యువల్ రియాలిటీ ఆధారంగా చూడవచ్చు. ఫ్లిప్ స్పేసెస్ అధికారిక వెబ్‌సైట్లో ఒక వర్క్‌స్పేస్‌ని పూర్తి కావటానికి ఎనిమిది వారాల ముందే పూర్తయ్యాక ఎలా ఉంటుందో చూసి అనుభూతి చెందవచ్చు. 'విజ్ వాక్' అనే వర్చ్యువల్ రియాలిటీ అప్లికేషన్ అన్‌రియల్ ఇంజిన్ ఆధారంగా ఇంటీరియర్ డిజైనింగ్, విజువలైజేషన్ సదుపాయాలను కస్టమర్లకు అందిస్తోంది. క్యాడ్ డ్రాయింగులు, ఇతర ఫైళ్లను ఆ సాఫ్ట్‌వేర్‌కి అందిస్తే వాటి ఆధారంగా దానంతట అదే ఒక వర్చ్యువల్ ఇమేజ్ సృష్టిస్తుంది.



### అనేక రకాల సెన్సార్లు

మహీంద్రా లాంటి ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు సెక్యూరిటీ కెమెరాలు, స్కానర్లని అమర్చి చేతులు దులుపుకోకుండా తాము నిర్మించే గృహ సముదాయాల్లో అనేక రకాల అధునాతన సెన్సార్లు బిగిస్తున్నాయి. గ్యాస్ లీక్ సెన్సార్ ఇంట్లో గ్యాస్ లీక్ అయితే ఇంటి యజమానికి ఎస్ఎంఎస్ అలర్ట్ ఆటోమేటిగ్గా పంపించడంతో పాటు, దగ్గర్లో ఉన్న కాల్ సెంటర్‌కి దానంతట అదే కాల్ వెళ్లిపోతుంది. అద్దాలు పగిలిపోతే గుర్తించే సెన్సార్లు, ఇంట్లో లైట్లు, ఫ్యాన్లు, ఏసీలను నియంత్రించే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డివైజ్‌లను కూడా విరివిగా ఉపయోగిస్తున్నారు.

### ప్రీ-కాస్టింగ్ కూడా

భవన నిర్మాణం విషయంలో డిజిటల్ టెక్నాలజీతో పాటు ప్రీ-కాస్ట్ టెక్నాలజీ కూడా ప్రాచుర్యం చెందుతోంది. ఒక భవనానికి సంబంధించిన అధిక శాతం నిర్మాణం ఫ్యాక్టరీలో తయారయి, అది వివిధ భాగాలుగా గమ్యస్థానానికి చేర్చి, అక్కడ అసెంబుల్ చేయడం జరుగుతుంది. వాస్తవానికి ఇది దశాబ్దకాలంగా సింగపూర్‌లో వినియోగంలో ఉన్న టెక్నాలజీ అయినప్పటికీ, మనదేశంలో దీన్ని వాడటానికి డెవలపర్లు కొద్దిగా వెనకంజ వేస్తూ వచ్చారు. ఇటీవలి కాలంలో ఈ టెక్నాలజీ ఊపందుకుంటోంది.

### రెడీ మిక్స్ విషయంలో...

రెడీ మిక్స్ కాంక్రీట్ తయారీలో ఎంత మొత్తంలో సిమెంట్, ఇసుక కలపాలి అన్నది స్ట్రక్చరల్ ఇంజనీర్ నిర్ణయిస్తుంటారు. ఈ దశలో ఎక్కువగా మోసాలు జరిగే అవకాశం ఉంటుంది. అయితే రెడీ మిక్స్ ప్లాంట్‌లో ప్రత్యేకమైన సెన్సార్‌ని అమర్చడం ద్వారా దీన్ని అడ్డుకుంటున్నారు. ఈ సెన్సార్ తేమ శాతం మొదలుకుని కీలకమైన విషయాలను ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఉంటుంది. అలాగే కాంక్రీట్ గరిష్ఠంగా 30 నుంచి 40 నిమిషాలలోపు నిర్మాణ స్థలానికి చేరుకోవాల్సి ఉంటుంది. అందుకోసం కాంక్రీట్‌ని రవాణా చేసే వాహనంలో ప్రత్యేకంగా జీపీఎస్ ట్రాకింగ్ అమర్చుతున్నారు. దాని ద్వారా రియల్ టైమ్ సమాచారాన్ని కాంక్రీట్‌ని కొనుగోలు చేసే వ్యక్తికి చేరవేయడం ద్వారా మొత్తం ప్రక్రియ పారదర్శకంగా ఉండే విధంగా చేస్తున్నారు. వాహనం బయలుదేరిన ప్రదేశం, గమ్యస్థానం, లోడ్, ట్రక్ మోడల్, వాహనంలో డ్రైవర్ల సంఖ్య వంటి అనేక అంశాలను ఆసరాగా చేసుకుని భవన నిర్మాణ సామగ్రిని చేరవేసే వాహనం సరిగ్గా ఏ సమయానికి చేరుకుంటుందో అంచనా వేసే విధంగా టెక్నాలజీని అభివృద్ధి చేశారు.

### అన్ని చోట్లా...

భవన నిర్మాణం విషయంలో బ్లాక్‌చైన్ టెక్నాలజీని ఆసరాగా చేసుకుని ల్యాండ్ రికార్డ్‌లను పరిశీలించడం, ఒక ప్రదేశంలో ఉండే జనసాంద్రత వంటి విషయాలను డ్రోన్ మ్యాపింగ్ ద్వారా విశ్లేషించటం, ఆటో క్యాడ్ వంటి వాటితో ఫ్లోర్‌ప్లాన్లని రూపొందించడం, క్లౌడ్ ఆధారంగా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, వినియోగదారులకు టెక్నాలజీ ఆధారంగా మరిన్ని సదుపాయాలు కల్పించడం, భవన నిర్మాణంలో కొత్త విధానాలను అనుసరించడం ద్వారా నిర్మాణ వ్యయాన్ని తగ్గించి, నాణ్యత పెంచడం వంటి పద్ధతులను రియల్ ఎస్టేట్ రంగంలో ఇటీవల అనుసరిస్తున్నారు.



**నల్లమోతు శ్రీధర్**
fb.com/nallamothusridhar

టెక్ సందేహాలు

## ఆ ఫొటోలు తిరిగి పొందవచ్చా?

నా దగ్గర ఉన్న మెమరీ కార్డులో ఉన్న ఫోటోలు మొబైల్‌లో ఓపెన్ చేసినప్పుడు ఓపెన్ అవడం లేదు. మరలా వాటిని తిరిగి పొందడం ఎలా?

**- జికె**



మెమరీ కార్డును వివిధ డివైజ్‌లకు వాడుతున్నప్పుడు అందులో ఉండే ఫైల్స్ కరప్ట్ అయ్యే ప్రమాదం ఉంటుంది. సాధ్యమైనంత వరకు ఒక డివైజ్ నుంచి మరో డివైజ్‌కి మెమరీ కార్డుని మార్చి మార్చి వాడటం సరైన పద్ధతి కాదు. చాలా సందర్భాలలో అలా చేయడం వల్ల డేటా నిరుపయోగమవుతుంది. మీరు చెబుతున్న దాని ప్రకారం ఇప్పటికే మీ మెమరీ కార్డులో ఉన్న ఫోటోలు కరప్ట్ అయ్యాయి. ఏమైనా ఫైళ్లను మీరు డిలీట్ చేసినప్పుడు వాటిని డేటా రికవరీ సాఫ్ట్‌వేర్ల ద్వారా వెనక్కి తెచ్చుకోవడానికి అవకాశాలు ఉంటాయి గానీ, కరప్ట్ అయిన ఫోటోలను తిరిగి వెనక్కి పొందడం మాత్రం సాధ్యపడదు. కాబట్టి ఈ విషయంలో చేయగలిగిందేమీ లేదు. అలా మళ్లీ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోండి. ఎప్పటికప్పుడు మీ ఫోటోలను గూగుల్ ఫొటోస్ వంటి క్లౌడ్ స్టోరేజ్ సర్వీసులలో బ్యాకప్ తీసుకోండి.

## ఫోన్ కాంటాక్టులు ఎందుకలా?

మా నాన్న మొబైల్‌లో సేవ్ చేస్తున్న కాంటాక్టులు నా మొబైల్‌లో వస్తున్నాయి. మా నాన్న మొబైల్‌లో మెయిల్ సింక్ అవకుండా సైన్‌అవుట్ అయ్యాను. వేరే మెయిల్‌తో లాగిన్ అయ్యాను. నేను వేరే మెయిల్ వాడుతున్నాను. అయినా కాంటాక్టులు నా ఫోన్‌లో సేవ్ అవుతున్నాయి. దీనికి పరిష్కారం చెప్పండి.

**- రేణు,** తణుకు



మీ ఇద్దరి ఫోన్లలో 'కాంటాక్ట్స్ అప్లికేషన్' కరప్ట్ అయినప్పుడు ఇలా జరుగుతుంది. మీ ఫోన్లో సెట్టింగ్స్‌లో అప్లికేషన్స్ విభాగంలోకి వెళ్లి కాంటాక్ట్స్ గానీ, ఫోన్ అనే యాప్ గానీ వెతికి పట్టుకొని దాని డేటా క్లియర్ చేయండి. అలాగే మీరు మీ నాన్న ఫోన్లో మెయిల్ ఏ ప్రదేశంలో సైన్ అవుట్ అయ్యారో వివరంగా తెలపలేదు. సెట్టింగ్స్ లో, అకౌంట్స్ అనే విభాగంలోకి వెళ్లి అక్కడ మాత్రమే అకౌంట్ తొలగించండి. అప్పుడే సరైన ఫలితం ఉంటుంది. మీరు వేరే మెయిల్ వాడుతున్నప్పటికీ, గతంలో మీ నాన్న అకౌంట్‌ని మీ ఫోన్లో అకౌంట్స్ విభాగంలో కాన్ఫిగర్ చేసి ఉంటే కొన్నిసార్లు కాన్ఫిగరేషన్ ఇబ్బందుల వల్ల డేటా సింక్ అయ్యే అవకాశాలు ఉంటాయి.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

స్ఫూర్తి

**60 రోజులు... 6,500 కిలోమీటర్లు... సమాజ చైతన్యాన్ని కాంక్షిస్తూ సైకిల్‌పై వియత్నాంకు పయనమయ్యారు ఇద్దరు యువకులు. ముంబయ్ గేట్‌వే ఆఫ్ ఇండియా సాక్షిగా... ఇంతటి సాహస యాత్రకు శ్రీకారం చుట్టిన ఈ యువకుల లక్ష్యం... సంకల్పమేంటి చూద్దాం.**

# చైతన్య యాత్ర

నీరు లేనిదే మనిషి మనుగడ లేదు. అందుకే నీటిని సంరక్షించాలి. ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టాలి. ఈ విషయం ప్రపంచానికి తెలిసిందే అయినా.. మళ్లీ మళ్లీ చెప్పాలి. చైతన్యం రగిలించాలి. ఇది కెప్టెన్ మోహిత్ థామస్ ఆలోచన! 'సాహసం కూడా ఓ విద్యే' అని చాటి చెప్పాలనేది మితేష్ అభిలాష. ఏది చేసినా అందులో సామాజిక కోణం ఉండాలి. స్ఫూర్తి కలిగించాలి. ఆ ఉద్దేశంతోనే లక్ష్యం నిర్దేశించుకుని ఈ ఇద్దరూ సైకిల్‌పై ఆరు దేశాలను చుట్టేయాలని నిర్ణయించుకున్నారు. అదీ.. 60 రోజుల్లో 6,500 కి.మీ దూరం ప్రయాణం.



మోహిత్ థామస్

### జనం బాగా స్పందిస్తున్నారు!

'మా ఆహార్యం చూస్తేనే ప్రజల్లో కాస్త ఆసక్తి కలుగుతుంది. కాస్త జనసమ్మర్దం ఉన్నచోట ఆగినప్పుడు.. యాత్ర ఎందుకు, ఎక్కడికి అని ఆసక్తిగా అడుగుతున్నారు. వియత్నాం అని చెప్పినప్పుడు.. అబ్బో అంత దూరమా అని ఆశ్చర్యపోతున్నారు. అప్పుడు లక్ష్యాన్ని వివరిస్తూ జనజాగృతం చేసే ప్రయత్నం చేస్తున్నాం. విద్యార్థులు, ఉద్యోగులు మా యాత్రపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. వారి వారి ఆశయాలు.. లక్ష్యాలను చెబుతున్నారు' అని విశేషాలు పంచుకున్నారు మోహిత్, మితేష్.

### నేర్చుకొంటూ... నేర్పిస్తూ...

యాత్ర ఆసాంతం.. జల సంరక్షణ, అడ్వెంచర్ ఈస్ ఎడ్యుకేషన్‌పైనే కాకుండా, పరిసరాల పరిశుభ్రత, బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాలు, అక్షర్యాస్యత, ఉపాధి అవకాశాలు... వ్యక్తిత్వ వికాసం, విద్య, క్రీడలు.. అవకాశాలు.. ఇలా సందర్శించిన ప్రాంతాలను బట్టి ఆయా ప్రజల మనోభావాలకు అనుగుణంగా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు ఈ యువకులు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల ప్రజల వ్యక్తిత్వం, భాష, సంస్కృతి, అలవాట్లు.. వంటి అనేక అంశాలపై అవగాహన చేసుకొంటూ ముందుకు సాగుతున్నారు.

## వియత్నామే ఎందుకు?

**'మా లక్ష్యం ఎక్కువ మందికి ప్రేరణ ఇవ్వడం. ఒకటి కంటే ఎక్కువ దేశాల్లో పర్యటించడం. విభిన్న భాషలు, సంస్కృతులు కలిగిన ఎక్కువ మందిని కలవడం. వారిని జాగృతం చేయడం. ఇందుకు సుదీర్ఘ ప్రయాణం అవసరం. ముంబై నుంచి వియత్నాం వరకు అతిపెద్ద రోడ్డు మార్గం.. మా లక్ష్యానికి దగ్గరగా ఉంది!. అందుకే ఈ మార్గం ఎంచుకున్నాం.'**




ముంబై టు వియత్నాం



మితేష్

### ఎవరు వీరు...

మితేష్ స్వస్థలం ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ పట్టణం. మోహిత్ థామస్‌ది ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్. ఇద్దరూ ముంబైలోని పలు కార్పొరేట్ సంస్థల ఉద్యోగులకు, కళాశాలల విద్యార్థులకు సాహస క్రీడలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణనిస్తున్నారు. ఇరువురి అభిరుచులూ కలవడంతో ఈ సాహస యాత్రకు సంకల్పించారు. దీనికి కొన్ని కార్పొరేట్ సంస్థలు సహకరించాయి.

### ఎక్కడి నుంచి ఎక్కడికి?

గత నెల 26న ముంబయిలోని గేట్‌వే ఆఫ్ ఇండియా వద్ద ప్రారంభమైన ఈ యాత్ర బంగ్లాదేశ్, మయన్మార్, థాయ్‌ల్యాండ్, కంబోడియాల మీదుగా వియత్నాం చేరుతుంది. తేలికపాటి దుస్తులతో బ్యాగ్... గాలి, దుమ్ముధూళిని తట్టుకునేలా ముఖానికి మాస్క్, తలకు రక్షణగా హెల్మెట్.. ఇదే వీరి లగేజీ. భారత్‌లో ముంబై నుంచి హైదరాబాద్ మీదుగా 11 రోజులు ప్రయాణించి విజయవాడ చేరుకున్నారు మోహిత్, మితేష్. విశ్రాంతి తీసుకొని అక్కడి నుంచి విశాఖపట్టణం బయలుదేరారు.

### రోజుకు 120-130 కిలోమీటర్లు...

'సైకిల్‌పై రోజుకు 120 నుంచి 130 కి.మీ దూరం ప్రయాణించాలన్నది లక్ష్యం. ముంబై నుంచి విజయవాడకు 11 రోజుల్లో అలాగే వచ్చాం. చలి, ఎండ సమయాల్లో గాలి కాస్త ఇబ్బంది పెట్టడం మినహా, ప్రస్తుత వాతావరణం సైక్లింగ్‌కు అనుకూలంగానే ఉంది. రాత్రి 7 తర్వాత ఏ ఊరు చేరుకుంటే అక్కడ బస చేస్తున్నాం. ఊళ్లలో స్థానికులతో ముచ్చటించి, అక్కడి విశేషాలు తెలుసుకొంటున్నాం. ఇలా రకరకాల ప్రాంతాల వారిని కలవడం కొత్త ఉత్సాహాన్నిస్తుంది' అంటూ చెప్పుకొచ్చారు ఈ కుర్రాళ్లు.

### ప్రతి చుక్కా ఒడిసిపట్టాలి...

'అనేక గ్రామాలు, పట్టణాలు, జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల్లో నీటి కొరత ఉన్నా.. అవసరానికి మించి వాడుతూ దుర్వినియోగం చేస్తున్నాం. వర్షపు నీటిని ఎంతమంది భూమిలోకి ఇంకేలా గుంతలు తవ్వుతున్నారు? ఈ విషయాలు ఎవరికీ తెలియదనికాదు. కానీ ఎవరూ చొరవ తీసుకోరు. ప్రతి నీటి బొట్టునూ లెక్కబెట్టేంతగా సద్వినియోగం చేసుకోవాలి' అంటారు మితేష్. భవిష్యత్తు తరాల కోసమైనా నీటి పొదుపు పాటించాలని, తమ ఈ చిన్న ప్రయత్నం కొంతమందిలోనైనా చైతన్యం రగిలించగలిగితే తమ యాత్ర సఫలమైనట్టేనని మితేష్ భావిస్తున్నారు.

### సాహసం కూడా విద్యే!...

'ఏ పని చేయాలన్నా ముందు ధైర్యం కావాలి. కానీ... చిన్న చిన్న పనులను ఆనాలోచితంగానే పూర్తి చేస్తాం. దానికి పెద్ద సాహసం చేయాలని అనుకోం. అయితే వాటి ఫలితం గొప్పగా ఉన్నప్పుడు మనం చేసిన పని ఎంత గొప్పదో.. ఎంత సాహసంతో కూడినదో అనిపిస్తుంది. మరి అలాంటప్పుడు.. సాహసంతో చేసే పనులను ఎంచుకుని.. అందులో విజయం సాధిస్తే ఆ మజాయే వేరు. ఇదే నేను చెప్పదలచుకున్నాను. బంగీ జంప్ చేయాలనుకోవడం, ట్రెకింగ్, రోప్‌వాక్ చేయడం వంటి వాటికి చాలా ధైర్యం కావాలి. పరుగు పందెంలో పాల్గొనడానికి పెద్ద సాహసం అవసరం లేదు. కానీ.. గెలవాలన్న తపన, పట్టుదల గొప్ప సాహసమే! ఇలా ప్రతి రంగంలోనూ సాహసంతో చేసే పనులుంటాయి' అనేది కెప్టెన్ మోహిత్ చెప్పే ఫిలాసఫీ. ఇదే విషయాన్ని యువతరానికి చెప్పి, వారిని కార్యోన్ముఖులను చేయాలనే ఉన్నతాశయం ఆయనది. సమాజ శ్రేయస్సును బాధ్యతగా భావించిన ఈ ఇద్దరు మిత్రుల యాత్ర నిర్విఘ్నంగా సాగాలని ఆకాంక్షిస్తూ మనమూ ఆల్ ద బెస్ట్ చెప్పేద్దాం!

● **శ్రీశైలం శ్రీనివాసు,** అమరావతి

తెలుసుకుందాం!

## యూట్యూబ్ ఛానెల్ క్రియేట్ చేయండిలా!

యూట్యూబ్‌కు ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్ల మంది వినియోగదారులున్నారు. ప్రతీ నిమిషం 500 గంటల వీడియో యూట్యూబ్ అప్‌లోడ్ అవుతోంది. మనసులో ఉన్న మాటను అందరికీ తెలియజేయడానికి, తనకు నచ్చిన అంశాన్ని షేర్ చేయడానికి యూట్యూబ్ ఇప్పుడు ఒక మంచి వేదిక. యూట్యూబ్ ఛానెల్ క్రియేట్ చేసుకోవడం ద్వారా ఆదాయాన్ని పొందే అవకాశం ఉంది. మరి యూట్యూబ్ ఛానెల్ క్రియేట్ చేయడం ఎలాగో తెలుసా?






యూట్యూబ్ ఛానెల్ క్రియేట్ చేసుకోవడానికి ఎలాంటి డబ్బులు చెల్లించనవసరం లేదు. గూగుల్ అకౌంట్ ఉంటే చాలు.

- ముందుగా యూట్యూబ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సైనిన్ కావాలి.
- కుడి వైపున పైభాగంలో ప్రొఫైల్‌పై క్లిక్ చేయాలి.
- సెట్టింగ్స్‌లోకి వెళ్లాలి.
- క్రియేట్ ఎ న్యూ ఛానెల్ లింక్‌పై క్లిక్ చేయాలి.
- ఛానెల్‌ను మీ పేరుపై క్రియేట్ చేసుకుంటారా? లేక ఏదైనా బ్రాండ్ నేమ్‌తో పెట్టుకుంటారా? డిసైడ్ చేసుకోవాలి. తరువాత ఛానెల్ పేరు టైప్ చేసి క్రియేట్ ఛానెల్‌ను ఎంచుకోవాలి.
- అకౌంట్‌ను వెరిఫై చేసుకోవడానికి ఫోన్ నెంబర్ లేదా ఎస్ఎంఎస్, వాయిస్ కాల్‌లో ఏదో ఒకటి ఎంచుకుని కంటిన్యూపై క్లిక్ చేయాలి.
- తరువాత వెరిఫికేషన్ కోడ్‌ని ఎంటర్ చేసి కంటిన్యూపై క్లిక్ చేస్తే యూట్యూబ్ ఛానెల్ క్రియేట్ చేసుకోవడం పూర్తవుతుంది.
- ఒకవేళ మీరు క్రియేట్ చేసుకున్న ఛానెల్ ప్రొఫెషనల్‌గా కనిపించాలనుకుంటే 'కస్టమైజ్ ఛానెల్' ఆప్షన్‌ను ఎంచుకుని ప్రొఫైల్ ఫొటో, డిస్క్రిప్షన్, ఇతర వివరాలను జత చేసుకోవచ్చు.

## లిటిల్స్

### కనిపెట్టండి చూద్దాం!



ఈ బొమ్మలో కొన్ని తప్పులున్నాయి. వాటిని కనిపెట్టండి.

జవాబు
1. గాలి బుడగల ఆకారం
2. బ్యాట్ తిరగేసి పట్టుకున్నాడు
3. టెన్నిస్ బ్యాటుకు వల

### రంగులు వేయండి



### డైలీ సుడోకు -280

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 3 | 7 | | 4 | 2 | 1 | | |
| | 5 | | 1 | | | 6 | | |
| | | 9 | | 6 | | | | |
| | | | | | 4 | 7 | 8 | |
| | 6 | | | | | | 9 | |
| | 9 | 3 | 8 | | | | | |
| | | | | 5 | | 2 | | |
| | | 1 | | | 9 | | 6 | |
| | | 5 | 2 | 8 | | 9 | 3 | |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

**సుడోకు - 279 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 4 | 2 | 6 | 3 | 9 | 1 | 8 | 5 |
| 3 | 1 | 6 | 8 | 4 | 5 | 7 | 9 | 2 |
| 8 | 5 | 9 | 7 | 1 | 2 | 6 | 4 | 3 |
| 1 | 8 | 5 | 9 | 2 | 6 | 3 | 7 | 4 |
| 9 | 3 | 7 | 4 | 8 | 1 | 5 | 2 | 6 |
| 2 | 6 | 4 | 3 | 5 | 7 | 9 | 1 | 8 |
| 4 | 9 | 8 | 5 | 7 | 3 | 2 | 6 | 1 |
| 6 | 2 | 3 | 1 | 9 | 4 | 8 | 5 | 7 |
| 5 | 7 | 1 | 2 | 6 | 8 | 4 | 3 | 9 |

# నయన్... శామ్ నడుమ!

నయనతార, సమంత... ఇద్దరూ అగ్ర కథానాయికలే! అయితే... వీరిద్దరు ఒక్క సినిమా కూడా కలిసి చేయలేదు. ఇప్పుడు చేస్తున్నారు. ఒక్క కథతో వీరిని ఒప్పించిన ఘనత విఘ్నేశ్ శివన్‌దే. విజయ్ సేతుపతి హీరోగా ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'కదవుక్కుళ్ల రెండు కాదల్'. తెలుగులో 'తలుపు వెనుక రెండు ప్రేమకథలు' అని అర్థం. ఇందులో నయనతార, సమంత నాయికలు. ప్రేమికుల రోజు కానుకగా శుక్రవారం ఈ చిత్రాన్ని ప్రకటించారు. అదీ 'తొలిసారి వెండితెరపై కనీవిని ఎరుగని ఘర్షణ. నయనతార వర్సెస్ సమంత' అని! వర్సెస్ (విఎస్) అంటే విజయ్ సేతుపతి అనీ చెప్పారు. ఇదో ముక్కోణపు ప్రేమకథ. నారీ (నయనతార) నారీ (సమంత) నడుమ విజయ్ సేతుపతి ఏం చేస్తారో? ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడు. అన్నట్టు... విఘ్నేశ్ శివన్, నయన్ ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. 'నేనూ రౌడీనే' తర్వాత విజయ్ సేతుపతి, విఘ్నేశ్ శివన్, నయనతార, అనిరుధ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రమిది. ఈసారి వీళ్లకు సమంత జత కలిశారు. దర్శకుడు ప్రేయసి పాత్రకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారో? సమంత పాత్రకు ఇస్తారో? చూడాలి. నయన్... శామ్ నడుమ విజయ్ సేతుపతి ఇబ్బంది పడతారో? దర్శకుడు పడతారో!?


సమంత


నయనతార

# ఇటలీలో స్టెప్పులేస్తున్న రామ్

రామ్ హీరోగా 'స్రవంతి' రవికిశోర్ నిర్మిస్తున్న చిత్రం 'రెడ్'. నివేదా పేతురాజ్, మాళవికా శర్మ నాయికలు. కిశోర్ తిరుమల దర్శకుడు. కృష్ణ పోతినేని సమర్పకుడు. ప్రస్తుతం ఇటలీలో చిత్రీకరణ జరుగుతోంది. నిర్మాత మాట్లాడుతూ "నేను... శైలజ', 'ఉన్నది ఒకటే జిందగి' తర్వాత రామ్-కిశోర్ తిరుమల కలయికలో వస్తున్న మూడో చిత్రమిది. గోవా, హైదరాబాద్, వైజాగ్ ప్రాంతాల్లో జరిపిన షూటింగ్‌తో టాకీ పూర్తయ్యింది. ఈ నెల 12 నుంచి ఇటలీలో టస్క్, ఫ్లారెన్స్, డోలోమైట్స్ లాంటి ప్రాంతాల్లో రామ్, మాళవికా శర్మలపై శోభి మాస్టర్ కొరియోగ్రఫీలో రెండు పాటల్ని చిత్రీకరిస్తున్నాం. ఈ నెల 20 వరకు ఇటలీలో షెడ్యూల్ జరుగుతుంది. హైదరాబాద్ తిరిగొచ్చాక చిత్రీకరించే పాటతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. మణిశర్మ చక్కని బాణీలు అందిస్తున్నారు. ఆయన మా బ్యానర్‌లో పని చేయడం ఇదే మొదటిసారి. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసి ఏప్రిల్ 9న సినిమాను విడుదల చేస్తాం" అని తెలిపారు.


మాళవికా శర్మ, రామ్

# విభ... నిలబడి నవ్విస్తుంది

అబ్బాయిలే కాదు, అమ్మాయిలూ స్టాండప్ కామెడీ చేస్తున్నారు. అయితే, తెలుగులో ఫిమేల్ స్టాండప్ కమెడియన్లు తక్కువ. అమ్మాయిలు నిలబడి నవ్విస్తే ఎలా ఉంటుందో వెండితెరపై చూడమని పూజా హెగ్డే చెబుతున్నారు. అఖిల్ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్'. బన్నీ వాసు, వాసూ వర్మ నిర్మాతలు.

పూజా హెగ్డే హీరోయిన్. ఆమె స్టాండప్ కమెడియన్ విభగా కనిపించనున్నారు. శుక్రవారం ఆమె ఫస్ట్ లుక్ విడుదల చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ "అఖిల్ లుక్‌కి అద్భుత స్పందన లభించింది. పూజ లుక్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ఇద్దరి పాత్రలనూ దర్శకుడు బాగా మలిచారు. గోపీసుందర్ స్వరపరిచిన పాటల్ని త్వరలో విడుదల చేసి, ఏప్రిల్‌లో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. ఆమని, మురళీ శర్మ, జయప్రకాశ్, ప్రగతి నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: అల్లు అరవింద్.


పూజా హెగ్డే

# రాజకీయాలకు అద్దం పట్టేలా...


రాజశేఖర్

రాజశేఖర్ ద్విపాత్రాభినయం చేసిన చిత్రం 'అర్జున'. మరియం జకారియా కథానాయిక. కన్మణి దర్శకుడు. నట్టి కరుణ, నట్టి క్రాంతి నిర్మాతలు. "ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అద్దంపట్టే చిత్రమిది. ఇందులో తండ్రీ కొడుకులుగా రెండు పాత్రల్లో రాజశేఖర్ నట విశ్వరూపం చూస్తారు. వాస్తవ సంఘటనలను ప్రేరణగా తీసుకుని సహజత్వానికి దగ్గరగా దర్శకుడు అద్భుతంగా మలిచారు. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని నిర్మాతలు చెప్పారు.

# మాస్ లుక్‌లో...

చిరంజీవి మేనల్లుడు పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా పరిచయమవుతున్న 'ఉప్పెన' సినిమా ఫస్ట్‌లుక్‌ను ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విడుదల చేశారు. బుచ్చిబాబు సానా దర్శకుడు. కృతిశెట్టి కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. విజయ్ సేతుపతి ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. పోస్టర్‌లో మాస్ లుక్‌లో వైష్ణవ్ తేజ్ ఆకట్టుకుంటున్నారు. చిత్రీకరణ తుదిదశలో ఉన్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 2న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.


వైష్ణవ్ తేజ్

# ఫ్యాన్స్‌తో గొడవలు సృష్టించకండి

- రేణూ దేశాయ్

"నా జీవిత మనుగడ కోసం ఎంతగానో శ్రమిస్తూ, ఒంటరి పోరాటం చేస్తున్నాను. నేనిప్పటి వరకూ నా తండ్రి నుంచి ఏ రకమైన ఆర్థిక సహాయమూ ఆశించలేదు. నా మాజీ భర్త నుంచి అన్యాయపూరితమైన భరణాన్నీ ఆశించలేదు, పొందలేదు. అదీ నా వ్యక్తిత్వం! అయినప్పటికీ నా గురించి అన్యాయంగా, అసత్య వార్తలను ప్రచారం చేయడం ఎంతవరకూ సమంజసం" అని రేణూ దేశాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో పలు కార్యక్రమాల నిమిత్తం ఆమె హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ప్రస్తుతం రేణు నివాసం ఉంటున్న ఇంటిని తన మాజీ భర్త పవన్ కల్యాణ్ కొనిచ్చారన్న వార్త డిజిటల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో ఆమె ఫేస్‌బుక్ వేదికగా స్పందించారు. "మీరంతా అనుకుంటున్నట్లు హైదరాబాద్‌లో నాకున్న ఫ్లాట్ నాకెవ్వరూ కొనివ్వలేదు. నా కష్టార్జితంతో కొనుక్కున్న నా సొంత ఇల్లు అది. నా మాజీ భర్త కొనిచ్చారన్న అసత్య ప్రచారాల వల్ల నా నిజాయతీకీ, ఆత్మగౌరవానికీ భంగం కలుగుతుందనే ఆలోచన మీకెవ్వరికీ రాదా? నాకు తెలిసినంతవరకూ, ఈ వార్తకూ, నా మాజీ భర్తకూ ఎలాంటి సంబంధమూ ఉండి ఉండదు. కనీసం ఈ విషయం ఆయన దృష్టికి కూడా వెళ్ళి ఉండదు. ఒక వార్త నిజమో, కాదో నిర్ధారించుకోకుండానే తొందరపాటుతో ప్రచురించి ఒక ఒంటరి స్త్రీ మనుగడను ప్రమాదంలో నెట్టడం ఎంతవరకూ సమంజసం? ఇలాంటి వార్తలను ప్రజలు నిజమని నమ్మితే, సంఘంలో నాకున్న గౌరవం చెదిరిపోదా? అసత్య కథనాల వల్ల నా మనసు ఎంతగానో ఘోషిస్తోంది. బాధతో చితికిపోతోంది. దయచేసి అర్థం చేసుకోండి! మగాడి సాయం లేకుండా సాగుతున్న నాలాంటి ఒంటరి తల్లుల జీవన గమనానికి గౌరవం ఇవ్వకపోయినా ఫరవలేదు. ఇలా కించపరచకండి. నాకూ, నా మాజీ భర్త అభిమానులకూ మధ్య దయచేసి ఎలాంటి గొడవలూ సృష్టించకండి" అంటూ రేణు ఆవేదన వ్యక్తం చేశారు.



# 'శక్తి'మాన్ ప్రభావంతో...

శక్తిమాన్ సీరియల్ ప్రభావంతో సూపర్‌మేన్ అవుదామనుకున్న ఓ అబ్బాయి... నిజ జీవితంలో ఎటువంటి స్టంట్స్ చేశాడు? తండ్రి సలహాతో ఎలా సెటిలయ్యాడు? మన విద్యా వ్యవస్థలో లోపాలను అతడికి చెప్పిందెవరు? అవి విన్నాక అతడేం చేశాడు? అనే కథతో రూపొందిన తమిళ చిత్రం 'హీరో'. శివ కార్తికేయన్, కల్యాణీ ప్రియదర్శన్ జంటగా నటించారు. పి.యస్ మిత్రన్ దర్శకుడు. కోటపాడి జె రాజేశ్ నిర్మాత. తెలుగులో 'శక్తి'గా విడుదల కానుందీ సినిమా. దర్శకుడు మాట్లాడుతూ "యూనివర్సల్ కథతో వాస్తవ ఘటనలతో రూపొందిన చిత్రమిది. ప్రేక్షకులకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తూనే... ఆలోచింపజేసేలా ఉంటుంది" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "విద్యావ్యవస్థ గురించి చిత్రంలోని సంభాషణలు అందర్నీ ఆలోచనలో పడేస్తాయి. త్వరలో సెన్సార్‌కు వెళ్తున్నాం. ఈ నెలలో పాటలు విడుదల చేసి, చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు.


శివ కార్తికేయన్












| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 41,257.74 | 12,113.45 | 40,780 | 46,000 | 71.37 | 57.09 |
| 202.05 ↓ | 61.20 ↓ | 14 ↑ (ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత)) | 110 ↑ | (6 పైసలు) ↓ | ↑ |



టెల్కోలకు

మార్చి 17 లోగా బకాయిలు చెల్లించండి

లేదంటే కోర్టు ధిక్కార చర్య తప్పదు

# సుప్రీం ఝలక్

## అత్యున్నత న్యాయస్థానం చెప్పినా అంత నిర్లక్ష్యమా?

కంపెనీలను బలవంతపెట్టవద్దని డెస్క్ ఆఫీసర్ లేఖ రాస్తాడా?

అతని అధికార పరిధి ఏంటి? ఇదేనా కోర్టులపై మీకున్న గౌరవం

ఇదే మీ వైఖరి అయితే సుప్రీంకోర్టును మూసేద్దాం

సొలిసిటర్ జనరల్‌పై న్యాయమూర్తుల ఆగ్రహం

*టెలికాం కంపెనీలు ఏజీఆర్ బకాయిలు చెల్లించకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం ప్రకటించింది. టెల్కోల రివ్యూ పిటిషన్లు కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ రూ.1.47 లక్షల కోట్ల బకాయిలు చెల్లించకుండా తాత్సారం చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించింది. ఇందుకు బాధ్యులైన అందరిపై ఎందుకు కోర్టు ధిక్కారం కింద చర్య తీసుకోకూడదని ప్రశ్నిస్తూ "మీరు మరింత జాప్యం చేయడానికి ఇంకా ఏదైనా చట్టం మిగిలి ఉందా" అని ప్రశ్నించింది. వొడాఫోన్ ఐడియా, భారతి ఎయిర్‌టెల్, టాటా టెలీ సర్వీసెస్ కంపెనీల బకాయిల వ్యవహారంపై విచారణ జరిపిన జస్టిస్ అరుణ్ మిశ్రా నాయకత్వంలో జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ ఎంఆర్ షా సభ్యులుగా గల డివిజన్ బెంచ్ శుక్రవారం తాజా ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 17వ తేదీకి వాయిదా వేసింది. ఆ లోగా బకాయిలు చెల్లించాలని, ఈ తాజా ఉత్తర్వులను కూడా గౌరవించకపోతే సంబంధిత అధికారులందరి మీద కోర్టు ధిక్కార చర్య తీసుకుంటామని హెచ్చరించింది.*



జస్టిస్ అరుణ్ మిశ్రా జస్టిస్ అబ్దుల్ నజీర్ జస్టిస్ ఎంఆర్ షా

సుప్రీంకోర్టు విధించిన గడువు దాటినా ఆ బకాయిల చెల్లింపు విషయంలో టెల్కోలను ఇబ్బంది పెట్టవద్దని టెలికాం శాఖ (డాట్)కు చెందిన 'డెస్క్ ఆఫీసర్' ఏ అధికారంతో ఉత్తర్వులు జారీ చేశారని న్యాయమూర్తులు ప్రశ్నించారు. పైగా అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌కు, రాజ్యాంగం పరిధిలో పనిచేస్తున్న ఇతర అధికారులకు డెస్క్ ఆఫీసర్ లేఖలు రాయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు."సుప్రీంకోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టాలంటూ ఒక డెస్క్ ఆఫీసర్ ఆదేశాలు ఎలా జారీ చేస్తాడు, ఇదేనా ఈ దేశంలో చట్టం, కోర్టుల విషయంలో మీకున్న గౌరవం?"అని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఇలాంటి లేఖ రాయడం బకాయిల విషయంలో టెల్కోల అభ్యర్థనను మన్నించాలని పరోక్షంగా చెప్పినట్టే అవుతుందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులనే ఉల్లంఘించాయంటే ఆ ఉత్తర్వుపై టెలికాం కంపెనీలకు ఎలాంటి గౌరవం లేదన్న విషయం స్పష్టమవుతోందని బెంచ్ పేర్కొంది. మార్చి 17న కోర్టుకు హాజరు కావాలని, ఇంతవరకు ఎందుకు బకాయిలు చెల్లించలేదో వివరణ ఇవ్వడంతో పాటు కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినందుకు వారిపై తదుపరి చర్య ఎందుకు తీసుకోకూడదో సంజాయిషీ ఇవ్వాలని టెలికాం కంపెనీల ఎండీలు, డైరెక్టర్లను ఆదేశించారు. డెస్క్ ఆఫీసర్ కూడా అదే రోజున కోర్టుకు హాజరై అలాంటి లేఖ రాసినందుకు తక్షణం అతనిపై తగు చర్య ఎందుకు తీసుకోరాదో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

### న్యాయమూర్తుల ఆవేదన

"అసలిదంతా ఎవరు చేస్తున్నారో మాకు అర్థం కావడంలేదు. ఈ దేశంలో ఏ ఒక్క చట్టాన్ని అయినా మీరు వదిలిపెట్టారా? అసలు ఈ కోర్టులో, ఈ వ్యవస్థలో పని చేయకూడదు అనే భావన నాలో కలుగుతోంది. నాలో ఆగ్రహం పెల్లుబుకుతోంది. పూర్తి బాధ్యతాయుత వైఖరితోనే నేను ఇదంతా చెబుతున్నాను" అని జస్టిస్ అరుణ్ మిశ్రా వ్యాఖ్యానించారు. తనకు ఇంతకు ముందెన్నడూ ఈ స్థాయిలో కోపం రాలేదని, అసలు ఈ దేశంలో, ఈ వ్యవస్థలో ఎలా పని చేయాలా అన్న ఆవేదనతో తాను పూర్తిగా ఓర్పు కోల్పోయానన్నారు. ఒక డెస్క్ ఆఫీసర్ ఇదంతా చేసి ఉండాల్సింది కాదని వివరణ ఇచ్చిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బెంచ్‌కి క్షమాపణలు చెప్పారు. "ఇలాంటి ఆదేశాలు ఉపసంహరించుకోవాలని సొలిసిటర్ జనరల్ హోదాలో మీరైనా కనీసం డెస్క్ ఆఫీసర్‌కు చెప్పారా? ఇది సహించరాని చర్య. ఈ తరహాలో మేం పనిచేయలేం. మీ డెస్క్ ఆఫీసర్‌కే అంత ధైర్యం ఉన్నప్పుడు ఇంక సుప్రీంకోర్టు ఎందుకు, మూసేద్దాం" అని న్యాయమూర్తులు ముక్తకంఠంతో ప్రశ్నించారు. "నా గురించి నేనెప్పుడూ చింతించను. మీరు నన్ను అర్థం చేసుకోవడంలేదు. సుప్రీం ఉత్తర్వునే మీ డెస్క్ ఆఫీసర్ నిలిపివేస్తాడా? ఆయన సుప్రీంకోర్టు కన్నా ఉన్నతుడా?" అని జస్టిస్ మిశ్రా మరోసారి ప్రశ్నిస్తూ ఈ దేశంలో ఉండే కన్నా దేశాన్ని వదిలిపోవడం మంచిదనిపిస్తోందన్నారు. మా ఉత్తర్వులనే డెస్క్ ఆఫీసర్ నిలిపివేసిన వాతావరణంలో న్యాయవ్యవస్థ స్వస్థత పైనే మాకు అనుమానం కలుగుతోందన్నారు. ఇప్పటికిప్పుడే ఎలాంటి చర్య తీసుకోవద్దని, డెస్క్ ఆఫీసర్‌పై తాము వివరణ ఇస్తామని మెహతా చెప్పడంతో "ఇంకా ఎలాంటి దరఖాస్తులు దాఖలు చేస్తారు, ఎలాంటి అంశాలు ప్రస్తావిస్తారు? మీరు మమ్మల్ని తప్పించుకోవాలనుకుంటే అలాగే చేయండి, మా చర్య మేం తీసుకుంటాం" అని న్యాయమూర్తులన్నారు.

### అసలేం జరిగింది?

టెల్కోలు ప్రభుత్వానికి చట్టబద్ధంగా చెల్లించాల్సిన ఏజీఆర్ బకాయిలపై దీర్ఘకాలంగా కోర్టులో న్యాయపోరాటం జరుగుతోంది. ఇందులో భాగంగా రూ.1.47 లక్షల కోట్లు జనవరి 23 లోగా చెల్లించాలంటూ సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై టెల్కోలు రివ్యూ పిటిషన్ దాఖలు చేశాయి. ఆ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ మిశ్రా నాయకత్వంలోని బెంచ్ వారి అభ్యర్థనను పరిశీలించడానికి తమకు ఎలాంటి బలమైన కారణం కనిపించడంలేదంటూ జనవరి 16న తీర్పు చెప్పింది. టెల్కోల ఏజీఆర్ లెక్కకట్టే విషయంలో వారికి వస్తున్న నాన్ టెలికాం ఆదాయాలు కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని గత ఏడాది అక్టోబరు 24వ తేదీనే తీర్పు చెప్పింది. ఏజీఆర్‌కు టెలికాం శాఖ నిర్వచనం చెల్లుబాటవుతుందని తీర్పు చెబుతూ దానిపై టెల్కోల అభ్యంతరాలేవీ నిలవబోవని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో జరిగిన పరిణామాలే శుక్రవారంనాటి సుప్రీంకోర్టు ఆగ్రహానికి ఉత్తర్వులకు కారణం అయ్యాయి.

### తక్షణం చెల్లించండి: డాట్

ఏజీఆర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు తాజా చర్యలను పరిగణనలోకి తీసుకున్న టెలికాం శాఖ శుక్రవారం అర్ధరాత్రికల్లా బకాయిలు చెల్లించాలంటూ టెల్కోలను ఆదేశించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులు అమలు కాకుండా నిలిపివేసినందుకు అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహానికి గురైన డాట్ ఆయా కంపెనీలకు సర్కిళ్ల వారీగా, జోన్ల వారీగా డిమాండ్ నోటీసులు జారీ చేయడం ప్రారంభించింది. లైసెన్సు ఫీజు, స్పెక్ట్రమ్ వినియోగ చార్జీల బకాయిలన్నీ శుక్రవారం అర్ధరాత్రిలోగా చెల్లించాలం టూ తమకు నోటీసు అందిందని ఒక టెలికాం అధికారి వెల్లడించారు. 15 కంపెనీలు ప్రభుత్వానికి లైసెన్సు ఫీజు కింద రూ.92,642 కోట్లు, స్పెక్ట్రమ్ చార్జీ కింద రూ.55,054 కోట్లు కలిపి మొత్తం రూ.1.47 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంది. అందు లో ఎంత ఈ అర్ధరాత్రి లోగా చెల్లించాలని కోరిందన్న విషయంలో ఎలాంటి స్పష్టత లేదు. కాగా బకాయిలు చెల్లించాలని టెల్కోలను బలవంతపెట్టవద్దంటూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను కూడా డాట్ ఉపసంహరించుకుంది.

సుప్రీంకోర్టు అక్టోబరులో ప్రకటించిన తీర్పునకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలంటూ ఫీల్డ్ అధికారులను ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది. కాగా రూ.2.65 లక్షల కోట్లు చెల్లించాలంటూ డాట్ తమను కోరడాన్ని సవాలు చేస్తూ వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన గెయిల్, పవర్‌గ్రిడ్ వంటి సంస్థలు కూడా సుప్రీంకోర్టు తీర్పు అనంతరం తమ దరఖాస్తులను ఉపసంహరించుకున్నాయి.

### వారం లోగా రూ.10 వేల కోట్లు చెల్లిస్తాం: ఎయిర్‌టెల్

సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ ఈ నెల 20వ తేదీలోగా బకాయిల కింద రూ.10 వేల కోట్లు చెల్లించడానికి భారతీ ఎయిర్‌టెల్ సంసిద్ధత ప్రకటించింది. ఈ మేరకు డాట్‌కు చెందిన మెంబర్, ఫైనాన్స్‌కు ఒక లేఖ రాస్తూ సుప్రీంకోర్టు తదుపరి విచారణ తేదీ లోగా మిగతా బకాయి కూడా చెల్లిస్తామని తెలియచేసింది. ఏజీఆర్ బకాయిల కింద ఎయిర్‌టెల్ మొత్తం రూ.35,586 కోట్లు చెల్లించాల్సి ఉంది. అంతేకాదు డాట్ ఉత్తర్వుల మేరకు సెల్ఫ్ అసెస్‌మెంట్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపింది. 22 సర్కిళ్లలో కార్యకలాపాలు విస్తరించినందున అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని, దానికి కొంత సమయం పడుతుందని పేర్కొంది.కాగా వొడాఫోన్ ఐడియా మాత్రం సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా బకాయిల చెల్లింపుపై ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే ఏజీఆర్ బకాయిగా రూ.53వేల కోట్లు చెల్లించాలన్న డిమాండ్‌పై తీవ్రంగా పోరాడుతోంది. ఈ వ్యవహారంలో తమకు ఎలాంటి ఊరట కల్పించకపోతే కంపెనీ మూసివేస్తామని అంతకుముందే హెచ్చరించింది.

### గుత్తాధిపత్యానికి దారి తీస్తుంది

సుప్రీంకోర్టు.. టెల్కోల వ్యవహారంలో తాజాగా జారీ చేసిన ఉత్తర్వులు భారత మార్కెట్లో ఇంతకు ముందెన్నడూ లేని విధంగా రెండు టెల్కోల గుత్తాధిపత్యానికే దారి తీస్తుందని కన్సల్టింగ్ సంస్థ కామ్ ఫస్ట్ ఇండియా డైరెక్టర్ మహేశ్ ఉప్పల్ అన్నారు. ఈ తీర్పుతో వొడాఫోన్ ఐడియా పరిస్థితి మరింత ఇరకాటంలో పడుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, రిలయన్స్ జియో ఆధిపత్యం సాగుతోంది. ఇవి కాకుండా ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ కూడా ఉన్నాయి. ఇప్పుడు టెలికాం ఆపరేటర్లు ఏదో ఒక మాయ చేయగలిగే పరిస్థితి చాలా తక్కువగా ఉందని అభిప్రాయపడ్డారు. ఇది దీర్ఘకాలిక సమస్య అని ప్రభుత్వం భావిస్తే విధానంలో మార్పులు చేయాలన్నారు.

### నిధుల కోసం ఎవరూ రాలేదు

సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు బకాయిల చెల్లింపునకు అవసరమైన నిధులు సమకూర్చుకోవడం ఆయా టెల్కోల బాధ్యత అని ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార్ అన్నారు. బహుశ ఈ సమయానికి వారు ఏదో ఒక ఏర్పాటు చేసుకుని ఉంటారని కూడా ఆయన వ్యాఖ్యానించారు. బకాయిల చెల్లింపుల కోసం తమకు ఆర్థిక సహాయం అందించాలని ఏ టెలికాం కంపెనీ తమను అభ్యర్థించలేదని రజనీశ్ చెప్పారు.

---

## ఆధార్‌తో అనుసంధానం చేయకుంటే.. మార్చి 31 తర్వాత పాన్ పని చేయదు




న్యూఢిల్లీ: మీ ఆధార్‌తో పాన్‌ను అనుసంధానం చేశారా? ఒకవేళ చేయకపోతే వెంటనే ఆ పని పూర్తి చేయండి. లేకపోతే మార్చి 31 తర్వాతి నుంచి మీ పాన్ పని చేయదని ఆదాయ పన్ను శాఖ వెల్లడించింది. పాన్, ఆధార్ అనుసంధానానికి సంబంధించిన గడువును అనేక మార్లు పొడిగించారు. ప్రస్తుత గడువు 2020 మార్చి 31. జనవరి 27 వరకు 30.75 కోట్లకు పైగా పాన్‌లు ఆధార్‌తో అనుసంధానమయ్యాయి. ఇంకా 17.58 కోట్ల పాన్‌లు ఆధార్‌తో అనుసంధానం కావాల్సి ఉంది. 2017 జూలై 1 వరకు శాశ్వత ఖాతా నెంబరు (పాన్) కేటాయింపు జరిగిన వ్యక్తులు నిబంధనల మేరకు ఆధారత్ నెంబర్‌తో అనుసంధానం చేయాలని, మార్చి 31 వరకు అనుసంధానం చేయకపోతే పాన్ పని చేయదని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) వెల్లడించింది. కొన్ని రకాల లావాదేవీలు నిర్వహించినప్పుడు పాన్ నెంబర్‌ను వెల్లడించాల్సి ఉంటుంది. పాన్ పని చేయని పక్షంలో అది లేనట్టే లెక్క. కొన్ని లావాదేవీలప్పుడు పాన్ వివరాలు వెల్లడించని వారిపై ఐటీ చట్టం ప్రకారం తీసుకునే చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందని సీబీడీటీ తెలిపింది.

## హీరో మోటో నుంచి బీఎస్-6 స్ల్పెండర్ ప్లస్

న్యూఢిల్లీ : హీరో మోటోకార్ప్ బీఎస్-6 ప్రమాణాలతో కూడిన స్ల్పెండర్ ప్లస్ మోటార్‌సైకిల్‌ను విడుదల చేసింది. ఈ బైక్ ప్రారంభ ధర రూ.59,600. స్ల్పెండర్ ప్లస్‌తో పాటు డెస్టినీ 125, మాస్ట్రో ఎడ్జ్ 125 లో బీఎస్-6 వెర్షన్స్‌ను తీసుకువచ్చింది. ఈ స్కూటర్ల ప్రారంభ ధరలు వరుసగా రూ.64,310, రూ.67,950 (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి. ఈ మూడు వాహనాలతో హీరో మోటోకార్ప్ ఉత్పత్తుల పోర్టుఫోలియో మొత్తం బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ అయ్యాయని సంస్థ గ్లోబల్ ప్రొడక్ట్ హెడ్ మాలే లీ మాసన్ వెల్లడించారు. కాగా రానున్న కొద్ది వారాల్లో కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు చెప్పారు.




## మారుతి వ్యాగన్‌ఆర్ బీఎస్-6 సీఎన్‌జీ వేరియంట్

న్యూఢిల్లీ : దేశీయ కార్ల ఉత్పత్తి దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా.. బీఎస్-6 ప్రమాణాలతో కూడిన ఎస్-సీఎన్‌జీ వేరియంట్ న్యూ వ్యాగన్‌ఆర్‌ను తీసుకువచ్చింది. ఈ కారు ప్రారంభ ధర రూ.5.25 లక్షలు (ఎక్స్‌షోరూమ్). రానున్న కొద్ది సంవత్సరాల్లో 10 లక్షల పర్యావరణహిత వాహనాలను విక్రయించాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఈ సీఎన్‌జీ కారును తీసుకువచ్చినట్లు తెలిపింది. బీఎస్-6 ప్రమాణాలను కలిగిన మూడో ఎస్-సీఎన్‌జీ వాహనం ఇదని పేర్కొంది. ఎల్ఎక్స్ఐ, ఎల్ఎక్స్ఐ (ఒ) వేరియంట్లలో వ్యాగన్‌ఆర్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఈ వేరియంట్ల ధరలు వరుసగా రూ.5.25 లక్షలు, రూ.5.32 లక్షలుగా ఉన్నాయి.

**ప్రారంభ ధర రూ.5.25 లక్షలు**



### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 14వ తేదీకి.. | | విజయవాడ | 410 |
| హైదరాబాద్ | 395 | విశాఖపట్నం | 415 |
| 15వ తేదీకి.. | | వరంగల్ | 398 |
| చిత్తూరు | 443 | డజను గుడ్లు రూ. 60 | |
| గోదావరి | 410 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 54 | విజయవాడ | 60 |
| వరంగల్ | 54 | గుంటూరు | 60 |
| మహబూబ్‌నగర్ | 54 | ఒంగోలు | 62 |
| కరీంనగర్ | 55 | చిత్తూరు | 74 |
| కర్నూలు | 54 | నెల్లూరు | 74 |
| విశాఖపట్నం | 60 | అనంతపురం | 61 |
| గోదావరి | 54 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 40,880 | 41,300 | 42,080 | 41,000 | 40,830 |
| క్రితం ముగింపు | 40,630 | --- | 42,030 | 41,000 | 40,830 |
| 22 క్యారెట్లు | 38,910 | 38,250 | 38,710 | 37,820 | 38,890 |
| క్రితం ముగింపు | 38,680 | --- | 38,660 | 37,970 | 38,890 |
| వెండి (కిలో) | 45,900 | 47,600 | 47,400 | 47,400 | 49,800 |
| క్రితం ముగింపు | 45,800 | --- | 47,300 | 47,300 | 49,700 |

## శ్రీసిటీలో టోరే పరిశ్రమ ప్రారంభం

▸▸ త్వరలో నూతన పారిశ్రామిక విధానం: మంత్రి మేకపాటి

సత్యవేడు/శ్రీసిటీ(వరదయ్యపాళెం), ఫిబ్రవరి 14: రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చేందుకు త్వరలో నూతన పారిశ్రామిక పాలసీని ప్రవేశపెడుతున్నట్లు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రకటించారు. జపాన్‌కు చెందిన టోరే ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ను చిత్తూరు జిల్లా శ్రీసిటీలో శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.1000 కోట్లతో ఏర్పాటైన టోరే పరిశ్రమ రాష్ట్రంలో పారిశ్రామిక స్థిరత్వాన్ని సూచిస్తోందన్నారు. ఇంజనీరింగ్ ఫ్యాబ్రిక్స్, టెక్స్‌టైల్స్ తయారుచేసే ఈ తరహా పరిశ్రమ దేశంలోనే మొదటిదన్నారు. టోరే ఇండియా ఎండీ షిగెకజు సునాగ, శ్రీసిటీ ఎండీ రవీంద్ర, చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ కొజిరో యుచియమ, టోరే ఇండస్ట్రీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మిట్సు ఒహయో, ఎంపీ బల్లి దుర్గాప్రసాద్, ఎమ్మెల్యేలు ఆదిమూలం, సంజీవయ్య పాల్గొన్నారు. కాగా, శ్రీసిటీలోని ఫాక్సన్, ఎంఎ్ఆర్ గార్మెంట్స్ ఉత్పత్తి కేంద్రాలను మేకపాటి సందర్శించారు. అనంతరం జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జట్రో) ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు.



టోరే ప్రారంభోత్సవ సమావేశంలో మంత్రి మేకపాటి

## మహిళా పారిశ్రామిక వేత్తల సదస్సు

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 14: కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులో మహిళా పారిశ్రామికవేత్తల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈనెల 16వరకు జరిగే సదస్సులో పలు రాష్ట్రాలకు చెందిన పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పరిశ్రమలు స్థాపించి, విజయవంతంగా ఎలా ముందుకు సాగుతున్నామో వివరించారు. స్వయంఉపాధి పరిశ్రమలపై ఆసక్తి ఉన్న నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల మహిళలు పాల్గొన్నారు. మహిళలు పారిశ్రామిక రంగంలో ప్రగతి సాధించాలని ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. కార్యక్రమంలో వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ వసంతలక్ష్మి, తమిళనాడుకు చెందిన మహిళా పారిశ్రామికవేత్త సుధాపురుషోత్తమ్, ఎపీఐఐసీ జనరల్ మేనేజర్ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపై ఎస్ఎఫ్ఏసీ ఆసక్తి

▸▸ ఐటీ పార్కును సందర్శించిన ప్రతినిధులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన స్టేట్ ఆటో ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్ఏసీ) విశాఖలో కేపిటివ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ఆసక్తి చూపుతోంది. ఆ కంపెనీ ప్రతినిధుల బృందం గురువారం అమరావతిలో ఐటీశాఖ మంత్రి గౌతంరెడ్డిని కలిసి, శుక్రవారం విశాఖపట్నం వచ్చింది. ఏపీ రాష్ట్ర ఐటీ అసిసోయేషన్(ఐటాప్) ప్రతినిధులు నారాయణ, శ్రీధర్ కొసరాజు, రాష్ట్ర ఐటీ సలహాదారు శ్రీకాంత్‌రెడ్డి వారిని రుషికొండ ఐటీ పార్కుకు తీసుకువెళ్లి చూపించారు. ఇక్కడ వేయిమందితో సెంటర్ ఏర్పాటుచేసే ఆలోచనతో ఉన్నారని, త్వరలోనే మళ్లీ విశాఖ వస్తారని ఐటాప్ వర్గాలు తెలిపాయి. ఎస్ఎఫ్ఏసీ బృందంలో సంస్థ సీఎస్ఓ గ్రెస్ తచ్చేటి, సీటీఓ రాము లింగాల, వైస్ ప్రెసిడెంట్ సురేశ్ దండు ఉన్నారు.

## జీవీకే పవర్ నష్టం రూ.96 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నష్టం స్వల్పంగా తగ్గింది. ఏకీకృత ప్రాతిపదికన కంపెనీ డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు రూ.96 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.100.48 కోట్ల నష్టాన్ని చవిచూసింది. మొత్తం ఆదాయం రూ.1,109 కోట్ల నుంచి రూ.1,156 కోట్లకు పెరిగిందని కంపెనీ వెల్లడించింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.3,257.43 కోట్ల ఆదాయంపై రూ.387 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. కంపెనీకి రుణ భారం పెరిగిపోయినందున నగదు లభ్యత వ్యాపారాల కొనసాగింపు కష్టంగా మారవచ్చన్న అభిప్రాయాన్ని కంపెనీ ఆడిటర్లు వ్యక్తం చేశారు. సమీక్ష త్రైమాసికానికి విమానాశ్రయాల విభాగం నుంచి లభించిన ఆదాయం రూ.930 కోట్ల నుంచి రూ.1,044 కోట్లకు పెరిగింది.

## ఐవీఆర్‌సీఎల్ నష్టం రూ.428 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ఐవీఆర్‌సీఎల్ నష్టం మరింత పెరిగింది. ఏడాది క్రితం ఇదే కాలంలో కంపెనీ రూ.410 కోట్ల నష్టాన్ని ప్రకటించగా.. డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు రూ.428 కోట్లకు పెరిగింది. సమీక్ష త్రైమాసికానికి కంపెనీ ఆదాయం రూ.174.17 కోట్ల నుంచి రూ.84.15 కోట్లకు పరిమితమైంది. 2019-20 మొదటి తొమ్మిది నెలలకు ఆదాయం రూ.317.69 కోట్లు ఉండగా.. నష్టం రూ.1,202 కోట్లుగా నమోదైంది. కంపెనీ మొత్తం నష్టాలు రూ.6,924 కోట్లకు చేరాయి.

## గాయత్రీ ప్రాజెక్ట్స్ ఆదాయం రూ.847 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గత ఏడాది డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు గాయత్రీ ప్రాజెక్ట్స్ ఏకీకృత ప్రాతిపదికన రూ.847.18 కోట్ల ఆదాయంపై రూ.3.68 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఏడాది క్రితం ఇదే కాలంలో ఆదాయం రూ.882.64 కోట్లు, లాభం రూ.37.87 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.2,532 కోట్ల ఆదాయంపై రూ.22.87 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

## ఆర్‌కామ్ నష్టాలు రూ.10,598 కోట్లు

న్యూఢిల్లీ : దివాలా పరిష్కార చర్యల్లో ఉన్న రిలయన్స్ కమ్యూనికేషన్స్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.10,598 కోట్ల నష్టాలను ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నష్టం రూ.238 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో కంపెనీ రాబడులు రూ.1,083 కోట్ల నుంచి రూ.263 కోట్లకు పడిపోయాయి. వడ్డీలు, విదేశీ మారకంలో తేడాలకు భారీగా కేటాయింపులు చేయటం కంపెనీ పనితీరును దారుణంగా దెబ్బతీసిందని ఆడిటర్లు పేర్కొన్నారు.

## భారీగా తగ్గిన ఓఎన్‌జీసీ లాభం

న్యూఢిల్లీ: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఓఎన్‌జీసీ నికర లాభం సగానికి సగం తగ్గింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ రూ.23,710 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.4,152 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలం (రూ.8,263 కోట్లు)తో పోల్చితే నికర లాభం ఏకంగా 49.8 శాతం క్షీణించింది. చమురు, గ్యాస్ ధరలు తగ్గటంతో పాటు ఉత్పత్తి పడిపోవటం కంపెనీ పనితీరును దెబ్బకొట్టింది.

ఆంధ్రజ్యోతి

# 3 ఒక రాష్ట్రం రాజధానులు

విజయవాడ ● శనివారం 15 ఫిబ్రవరి 2020



హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి అమరావతి ఉద్యమానికి రూ. 2లక్షల విరాళం అందజేస్తున్న అట్లాంటాకు చెందిన ఎన్నారై ఆనందకిశోర్ యార్లగడ్డ, మధుకర్ యార్లగడ్డ

### అమరావతి శాసన రాజధాని..

## అక్కడ 70 రోజులు ఉంటా

- ఢిల్లీ జర్నలిస్టులతో సీఎం జగన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'అమరావతి లెజిస్లేటివ్ కేపిటల్ కదా..! అక్కడ నేను 70 రోజులు ఉంటా' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో శుక్రవారం రాత్రి ఆయన తన అధికార నివాసమైన 1-జన్‌పథ్ వద్ద ఢిల్లీలోని తెలుగు జర్నలిస్టులతో భేటీ అయ్యారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతిలో ఇళ్లస్థలాల కోసం అక్కడ హౌసింగ్ సొసైటీకి రూ.23 వేలు చెల్లించామని.. కానీ ఇళ్ల స్థలాలు రాలేదని.. మీ హయాంలో మంజూరు చేయాలని జర్నలిస్టులు కోరారు. 'అమరావతిలో మీకు స్థలాలు కావాలా' అంటూ సీఎం ఒకింత వ్యంగ్యంగా నవ్వుతూ వ్యాఖ్యానించారు. మీరూ అమరావతిలోనే నివాసం ఉంటున్నారు కదా.. అని ఒక విలేకరి అన్నప్పుడు జగన్ పైవిధంగా స్పందించారు. ఇళ్ల స్థలాల కోసం వినతి పత్రం ఇస్తే పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

### అలా జరక్కుండా చూడండి: ప్రధానికి కనకమేడల లేఖ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజధానుల ఏర్పాటు, శాసనమండలి రద్దు విషయాన్ని సమగ్రంగా పరిశీలించి, ఈ నిర్ణయాలు అమలు కాకుండా విశాల ప్రజా ప్రయోజనాల దృష్టితో చూడాలని టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్.. ప్రధాని మోదీని కోరారు. ఈ మేరకు లేఖ రాశారు. శాసనమండలిపై ఒక జాతీయ విధానం ఉండాలని గతంలో పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫారసును ఆ లేఖలో వివరించారు.

### 22 మంది ఉన్నా హోదా మరిచారు : శైలజానాథ్



విజయనగరం టౌన్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో ఎంపీలను గెలిపిస్తే ప్రత్యేక హోదా తెస్తానన్న ముఖ్యమంత్రి జగన్.. నేడు 22 మంది ఎంపీలున్నా హోదాను ఎందుకు తేలేకపోతున్నారని పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ ప్రశ్నించారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎవరి వద్దా తలదించలేదని, జగన్ మాత్రం అమిత్‌షాను కలిసేందుకు గుమ్మం ముందు వంగి నిలబడుతున్నారని ఎద్దేవా చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్రానికి రావాల్సిన రూ.28 వేల కోట్లు కూడా అడగలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు. కాగా సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాధ్యక్షుడు ఎన్.తులసిరెడ్డి విమర్శించారు.

### రాజధాని మార్పు రాష్ట్రానికి తీవ్ర నష్టం : మధు

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 14: రాజధాని మార్పు వైసీపీతో సహా రాష్ట్ర ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు హెచ్చరించారు. అమరావతినే పరిపాలనా రాజధానిగా కొనసాగించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో 24 గంటల నిరసన దీక్ష శుక్రవారం ధర్నాచౌక్‌లో చేపట్టారు. ఈ కార్యక్రమంలో 'రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం డౌన్‌డౌన్', రైతులు, రైతు కూలీలకు న్యాయం చేయాలి', 'రాజధానిగా అమరావతినే కొనసాగించాలి' అని పెద్దఎత్తున నినాదాలు చేశారు.

### 17న టీఎన్‌ఎస్‌ఎఫ్ మేధోమథన సదస్సు

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు విద్యార్థి సమాఖ్య (టీఎన్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 17న మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి మేధోమథన సదస్సు జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి శుక్రవారం తెలిపారు.

## మండలిలో రాజ్యాంగ సంక్షోభం!

(మొదటి పేజీ తరువాయి)

చట్ట సభలకు కలిపి ఒకే కార్యదర్శి ఉండడం సంక్లిష్టతను పెంచింది. మామూలుగా శాసనసభ, మండలికి వేర్వేరు కార్యదర్శులు ఉండాలి. కానీ ఇంతకు ముందు మండలి కార్యదర్శిగా ఉన్న సత్యనారాయణ పదవీ విరమణ తర్వాత ఆ స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు. అసెంబ్లీ కార్యదర్శిగా ఉన్న బాలకృష్ణమాచార్యులే మండలికి కూడా కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. శాసనసభలో వైసీపీకి, మండలిలో టీడీపీకి ఆధిక్యం ఉండడం.. రెండు సభలకు కలిపి ఒకే కార్యదర్శి ఉండడంతో పరిస్థితి క్లిష్టంగా మారింది. సెలెక్ట్ కమిటీ ఏర్పాటు వ్యవహారంలో తాము చెప్పినట్లే వినాలని అధికార పక్షం.. మండలిలో సంఖ్యాబలం ఉన్న తమ మాటే వినాలని విపక్ష టీడీపీ పట్టుబడుతున్నాయి. కార్యదర్శి అధికార పక్షం చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. తన ఆదేశాల మేరకు వెంటనే సెలెక్ట్ కమిటీ ఏర్పాటు చేసి బులెటిన్ విడుదల చేయాలని రెండు రోజుల క్రితం మండలి చైర్మన్ ఆయనకు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. 48 గంటల్లో తన ఆదేశాలు పాటించాలని కూడా అందులో స్పష్టంగా పేర్కొన్నారు. కానీ తాను ఆ ఆదేశాలను పాటించలేకపోతున్నానని కార్యదర్శి శుక్రవారం పంపిన సమాధానంలో పేర్కొన్నట్లు సమాచారం. చైర్మన్ ఆదేశాలపై కొందరు సాంకేతిక అభ్యంతరాలు లేవనెత్తారని, అందువల్ల తాను ఆ ఆదేశాలను పాటించలేకపోతున్నానని ఆయన తెలిపారు. దీనితో సెలెక్ట్ కమిటీ వ్యవహారంలో పీట ముడి పడింది. కమిటీ ఏర్పాటు చేయాల్సిందేనని చైర్మన్ ఆదేశిస్తుంటే దానిని అమలు చేయడానికి కార్యదర్శి నిరాకరించడం కొత్త పరిణామం. మండలి చరిత్రలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ ఏర్పడలేదని.. ఒక రకమైన రాజ్యాంగ సంక్షోభాన్ని ఇది ప్రతిబింబిస్తోందని సీనియర్ రాజకీయ వేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

### న్యాయనిపుణులతో చైర్మన్ సంప్రదింపులు..

కార్యదర్శి తన అభిప్రాయాన్ని రాసి పంపడంతో దీనిపై ఏం చేయాలన్న దానిపై మండలి చైర్మన్ న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నట్లు సమాచారం. మరోపక్క మండలిలో సంఖ్యాబలం ఉన్న టీడీపీ కూడా ఈ పరిణామాలపై చర్చిస్తోంది. చైర్మన్ ఆదేశాలను కార్యదర్శి నిరాకరించడంపై కోర్టుకెళ్తే ఎలా ఉంటుందన్నదానిపై ఆ పార్టీ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఢిల్లీలో ఉన్న కొందరు సీనియర్ న్యాయనిపుణులు, పార్లమెంటరీ వ్యవహారాల్లో అనుభవం ఉన్నవారి సలహాలను తీసుకునే ప్రయత్నంలో ఉంది.

### కార్యదర్శిపై 'ధిక్కరణ' అభియోగం?

మండలి కార్యదర్శిపై సభా హక్కుల ధిక్కరణ అభియోగం మోపి విచారణ నిర్వహించాలన్న ప్రతిపాదనను కొందరు ఎమ్మెల్సీలు ముందుకు తెచ్చారు. మండలిలో సభాముఖంగా చైర్మన్ చేసిన ప్రకటన సభ నిర్ణయం కిందే లెక్కని, దానిని ధిక్కరించినందుకు కార్యదర్శిని సభాహక్కుల ఉల్లంఘన కింద విచారించాలని వారు సూచిస్తున్నారు. బడ్జెట్ సమావేశాల కోసం వచ్చే నెలలో మండలి సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఆ సమావేశాల్లో కార్యదర్శిపై ధిక్కరణ అభియోగం కింద విచారణ చేపట్టే అవకాశముంది. ఈ విచారణ రెండు రకాలుగా జరపవచ్చని ఎమ్మెల్సీలు చెబుతున్నారు. ఎమ్మెల్సీలు చేసిన ఫిర్యాదును సభాహక్కుల సంఘానికి పంపి ఆ సంఘం ఆధ్వర్యంలో విచారణ జరపడం ఒక పద్ధతి. నేరుగా సభ ముందుకే కార్యదర్శిని పిలిపించి అక్కడే విచారణ జరిపి తక్షణమే శిక్ష విధించడం రెండో పద్ధతి. కార్యదర్శిపై సభా హక్కుల విచారణ చేపడితే మండలి చరిత్రలో ఇదే ప్రథమమవుతుంది.

### కార్యదర్శి చేసింది తప్పు: యనమల

సెలెక్ట్ కమిటీ ఫైలును మండలి కార్యదర్శి తిప్పిపంపడం సభా ధిక్కారమేనని, ఆయన తప్పు చేశారని మండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కార్యదర్శి వ్యవహార శైలిపై ఎమ్మెల్సీలెవరైనా ఫిర్యాదు చేస్తే సభాహక్కుల ఉల్లంఘన కింద విచారణ జరపాల్సి వస్తుందని చెప్పారు. సెలెక్ట్ కమిటీ ఏర్పాటుపై ఏం చేయాలన్నదానిపై న్యాయనిపుణులతో మాట్లాడుతున్నామని, అన్ని మార్గాలూ తమకు తెరిచే ఉన్నాయని తెలిపారు.

# చేయి చేయి.. కలిపి

## అమరావతి కోసం విశ్రమించని అన్నదాత

- తుళ్లూరులో భారీ మానవహారం
- సేవ్.. అమరావతి నినాదాల హోరు
- 12 గంటల దీక్ష చేపట్టిన మహిళలు
- మందడంలో గులాబీలు పంచి నిరసన
- పుల్వామా మృతులకు నివాళి
- నేడు పవన్ కల్యాణ్ పర్యటన




యర్రబాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు




తుళ్లూరు దీక్షా శిబిరంలో..

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాజధానిగా అమరావతినే కొనసాగించాలనే డిమాండ్‌తో రైతులు చేయి చేయి కలిపి.. తమ ఆందోళనలను మరింత తీవ్రతరం చేశారు. అమరావతి రాజధాని తరలింపు నిర్ణయాన్ని నిరసిస్తూ రైతులు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం 59వ రోజుకు చేరాయి. రోజుకో రూపంలో రైతులు, మహిళలు, రైతు కూలీలు తమ నిరసనలు తెలుపుతున్నారు. మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తుళ్లూరు, మందడంలో మహాధర్నాలను కొనసాగించారు. రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. జై అమరావతి.. నినాదంతో రాజధాని ప్రాంతం మార్మోగింది. మందడం, తుళ్లూరులో మహిళలు 12 గంటల నిరాహార దీక్ష చేశారు. మందడంలో రైతులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాజధాని అమరావతికి మద్దతు తెలపాలంటూ అసెంబ్లీ, సచివాలయం ఉద్యోగులు, పోలీసులకు గులాబీలు పంచారు. రాయపూడిలో ముస్లిం మహిళలు స్థానిక దర్గాల్లో పొంగళ్లు పెట్టి అమరావతిని రాజధానిగా కొనసాగించాలంటూ ప్రార్థనలు చేశారు. అమరావతి కోసం ఎన్ని రోజులైనా పోరాడతామని పునరుద్ఘాటించారు. తమను రెచ్చగొట్టాలని కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రం కూడా తమ బతుకులతో ఆడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'అమరావతితోనే మా భవిత' అంటూ తుళ్లూరు మహిళలు శుక్రవారం మానవహారంగా ఏర్పడి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. గ్రామం నడిబొడ్డున ఉన్న ఎర్రమాసువారి చెరువు చుట్టూ మహిళలు మానవహారంగా ఏర్పడి 'జై అమరావతి' నినాదాలు చేశారు. ఎండను సైతం లెక్క చేయకుండా 700 మీటర్ల దూరం ఉన్న చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ మీద చేయి చేయి కలిపి, ఆకుపచ్చ రంగు బెలూన్లు పట్టుకొని అమరావతికి జై అంటూ నినదించారు. పెదపరిమి దీక్షా శిబిరాన్ని ప్రకాశం జిల్లా రైతులు సందర్శించారు. రైతు నాయకులు పుచ్చకాయల సుబ్బారావు మాట్లాడుతూ, రాష్ట్రం రాజధానికి భూములు త్యాగం చేయటం ఈ ప్రాంత రైతులు చేసుకున్న పాపమా? అని ప్రశ్నించారు. మంగళగిరి మండలంలో జేఏసీ నేతలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 59వ రోజుకు చేరుకున్నాయి. శ్రీ భద్రావతీ సమేత భావనాఋషి ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకుని, పూజలు చేశారు.

### నేడు జనసేనాని పర్యటన

జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ శనివారం రాజధాని గ్రామాల్లో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు మంగళగిరి కార్యాలయం నుంచి ర్యాలీగా యర్రబాలెం చేరుకుంటారు. 10 గంటలకు మందడం, 10.30కు వెలగపూడి, 11 గంటలకు రాయపూడి, 11.30 తుళ్లూరు, 12గంటలకు అనంతవరం గ్రామా ల్లో పర్యటిస్తారు.



పెనుమాక శిబిరంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న మహిళలు, రైతులు

### అమర జవాన్లకు ఘన నివాళి

పుల్వామా ఘటనలో అమరులైన జవాన్‌లకు మందడం మహిళలు, రైతులు ఘన నివాళి అర్పించారు. వారి త్యాగాలను మననం చేసుకుంటూ మౌన ప్రదర్శనగా.. గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వారు చూపిన తెగువను ఆదర్శంగా తీసుకొని అమరావతి ఉద్యమం కొనసాగిస్తామని మహిళలు ప్రతినబూనారు. మందడం దీక్ష శిబిరాన్ని బీజేపీ నాయకురాలు నిమ్మగడ్డ సీతారత్నం సందర్శించారు.

## త్వరలో గ్రేటర్ రాయలసీమ ఉద్యమం

- తీవ్రత ఢిల్లీ చేరేలా పోరాటం: గంగుల ప్రతాపరెడ్డి

నంద్యాల, ఫిబ్రవరి 14: త్వరలోనే గ్రేటర్ రాయలసీమ ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు బీజేపీ నాయకుడు, నంద్యాల మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి చెప్పారు. గ్రేటర్ రాయలసీమ రాష్ట్రం ఏర్పడితే దేశంలో ఏ రాష్ట్రానికీ తీసిపోని విధంగా ఉంటుందన్నారు. భవిష్యత్తు తరాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందనే భావనతో గ్రేటర్ రాయలసీమ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. శుక్రవారం కర్నూలు జిల్లా నంద్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాయలసీమకు దశాబ్దాల తరబడి అన్యాయం జరుగుతోందన్నారు. దీనిని సరిదిద్దాలనే డిమాండ్‌తో రాయలసీమ నాలుగు జిల్లాలు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో కలిపి గ్రేటర్ రాయలసీమ రాష్ట్రం సాధనకు ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. త్వరలో ఈ జిల్లాల్లో పర్యటిస్తానని గంగుల చెప్పారు. ఒకరేమో విజయవాడ.. మరొకరేమో విశాఖపట్నం అంటూ.. రాయలసీమలో రాజధాని ఏర్పాటు చేయాలన్న కనీస ఆలోచన కూడా చేయడం లేదని చంద్రబాబు, జగన్‌పై విమర్శలు గుప్పించారు. ప్రత్యేక రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం తప్ప మరెవ్వరూ ఇవ్వలేరని, ఇచ్చేది.. ఇవ్వగలిగేది బీజేపీయేనని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రేటర్ రాయలసీమ రాష్ట్ర ఏర్పాటు, ఆవశ్యకత, ప్రజల డిమాండ్‌ను ఢిల్లీలో వినిపిస్తామని గంగుల స్పష్టం చేశారు.

### అమరావతి జేఏసీకి అట్లాంటా వాసుల విరాళం

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిరక్షణ జేఏసీకి అట్లాంటా ఎన్నారైలు రూ.2లక్షల విరాళం అందించారు. అట్లాంటాకు చెందిన యార్లగడ్డ ఆనందకిషోర్, మధుకర్ శుక్రవారం హైదరాబాద్‌లో మాజీ సీఎం చంద్రబాబును కలిసి ఈ మొత్తాన్ని అందజేశారు. కాగా విజయవాడలో జరిగిన యార్లగడ్డ మధుకర్ కుమారుడి నూతన వస్త్ర బహూకరణ వేడుకల్లో అతిథులందరికీ ఆయన అమరావతి హరిత కండువాలను కప్పి స్వాగతించారు. ఆకు పచ్చ దుస్తులు, ఆకు పచ్చ కండువాలు ధరించి, జై అమరావతి, సేవ్ అమరావతి, సేవ్ ఏపీ ప్లకార్డులతో నినాదాలు చేశారు. తనకు రాజధానిలో సెంటు భూమి లేదని.. అయినా ఈ ప్రాంతంపై మమకారంతోనే సంఘీభావం తెలుపుతున్నట్లు మధుకర్ తెలిపారు. తాము పెయిడ్ ఆర్టిస్టులం కాదన్నారు.

### మూడు రాజధానులు సరికాదు: రామకృష్ణ

దాసన్నపేట(విజయనగరం), ఫిబ్రవరి 14: మూడు రాజధానుల సిద్ధాంతం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విజయనగరంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి ఒకటే రాజధాని ఉండాలన్నారు. నాడు అందరి సమ్మతితోనే అమరావతిని రాజధానిగా ఎంపిక చేసిన విషయాన్ని గుర్తుచేశారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా సాయమందించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో సీపీఐ మొదటి నుంచీ పోరాడుతుందొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తరలి రావాలంటే అందుకు తగ్గట్టుగా మంచి వాతావరణం కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని రామకృష్ణ అన్నారు.

### 'ఫీజు' తేల్చరు

## 'రీయింబర్స్' చేయరు!

(మొదటి పేజీ తరువాయి)

రూ.20 వేలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. గత విద్యా సంవత్సరానికి చెందిన బకాయిలను త్వరలోనే కాలేజీలకు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విషయాన్ని కమిషన్ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య కూడా చెప్పారు. కానీ 40 రోజులైనా ఫీజులను తేల్చలేదు. ఆ తర్వాత డిసెంబరు 28న కమిషన్ చైర్మన్ ఈశ్వరయ్య మీడియాతో మాట్లాడుతూ.. ఫిబ్రవరి నాటికి ఫీజులు నిర్ణయించి ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని చెప్పారు. ప్రొఫెషనల్ కోర్సుల ఫీజుల నియంత్రణపై కసరత్తు చేస్తున్నామని, ఫిబ్రవరి మధ్య నాటికి కొత్త ఫీజులను ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని తెలిపారు. ఈ నెల 7న సీఎం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మరోసారి ఫీజుల విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మీరు ఫీజులను తేల్చడమే తరువాయి పాత బకాయిలతో పాటు 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించిన పూర్తి ఫీజులు రీయింబర్స్ చేస్తామని స్పష్టం చేశారు. ఫీజులను ఎప్పటికి తేలుస్తారని అడగ్గా.. ఫిబ్రవరి నెలాఖరులో నిర్ణయిస్తామని కమిషన్ చెప్పినట్లు సమాచారం.

### పేరుకుపోతున్న బకాయిలు

ట్యూషన్ ఫీజుల రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయి. ఫీజుల నిర్ణయంపై కమిషన్ దూకుడు ప్రదర్శించడం లేదు. తనిఖీలు, హియరింగ్ పేరుతో ఫీజులను సాగదీస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు ఇంజనీరింగ్ ఫీజులనే నిర్ణయించని కమిషన్, మిగిలిన ప్రొఫెషనల్ కోర్సుల ఫీజులను ఎప్పటికి తేలుస్తుందోనని అంటున్నారు. విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఫీజులను నిర్ణయించి సకాలంలో రీయింబర్స్ చేయకుంటే.. ఇక విద్యా బోధన ఎలా సాగుతుంది.. విద్యాప్రమాణాలు ఎలా మెరుగుపడతాయి.. అని పలువురు విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరే విద్యార్థుల్లో 80% మంది ఫీజు రీయింబర్స్‌మెంట్ పైనే ఆధారపడుతున్నారు. ఈ విషయం సర్కారు గణాంకాల ద్వారానే స్పష్టమవుతోంది. గత ప్రభుత్వం ఇంజనీరింగ్‌కు రూ.35 వేలు ట్యూషన్ ఫీజు రీయింబర్స్ చేయగా.. జగన్ ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్ చేస్తామని ప్రకటించింది. కానీ నిర్దిష్ట కాలంలో ఇవ్వకుండా సాగదీస్తూ తమకు తోచినప్పుడు వాటిని రీయింబర్ చేస్తున్న ఫలితంగా కాలేజీలు సైతం విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఆసక్తి చూపడం లేదు. అదేమంటే అధిక వడ్డీలకు అప్పులు చేసి సిబ్బందికి జీతాలు ఇవలేకపోతున్నామని, మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నామని కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా అటు కమిషన్, ఇటు ప్రభుత్వం ఫీజుల నిర్ధారణ, రీయింబర్స్‌మెంట్‌పై ఆలోచించాల్సిన అవసరం ఉంది.

### కత్తి మహేశ్ కారుపై రాళ్ల దాడి

- ఐదుగురు బజరంగ్‌దళ్ కార్యకర్తల అరెస్ట్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు దెబ్బతినేలా శ్రీరాముడిపై వ్యాఖ్యానించాడంటూ కత్తి మహేశ్ కారుపై బజరంగ్‌దళ్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. మహేశ్ శుక్రవారం విడుదలైన వరల్డ్ ఫేమస్ లవర్ సినిమాను మార్నింగ్ షోను ప్రసాద్ ఐమాక్స్‌లో చూశారు. తిరుగుప్రయాణంలో ఆయన కారుపై నెక్లెస్ రోడ్ చౌరస్తా సమీపంలో కొందరు బజరంగ్‌దళ్ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో కారు అద్దాలు పగిలాయి. అక్కడ విధులు నిర్వహిస్తున్న సైఫాబాద్ పోలీసులు వెంటనే స్పందించి దాడికి పాల్పడిన రాజ్‌కుమార్, వై వెంకట్, జి సాయిరాజ, డి నాగరాజు, ఎస్ దేవలను అరెస్ట్ చేశారు.

# గొట్టిపాటికి 303 కోట్లు!

- గరికపాటికి రూ.286కోట్లు
- శిద్దా క్వారీలపైనా కొరడా
- భారీగా బాదేసిన సర్కారు
- ప్రత్యర్థుల క్వారీలే టార్గెట్
- తెలుగుదేశం నుంచి ఈమధ్యే బీజేపీలోకి ఎంపీ గరికపాటి
- బల్లికురవ, గురిజేపల్లిలోని 22 కంపెనీలకు నోటీసులు
- వైసీపీ నాయకులవీ ఇక్కడే ఉన్నా అటు వెళ్లనేలేదు



గరికపాటి మోహనరావు, గొట్టిపాటి రవికుమార్

ఒంగోలు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అంతా అనుకొన్నట్టే జరిగింది! 'అక్రమ తవ్వకాల' పేరిట తస్మదీయులపై రాష్ట్ర ప్రభుత్వం వేటు వేసింది. ప్రకాశం జిల్లాలో వారు నిర్వహిస్తున్న క్వారీలపై భారీ జరిమానాలను విధించింది. బల్లికురవలో క్వారీ నిర్వహిస్తున్న బీజేపీ ఎంపీ గరికపాటి మోహనరావుకు రూ.286కోట్ల జరిమానా విధిస్తూ నోటీసు జారీచేశారు. టీడీపీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ క్వారీలకయితే ఏకంగా రూ. 303 కోట్లు బాదేశారు. ఇక్కడే ఉన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు చెందిన క్వారీలకూ భారీగా జరిమానాలు వేసినట్టు సమాచారం. అదే సమయంలో అధికారపార్టీకి చెందినవారి క్వారీలు ఇదే ప్రాంతంలో ఉన్నా.. అటు వెళ్లలేదు. లేదంటే నామమాత్రంగా వేటేసి సరిపెట్టారు.

అధికార నేతల టార్గెట్‌లో ఉన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌లనే గురిపెట్టి ఈ నోటీసులు జారీ అవుతున్నాయని ముందునుంచే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దానికి తగినట్టే రెండు రోజులుగా మైనింగ్ అధికారుల అడుగులు పడ్డాయి. శిద్దా రాఘవరావు కంపెనీలు ఉన్న చీమకుర్తి ప్రాంతంపై తొలుత కొరడా ఝుళిపించారు. ఈ ప్రాంతంలోని 35 గెలాక్సీ గ్రానైట్ క్వారీల యజమానులకు రూ. 1200 కోట్ల విలువైన పెనాల్టీలను వేశారు. వారికి గురువారం నోటీసులు జారీ అయ్యాయి. శుక్రవారం గొట్టిపాటి, గరికపాటి మోహనరావు క్వారీలు ఉన్న బల్లికురవ, గురిజేపల్లి ప్రాంతాలకు ఈ నోటీసులు పంపించారు. గరికపాటి ఇటీవలి దాకా తెలుగుదేశం పార్టీలోనే కొనసాగి, ఈ మధ్యే బీజేపీలో చేరారు. ఆయనకు బల్లికురవ వద్ద ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఉంది. చాలా ఏళ్లనుంచి ఈ ఒక్క గ్రానైట్ క్వారీనే నిర్వహిస్తున్నారు. తమ క్వారీకి భారీగా జరిమానా విధిస్తూ నోటీసులు రావడంపై గరికపాటి విస్మయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. గ్రానైట్ రంగంలో ఉన్న ప్రముఖులకు ఫోన్లు చేసి 'ఇంత దారుణమా' అని వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు..

### తనవాడైతే అంతా సరా!

బల్లికురవలో అధికారపార్టీకి చెందిన ఒక నాయకుడికి ఎక్కువ విస్తీర్ణంలో క్వారీ ఉంది. తనిఖీల్లో అక్కడ అనేక లోపాలు ఉన్నట్లు కూడా గుర్తించారు. కానీ, ఆయనకు కేవలం రూ.70కోట్ల జరిమానా మాత్రమే విధించడం గ్రానైట్ వ్యాపారుల్లో చర్చనీయాంశంగా మారింది. అదే ప్రాంతంలో మరో ప్రముఖ రాజకీయ నాయకుడి క్వారీలో అసలు తనిఖీలే నిర్వహించలేదు. ముఖ్యమంత్రి బంధువైన రాష్ట్రస్థాయి నాయకుడి జోక్యంతో ఆ క్వారీ వైపు వెళ్లలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందిన సమాచారం మేరకు.. బల్లికురవ, గురిజేపల్లిలో సుమారు 22 క్వారీలకు నోటీసులు ఇచ్చారు. రెండు రోజుల్లో కలిపి 57 క్వారీలకు ఈ నోటీసులు జారీ అయ్యాయి. ఇన్ని క్వారీలపై తీవ్రస్థాయిలో కన్నెర్ర చేయడంతో గ్రానైట్ వ్యాపారులేకాక, అందులో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రానైట్ క్వారీ యజమానుల సంఘం నాయకుల్లో అందుబాటులో ఉన్నవారంతా ఈ విషయంపై చర్చించుకున్నట్లు తెలిసింది. ఒకటి,రెండు రోజుల్లో అసోసియేషన్ సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం. క్వారీలకు జారీ అయిన నోటీసులను వాటి యజమానులకు అందించే ప్రక్రియ మొదలయిందని గనుల శాఖ ఏడీ జగన్నాథరావు వెల్లడించారు.

## హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ పీసీ రెడ్డి మృతి

- పిన్నవయసులోనే న్యాయమూర్తిగా నియామకం
- మద్రాసు, కర్నూలు, గుంటూరు హైకోర్టుల్లో విధులు



రిటైర్డ్ జస్టిస్ పీసీ రెడ్డి

కడప, ఫిబ్రవరి 14: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, గౌహతి హైకోర్టుల్లో చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన రిటైర్డ్ న్యాయమూర్తి పాలెం చెన్నకేశవరెడ్డి(96), అలియాస్ పీసీ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం, తాటిమాకులపల్లెకు చెందిన చెన్నారెడ్డి, యల్లమ్మ దంపతులకు జన్మించిన చెన్నకేశవరెడ్డి మద్రాసు యూనివర్సిటీలో లా చేశారు. 1953లో గుంటూరు హైకోర్టులో ప్రాక్టీసు చేశారు. క్రిమినల్ కేసుల వాదనలో దిట్టగా పేరొందారు. 1956లో కర్నూలు నుంచి రాజధాని హైదరాబాదుకు మారిన తరువాత అక్కడి హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. 47 ఏళ్ల వయసులోనే 1972లో ఏపీ హైకోర్టు జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. 1984లో హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. 1985లో గౌహతి హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ అయ్యారు. 1986లో అక్కడే ఆయన రిటైర్ అయ్యారు. 2000 సంవత్సరంలో ట్రస్టు ఏర్పాటు చేసి ప్రతి ఏటా 40 మంది పీజీ, ప్రొఫెషనల్ కోర్సు వంటి ఉన్నత విద్యనభ్యసించే పేద విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.50 వేలు ఆర్థిక సాయం చేస్తున్నారు. ఈయనకు శ్రీకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ముగ్గురు కుమారులు, దాక్షాయణి కుమార్తె ఉన్నారు. ఆయన జీవించి ఉండగానే కడప నగరంలోని సీఎస్‌ఐ స్కూలు ఎదురుగా విగ్రహం ఏర్పాటు చేసుకోవడం విశేషం. ఆదివారం హైదరాబాదులోని పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

### అవకతవకలకు పాల్పడితే చర్యలు: నారాయణస్వామి

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మద్యపాన నిషేధం అమల్లో అవకతవకలకు పాల్పడే అధికారులపైనా చర్యలు తప్పవని ఉప ముఖ్యమంత్రి (ఎక్సైజ్) కె.నారాయణస్వామి హెచ్చరించారు. నిషేధంలో అమల్లో భాగంగా తీసుకొచ్చిన కొత్త సవరణ చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయాలని స్పష్టం చేశారు. అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఈఎస్‌లతో శుక్రవారం ఆయన సమీక్షించారు. బెల్టు షాపులను ప్రోత్సహించడం, మద్యాన్ని షాపుల నుంచి బార్లకు తరలించడం లాంటి చర్యలకు పాల్పడిన నరసరావుపేట సీఐ ఎం.భుజంగరావును సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశాలు జారీచేశారు.

### బంధువులే పశువుల్లా..

## ఏడేళ్ల బాలికపై 16 మంది అత్యాచారం

- రెండేళ్ల క్రితం ఘోరం.. అస్వస్థతో బాలిక మృతి

చెన్నై, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం 16 మంది బంధువుల చేతిలో విడతలవారీగా అత్యాచారానికి గురైన ఏడేళ్ల బాలిక చెన్నై శివారులోని పోరూరులో మృతి చెందింది. తమిళనాడులోని విల్లుపురం జిల్లా బ్రహ్మదేశం గ్రామానికి చెందిన బాలిక తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించగా గురువారం రాత్రి తుదిశ్వాస విడిచింది. వివరాలిలా ఉన్నాయి. బ్రహ్మదేశం గ్రామానికి చెందిన వివాహితకు ఇద్దరు కుమార్తెలు. తన ఇద్దరు పిల్లల్ని స్వగ్రామంలోని తన తల్లి ఇంటి వద్ద వదిలి ఆమె పుదుచ్చేరిలోని జౌళి దుకాణంలో పనిచేస్తూ అక్కడే ఉంటోంది. ఈ నేపథ్యంలో అమ్మమ్మ ఇంట్లో ఉంటున్న పెద్ద కుమార్తె (10), రెండో కుమార్తె (7)పై బంధువులే 16 మంది విడతలవారీగా అఘాయిత్యం చేస్తూ వచ్చారు. 2018లో ఇంటికొచ్చిన తల్లికి ఈ విషయం తెలిసి షాక్‌కు గురైంది. దీంతో భయంతో పిల్లల్ని పుదుచ్చేరి తీసుకెళ్లి అక్కడ పాఠశాలలో చేర్పించింది. అయితే పెద్ద కుమార్తె అక్కడి టీచర్లకు తమపై జరిగిన లైంగిక దాడి గురించి వివరించారు. దీంతో వారు చైల్డ్‌లైన్‌కు సమాచారం అందించగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 16 మందిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటినుంచి బంధువుల బెదిరింపులు ఎక్కువ కావడంతో ఆమె.. భర్త, పిల్లలతో సహా పుదుచ్చేరి నుంచి చెన్నై శివారులోని పోరూరు చేరుకున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఏడేళ్ల బాలిక అస్వస్థతకు గురై చనిపోయింది. బాలిక మృతిపై అనుమానంతో పోలీసులు విచారణ జరపగా విషయాలన్నీ వెలుగుచూశాయి.



## గవర్నర్ విశ్వభూషణ్‌కు గౌరవ డాక్టరేట్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు పంజాబ్‌లోని దేశ్ భగత్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శుక్రవారం పంజాబ్‌లోని వర్సిటీలో జరిగిన ఏడో స్నాతకోత్సవంలో వీసీ జోరాసింగ్ ఈ డాక్టరేట్‌ను గవర్నర్‌కు ప్రదానం చేశారు.

## ఉద్దానంపై 17 ఏళ్లుగా ఏం చేశారు?

▸▸ కిడ్నీ సమస్యకు మూలం గుర్తించారా?: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో 17 ఏళ్లుగా కిడ్నీ సమస్యలతో ప్రజలు అల్లాడిపోతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేశాయని హైకోర్టు నిలదీసింది. దీనిపై ఏం చర్యలు తీసుకున్నారో వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత శాఖల కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్దానం ప్రజలు దీర్ఘకాలిక కిడ్నీ సమస్యలతో బాధ పడుతున్నారని, ఇందుకోసం తగిన చర్యలు తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన న్యాయవాది కరుకోల సింహాచలం హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఇప్పటికే హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మరోమారు ధర్మాసనం ముందు విచారణ జరిగింది. దీనిపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేస్తామని కేంద్రప్రభుత్వం తరపున న్యాయవాది పేర్కొన్నారు. దీనిపట్ల ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 17ఏళ్లుగా ఉద్దానం ప్రజలు కిడ్నీ సమస్యలతో అల్లాడిపోతుంటే కేంద్రప్రభుత్వం ఎందుకు ఇంతకాలం పట్టించుకోలేదని నిలదీసింది. రాష్ట్రప్రభుత్వం చేయాల్సింది చేస్తోందని, మరి కేంద్రం ఏం చేస్తోందని ప్రశ్నించింది.

## పేదల ఇళ్ల లేఅవుట్లకు ముఖద్వారాలు



ముఖద్వారం డిజైన్

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల అమల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల ఇంటి స్థలాలను పేదలకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రతి లేఅవుట్ వద్ద ముఖద్వారాలను నిర్మించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది కలెక్టర్లను ఆదేశించారు. స్టేట్ కన్వర్జెన్స్ నిధుల నుంచి రూ.లక్ష, ఉపాధి హామీ నిధుల నుంచి రూ.15 వేలు జోడించి రూ.1.15 లక్షలతో నిర్మించాలని సూచించారు. ముఖద్వారాలపై 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' అని రాయించనున్నారు.

## భద్రతా కమిషన్‌లో విపక్ష నేత: హైకోర్టులో పిల్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్టేట్ సెక్యూరిటీ కమిషన్‌లో ప్రతిపక్ష నేతకు స్థానం కల్పించకపోవడాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాది తాండవ యోగేశ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిని విచారణకు స్వీకరించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీలకు నోటీసులు జారీ చేసింది.

## బాధ్యతలివ్వని అధికారులు.. మహంతు నిరసన

తిరుపతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): హాథీరాంజీ మఠం మహంతుగా అర్జున్‌దాస్‌ను కొనసాగించాలన్న హైకోర్టు ఉత్తర్వులను దేవదాయశాఖ అధికారులు పట్టించుకోలేదు. మఠానికి వచ్చిన ఆయనకు బాధ్యతలు అప్పగించలేదు. దీంతో సీజ్ చేసిన తన చాంబరు ముందు కూర్చుని మహంతు నిరసన తెలిపారు.

## ఆర్టీసీలో పాతపెన్షన్ విధానం: పేర్ని

విజయవాడ(బస్‌స్టేషన్), ఫిబ్రవరి 14: ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని, ఉద్యోగు, కార్మికుల సమస్యల సత్వర పరిష్కారానికి త్వరలో గ్రీవెన్స్ డే ఏర్పాటు చేస్తామని రవాణా శాఖ మంత్రి పేర్ని నాని తెలిపారు. శుక్రవారం విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో ఇంధన పొదుపు, రోడ్డు భద్రతా అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నాని మాట్లాడుతూ..చిన్నపాటి కారణాల వల్ల ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోడానికి కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కాగా, పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని మంత్రి ప్రకటించటంపై నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వై.శ్రీనివాసరావులు హర్షం వ్యక్తం చేశారు.

## కృష్ణాలో ఇసుక తవ్వకాలపై విచారణ

▸▸ ప్రభుత్వ నివేదికలపై ఎన్జీటీ అసంతృప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో చట్టవిరుద్ధంగా సాగుతున్న ఇసుక తవ్వకాలతోపాటు నది పూడికతీత ప్రక్రియలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్(ఎన్జీటీ) అసంతృప్తి వ్యక్తం చేసింది. అమరావతి రాజధాని కావడంవల్ల ఆ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న కృష్ణా నదిలో అక్రమతవ్వకాలు జరగడం, మరోపక్క ప్రభుత్వం పూడికతీత ప్రక్రియ చేపట్టకపోవడంతో పర్యావరణానికి ప్రమాదకరమని జస్టిస్ ఆదర్శ్ కుమార్‌గోయెల్ నేతృత్వంలోని నలుగురు సభ్యులతో కూడిన ఎన్జీటీ ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై ప్రభుత్వం ఇచ్చిన నివేదికల పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది.

## అన్ని పంటలకూ మద్దతు ధరలు: కన్నబాబు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): "పంట ఉత్పత్తి వ్యయానికి, కేంద్రం ప్రకటించే మద్దతు ధరకు 50%పైగా వ్యత్యాసం ఉంటోంది. దీనివల్ల రైతులు నష్టపోతున్నారు. వాస్తవ సాగు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని మద్దతు ధరలు సిఫారసు చేయాలి. ఉత్పత్తి వ్యయానికి 50% కలిపి మద్దతు ధర ప్రకటించాలి" అని వ్యవసాయ మంత్రి కురసాల కన్నబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజయవాడలో 2020-21 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలపై సూచనలు, సలహాల స్వీకరణకు సీఏసీపీ (కేంద్ర వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణాయక సంఘం) చైర్మన్ విజయ్‌పాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. మద్దతు ధరలను చిత్తశుద్ధితో అమలు చేసే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయఅధికారులు, రైతుసంఘాలనేతలు ఈ భేటీలో చైర్మన్‌ను కోరారు.

## రాష్ట్రంపై కరోనా ప్రభావం లేదు: జవహర్‌రెడ్డి

రాష్ట్రంలో ఇప్పటివరకూ ఒక్క కరోనా (కొవిడ్ 19) కేసు కూడా నమోదు కాలేదని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి చెప్పారు. కొవిడ్-19 బాధిత దేశాల నుంచి రాష్ట్రానికి ఇప్పటి వరకూ 130 మంది ప్రయాణికులు వచ్చారని, వారిలో 125 మంది తమ ఇళ్లల్లోనే వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని చెప్పారు. మరో ఐదుగురికి 28 రోజుల పర్యవేక్షణ పూర్తయిందన్నారు.

## పంచాయతీ సెక్రటరీలకు వేతనాలివ్వండి

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ఒకరి కంటే ఎక్కువ మంది పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్న చోట గౌరవవేతనం విడుదల చేయడం వీలు కావడం లేదని ట్రెజరీలు కొర్రీ వేయడంతో.. ఆ సమస్య పరిష్కారానికి వివరణ ఇస్తూ పంచాయతీరాజ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వారందరికీ గౌరవవేతనం అందించాలని సూచించింది.

## ఆర్టీసీలో విజిలెన్స్ కన్సల్టెంట్‌గా రిటైర్డ్ ఐజీ

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీలో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీస్ కోసం రిటైర్డ్ ఐజీ వీవీ గోపాలకృష్ణను కన్సల్టెంట్‌గా నియమిస్తూ ఆర్టీసీ ఈడీ ఆదేశాలిచ్చారు. నెలకు రూ.లక్ష చొప్పున గౌరవవేతనం ఇవ్వనున్నారు.

# ఐటీ.. రాజకీయ వేడి

▸▸ వైసీపీ మాఫియావి పచ్చి అబద్ధాలు

▸▸ తెలుగుదేశం పార్టీ ఫైర్





అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఇన్‌ఫ్రా కంపెనీలపై ఐటీ దాడులు జరిగితే వాటిని తమ అధినేత చంద్రబాబుకు వైసీపీ ముడిపెట్టడంపై టీడీపీ మండిపడింది. సీఎం జగన్ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే వైసీపీ టీడీపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని విమర్శించింది. 'ఈ దాడుల్లో ఆ కంపెనీలకు సంబంధించి రూ.2 వేల కోట్ల మేర అవకతవకలు కనుగొన్నామని ఐటీ శాఖ తెలిపింది. దానిని వక్రీకరించి ఈ డబ్బంతా చంద్రబాబు మాజీ పీఎస్ శ్రీనివాస్ ఇంట్లోనే దొరికినట్లుగా వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. శ్రీనివాస్ 9 నెలల క్రితమే ఆయన వద్ద నుంచి రిలీవై వెళ్లిపోయారు. జగన్ అవినీతి కేసుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ ప్రచార తాపత్రయం' అని శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఐటీ దాడులు జరిగిన ఇన్‌ఫ్రా కంపెనీల్లో ఒకదానికి ఇటీవలే జగన్ ప్రభుత్వం పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు పనులను రివర్స్ టెండర్ల పేరుతో కట్టబెట్టిందని, ఆ పార్టీ వారికి సన్నిహితమైన కంపెనీపై ఐటీ దాడులు జరిగితే అది టీడీపీకి ఎలా పూస్తారని ప్రశ్నించింది. 'రెండు రోజుల క్రితమే తెలంగాణ హైకోర్టులో సీబీఐ అఫిడవిట్ దాఖలు చేసింది. సీఎంగా ఉన్నా జగన్ కోర్టు విచారణకు హాజరు కావలసిందేనని.. ఆయనకు మినహాయింపు ఇవ్వరాదని పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో షెల్ కంపెనీల ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడి జగన్ రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చారు. అంతర్జాతీయ న్యాయస్థానం ముందు జగన్ కంపెనీలపై ఒక కేసు కూడా దాఖలైంది. రూ.43 వేల కోట్ల అక్రమార్జనకు సంబంధించి 11 కేసుల్లో మొదటి ముద్దాయిగా ఉన్న వ్యక్తి.. చంద్రబాబుపై బురదజల్లడానికి పూనుకోవడం అత్యంత ఆశ్చర్యకరం. చంద్రబాబు కుటుంబం ఏటా తమ ఆస్తుల వివరాలను బహిరంగంగా ప్రకటిస్తోంది. జగన్ కుటుంబం ఇంతవరకూ ఆ పని చేయలేకపోయింది. దీనిపై జగన్‌ను ప్రశ్నించలేని వైసీపీ నేతలు చంద్రబాబుపై విమర్శలకు దిగడం విడ్డూరం' అని వ్యాఖ్యానించింది. జగన్ మాఫియా విష ప్రచారాన్ని పట్టించుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

### ఆ కంపెనీలన్నీ వైసీపీవే: యనమల

తమ దాడుల్లో రూ.2 వేల కోట్ల మేర పన్ను ఎగవేశారన్న సమాచారం లభ్యమైందని ఐటీ శాఖ చెబుతున్న కంపెనీలన్నీ వైసీపీవేనని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఓ ప్రకటనలో ఆరోపించారు. షెల్ కంపెనీల ద్వారా మనీలాండరింగ్‌లో వైసీపీకి చెందిన కంపెనీలకు విపరీతమైన ప్రావీణ్యం ఉందని, అందుకే అవి ఆ పార్టీవేనని నిస్సందేహంగా చెప్పవచ్చని తెలిపారు. కాగా, ఆదాయపన్ను శాఖ దాడుల్లో తన కుమారుని పేరు చేర్చి తప్పుడు కథనాలు ప్రచురించిన జగన్ సొంత ఛానల్, పత్రికపై పరువు నష్టం దావా వేయబోతున్నట్టు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రకటించారు. జగన్‌కు త్వరలోనే శిక్ష పడడం ఖాయమని తెలుగు మహిళ అధ్యక్షురాలు అనిత అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుటుంబంపై జగన్ మీడియా, మాఫియా దుష్ప్రచారం చేస్తున్నాయి అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావు శ్రీకాకుళంలో అన్నారు.

### ట్విటర్ వేదికగా...

**వైసీపీది కట్టుకథ: అచ్చెన్న**

'జగన్‌లా అందరూ అవినీతిపరులేనని ముద్ర వెయ్యడానికి వైసీపీ నేతలు కష్టపడుతున్నారు. దేశంలోని 40ప్రాంతాల్లో జరిగిన ఐటీ దాడుల్లో రూ.85 లక్షలు దొరికాయని ఐటీ అంటుంటే.. చంద్రబాబు మాజీ పీఎస్ దగ్గర రూ.2 వేల కోట్లు దొరికాయని వైసీపీ కట్టుకథ అల్లింది. గతంలో వైఎస్ కూడా అవినీతి మరక అంటించాలని ప్రయత్నించి, కోర్టు చీవాట్లు పెట్టే పరిస్థితి తెచ్చుకున్నారు. ఇప్పుడు వైసీపీ ఉస్కో బ్యాచ్ తయారైంది'

**మీ మరక అంటిస్తారా: జవహర్**

'దేశంలోనే అవినీతి చరిత్రలో నంబర్‌వన్ స్థానంలో ఉండి, ఇతరులపై అవినీతి మరక అంటించడానికి సిగ్గుగా లేదా జగన్‌రెడ్డీ! మీ మీదున్న అవినీతి అరోపణలపై ఒక్క రోజైనా స్పందించారా? ప్రజలకు సమాధానం చెప్పారా? 16నెలలు చిప్పకూడు తిన్న వ్యక్తి నీతులు బోధించడం వింతగా ఉంది'

**నవ్వొస్తోంది: బుద్దా వెంకన్న**

'దో నంబర్ దందాతో నడిపే బ్లాక్ పేపర్, చానల్‌లో ఐటీ దాడులకు సంబంధించిన వార్తలు చూస్తుంటే నవ్వొస్తోంది. రాష్ట్రంలో ఉన్న విద్యార్థులంతా చంద్రబాబు హయాంలోనే ఆంగ్లం నేర్చుకోవడం మొదలుపెట్టారు. ఇక అది నేర్చుకోవలసింది జగన్'

**వైసీపీకే చెల్లింది: వర్ల**

'దున్నపోతు ఈనిందంటే గాట కట్టేయమన్నట్లు ఉంది మన మంత్రులు, ఎమ్మెల్యేల మానసిక స్థితి. డబ్బంతా చంద్రబాబు పీఎస్ దగ్గర దొరికిందని అభాండాలు వేయడం మీ పార్టీకే చెల్లింది సీఎంగారూ..!'

**ఆమంచిదే పేటెంట్: పంచుమర్తి**

'బ్రోకరిజానికి పేటెంట్ హక్కు ఆమంచి కృష్ణ మోహన్‌కే ఉంది. జగన్‌ను మెప్పించి పదవి తెచ్చుకోవాలని ఆరోపణలు చేస్తున్నారు. జర్నలిస్టులపై దాడి చేసే మీరు జర్నలిజం గురించి మాట్లాడడం హాస్యాస్పదం.'

## పచ్చకామెర్ల సామెతలా జగన్ తీరు: లోకేశ్



అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు సీఎం జగన్‌కు లోకమంతా అవినీతి కనిపించడంలో పెద్దగా ఆశ్చర్యం ఏమీలేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. ఐటీ దాడుల్లో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు... ఆ శాఖ ఇచ్చిన పత్రికా ప్రకటనతోనే అర్థమైందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో 40చోట్ల సోదాలు నిర్వహిస్తే రూ.85 లక్షలు దొరికాయని ఐటీ శాఖ అంటుంటే... చంద్రబాబు మాజీ పీఎస్ ఇంట్లో రూ.2వేల కోట్లు దొరికాయి అని వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ శునకానందం పొందుతున్నారన్నారు. రావాలి జగన్, కావాలి జగన్ అని జైలు పిలుస్తుంది అన్న భయం జగన్‌ను వెంటాడుతోందని, అందుకే ఇన్‌ఫ్రా కంపెనీలపై జరిగిన ఐటీ దాడులను టీడీపీకి ముడిపెట్టాలని తాపత్రయపడుతున్నారని విమర్శించారు. 16 నెలలు జైల్లో ఉన్న వ్యక్తి అంతా తమలా జైలుకు వెళ్లాలని కోరుకోవడం సహజమే.. కానీ మాకు మాత్రం అలాంటి కోరికలు లేవని లోకేశ్ ట్వీట్ చేశారు. చంద్రబాబు హయాంలో ఒక్క ఉద్యోగం కూడా రాలేదంటూ అసత్యాల యాత్ర చేసిన జగన్ చంద్రబాబు హయాంలో యువతకు 9,56,263 ఉద్యోగాలు వచ్చాయని అసెంబ్లీలో ఒప్పుకొన్నారని అన్నారు.







## బాబు బండారం బయటపడింది

▸▸ ఆయన మాజీ పీఎస్ వద్దే 2 వేల కోట్లు దొరికాయి

▸▸ బాబు, లోకేశ్‌పై దాడిచేస్తే 2 లక్షల కోట్లు బయటపడతాయేమో!

▸▸ మంత్రులు ఫైర్.. బాబు త్వరలో జైలుకు: ఉమ్మారెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

గత నాలుగైదు రోజులుగా జరుగుతున్న ఆదాయ పన్ను(ఐటీ) శాఖ అధికారుల దాడులపై మాజీ సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ స్పందించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ దాడులతో చంద్రబాబు అవినీతి బండారం బయటపడిందని శుక్రవారం విశాఖలో మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు మాజీ పీఎస్ శ్రీనివాస్ వద్దే రూ.2వేల కోట్లు దొరికితే.. చంద్రబాబు, లోకేశ్‌పై దాడులు జరిగితే రూ.2లక్షల కోట్లు బయటపడతాయేమోనన్నారు. రూ.2వేల కోట్లను విదేశాలకు తరలించి, అక్కడి నుంచి వేరే దారుల ద్వారా తిరిగి రాష్ట్రానికి మళ్లించారని ఐటీ అధికారులు నిర్ధారించారని తెలిపారు. పరోక్షంగా చంద్రబాబు పేరును ఐటీ శాఖ ప్రకటించిందని బొత్స చెప్పుకొచ్చారు. మూడు డొల్ల కంపెనీలకు డబ్బు తరలించినట్లు ఐటీ అధికారులు గుర్తించారని, అందులో ఆర్కే ఇన్‌ఫ్రాకు కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మరొకదానికి మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు కుమారుడు ప్రమోటర్లుగా తేలిందని, మిగిలిన డొల్ల కంపెనీలెవరివో త్వరలోనే తెలుస్తుందన్నారు. టీడీపీ హయాంలో ఎంత అవినీతి జరిగిందో ప్రజలకు ఇప్పుడు అర్థమైందన్నారు. మరో మంత్రి పేర్ని నాని మచిలీపట్నంలో మాట్లాడుతూ... నూరుగొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు కొట్టుకుపోతుందన్న సామెత గుర్తుకు వస్తోందని, చంద్రబాబుకు అదే గతి పడుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు పన్నులు కట్టిన ప్రజాధనాన్ని చంద్రబాబు కైంకర్యం చేశారన్నారు. మంత్రి కన్నబాబు విజయవాడలో మాట్లాడుతూ... రోజూ మీడియాతో మాట్లాడే చంద్రబాబు ఐటీ దాడులపై ఎందుకు మౌనం దాల్చారని ప్రశ్నించారు.పీఎస్ ఇంట్లో దాడులు చేస్తేనే రూ.2వేల కోట్లు తేలాయని, చంద్రబాబు, లోకేశ్‌లపై దాడులు జరిపితే ఎన్ని లక్షల కోట్లు తేలతాయోనన్నారు. ప్రజలపై పడిన రూ.3 లక్షల కోట్ల అప్పుల భారంలో అధిక సొమ్ము చంద్రబాబు జేబులోకి వెళ్లిందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. బాబు దోపిడీ లక్ష కోట్లకు చేరిందనడంలో ఏ మాత్రమూ ఆశ్చర్యం లేదన్నారు. ఇది చిన్న తీగ మాత్రమేనని, పూర్తి విచారణ జరిగితే చంద్రబాబు బండారం బయటపడుతుందని సజ్జల వ్యాఖ్యానించారు. తాజా ఐటీ దాడులపై చంద్రబాబు, లోకేశ్ స్పందించాలని వైసీపీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. స్పందించకపోతే మౌనం అర్ధాంగీకారంగా భావిస్తామన్నారు. చంద్రబాబు త్వరలోనే జైలుకు వెళ్తారని వ్యాఖ్యానించారు.

## ప్రతిపాదన వస్తే పరిశీలిస్తాం

▸▸ ఎన్డీఏలో చేరికపై మంత్రి బొత్స

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని పాలక ఎన్డీఏలో చేరాలని ప్రతిపాదన వస్తే పరిశీలిస్తామని పురపాలక మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఎన్డీఏలో చేరేందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని.. అందుకే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసేందుకు ఆయన ఢిల్లీ వెళ్లారన్న వార్తలను శుక్రవారమిక్కడ విలేకరులు ప్రస్తావించారు. బొత్స స్పందిస్తూ.. 'మేం బీజేపీకి దగ్గరగా లేము.. అలాగని దూరంగానూ లేం. రాష్ట్ర ప్రయోజనాలకు ఏది మేలు చేస్తుందంటే అది చేయడానికి మా అధినేత జగన్ సిద్ధంగా ఉంటారు' అని చెప్పారు. చిరంజీవికి వైసీపీ తరపున రాజ్యసభ సభ్యత్వం ఇవ్వనున్నారా అని అడగగా.. సూటిగా బదులివ్వలేదు.

## అమిత్‌షాను కలవాల్సి ఉంది

▸▸ వ్యక్తిగత హాజరు మినహాయించండి

▸▸ సీబీఐ కోర్టుకు సీఎం జగన్ వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి కీలక సమావేశాల్లో పాల్గొనాల్సి ఉందని, అలాగే రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలపై ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలవాల్సి ఉందని, ఈ నేపథ్యంలో వ్యక్తిగత హాజరు నుంచి ఆంధ్ర సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మినహాయింపు ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి సీబీఐ ప్రత్యేక కోర్టును అభ్యర్థించారు. స్పందించిన న్యాయమూర్తి.. ఈ రోజుకు మినహాయింపు ఇస్తూ తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాంకీ అయోధ్యరామిరెడ్డి, ఐఏఎస్ వై.శ్రీలక్ష్మి విచారణకు హాజరయ్యారు.

## మండలిని రద్దు చేసేయండి!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన శుక్రవారం రాత్రి 9.45 గంటలకు షాను కలిశారు. సుమారు అరగంటసేపు చర్చలు జరిగాయి. బుధవారం ప్రధాని మోదీకి అందజేసిన వినతిపత్రంలోని అంశాలనే షాకు కూడా సమర్పించారు. ఈ సందర్భంగా మూడు రాజధానుల ఏర్పాటు నిర్ణయంపై సీఎం వివరణ ఇచ్చారు. కర్నూలుకు హైకోర్టు తరలింపు, దిశ చట్టం, పోలవరం ప్రాజెక్టు, రెవెన్యూ లోటు నిధుల భర్తీ తదితర అంశాలను ప్రస్తావించారు. రాజధాని కార్యకలాపాల వికేంద్రీకరణతోపాటు పరిపాలనను, అభివృద్ధిని కూడా వికేంద్రీకరించాలన్న దృష్టితో మూడు ప్రాంతాల్లో రాజధానులు ఏర్పాటుచేయాలనుకున్నామని జగన్ తెలిపారు. 'కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూలు, శాసన రాజధానిగా అమరావతిని నిర్ణయించాం. ఈ ప్రతిపాదనను రాష్ట్ర కేబినెట్, అసెంబ్లీ ఆమోదించాయి. కర్నూలుకు హైకోర్టును తరలించేందుకు కేంద్ర న్యాయశాఖకు తగిన ఆదేశాలివ్వండి. రాయలసీమలో శాశ్వత ప్రాతిపదికన హైకోర్టు ఏర్పాటు చేస్తామని బీజేపీ కూడా 2019 మేనిఫెస్టోలోనే పేర్కొంది' అని ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

### పోలవరానికి నిధులివ్వాలి

పోలవరం ప్రాజెక్టులో రివర్స్ టెండరింగ్ ద్వారా ఇప్పటివరకు రూ.838 కోట్లను ఆదా చేశామని, 2021 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని షాకు ముఖ్యమంత్రి తెలిపారు. 'ముంపు ప్రాంతాల్లో సహాయ పునరావాస చర్యలను వెంటనే చేపట్టవలసి ఉంది. ప్రాజెక్టు సవరించిన అంచనాలను కేంద్ర జలవనరుల శాఖ సాంకేతిక కమిటీ 2019 ఫిబ్రవరిలో రూ.55,549 కోట్లకు ఆమోదించింది. దీనికి సంబంధించి పరిపాలనాపరమైన అనుమతి ఇచ్చేలా మీరు చూడాలి. ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చులో రూ.3,320 కోట్లు వెంటనే ఇప్పించండి' అని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ప్రాయోజితన పథకాల రూపేణా, గ్రాంట్ల రూపేణా రాష్ట్రానికి రూ.10,610 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, గత ఏడాది విడుదల చేసిన రూ.22 వేల కోట్లలో ఇది సగం మాత్రమేనని తెలిపారు. వెనుకబడిన జిల్లాలకు సంబంధించి గత మూడేళ్లుగా బకాయి ఉన్న నిధులనూ విడుదల చేయాలని కోరారు. అంతేగాక ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్యాకేజీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజధాని నిర్మాణానికి రూ.2,500కోట్లు కేటాయిస్తే, ఇప్పటివరకు రూ.1,000 కోట్లు మాత్రమే ఇచ్చారని, మిగిలిన డబ్బులు కూడా విడుదల చేయాలని కోరారు.

### ప్రత్యేక హోదా మంజూరు చేయండి

ప్రత్యేక హోదా ఇవ్వడానికి ఆర్థిక సంఘం సిఫారసులతో సంబంధం లేదని, ప్రత్యేక హోదా అన్నది కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదని 15వ ఆర్థిక సంఘం స్పష్టం చేసిన అంశాన్ని ముఖ్యమంత్రి హోంమంత్రి దృష్టికి తెచ్చారు. దీన్ని పరిగణనలోకి తీసుకుని రాష్ట్రానికి ప్రత్యేక హోదా మంజూరు చేయాలని కోరారు.

### దిశ చట్టానికి ఆమోదం తెలపండి

మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడిన వారిపై విచారణను వేగంగా పూర్తిచేసి, శిక్షలు విధించేందుకు దిశ చట్టాన్ని రూపొందించామని.. దానిని ఆమోదించాలని షాను జగన్ కోరారు. రాష్ట్రంలో సాగునీటి వసతిని మెరుగుపరచడానికి గోదావరి నీటిని నాగార్జున సాగర్, శ్రీశైలంలకు తరలించే ప్రాజెక్టుకు తగిన ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కడప స్టీల్ ప్లాంటు, రామాయపట్నంఓడరేవు, విశాఖపట్నం-చెన్నై కారిడార్, కాకినాడలో పెట్రోలియం కాంప్లెక్స్ కోసం తగిన ఆర్థిక సహాయం చేయాలని అడిగారు.

### నేడు పలువురు కేంద్రమంత్రులతో భేటీ..

జగన్ శుక్రవారం రాత్రి ఢిల్లీలోనే బస చేశారు. శనివారం కేంద్ర ఆర్థిక, న్యాయ, జలశక్తి మంత్రులు నిర్మలా సీతారామన్, రవిశంకర్ ప్రసాద్, గజేంద్ర సింగ్ షెకావత్‌లను కలుస్తారు. నిధులు, హైకోర్టు తరలింపు, పోలవరానికి సాయంపై చర్చిస్తారని తెలుస్తోంది.

### సీఎంతో వైసీపీ ఎంపీల భేటీ

అమిత్‌షాతో భేటీకి వెళ్లేముందు జగన్‌తో వైసీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, వల్లభనేని బాలశౌరి, నందిగం సురేష్, అవినాశ్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ భేటీలో సీఎం ప్రత్యేక కార్యదర్శి ధనుంజయరెడ్డి, ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, ఆంధ్ర భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అభయ్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీకి జీతమిస్తాం

▸▸ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది

▸▸ క్యాట్ ముందు న్యాయవాది వెల్లడి

▸▸ 8 నెలలుగా వేతనం, పోస్టింగ్ లేవు

▸▸ రాత్రికి రాత్రే ఏకపక్షంగా సస్పెన్షన్

▸▸ కేంద్రానికీ సమాచారమివ్వలేదు

▸▸ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వండి

▸▸ ఏబీ వినతి.. ట్రైబ్యునల్ నిరాకరణ

▸▸ తదుపరి విచారణ 24కి వాయిదా



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి, ఇటీవల సస్పెండైన నిఘా విభాగం మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావుకు జీతమివ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆంధ్ర ప్రభుత్వం కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)కు తెలియజేసింది. అఖిల భారత సర్వీసు ఉద్యోగుల నిబంధనలకు విరుద్ధంగా, నిరాధారమైన ఆరోపణలతో రాత్రికి రాత్రే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనను సస్పెండ్ చేసిందని వెంకటేశ్వరరావు క్యాట్‌లో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. దీనిపై క్యాట్ సభ్యుడు (పరిపాలన) బీవీ సుధాకర్ శుక్రవారం విచారణ జరిపారు. ఏబీవీ తరఫున సీనియర్ న్యాయవాది విద్యాసాగర్‌రావు వాదించారు. గత ఏడాది మే 31న ఏసీబీ డీజీగా ఉన్న వెంకటేశ్వరరావును ఆ పోస్టు నుంచి తప్పించి సాధారణ పరిపాలనా విభాగం (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఆదేశించారని.. అప్పటి నుంచి జీతం, పోస్టింగ్ ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారని తెలిపారు. 'దాదాపు 8 నెలలుగా ఏ పోస్టులో లేని ఆయనపై.. నిఘా పరికరాల కొనుగోలులో అవకతవకలను సాకుగా చూపి సస్పెండ్ చేశారు. అఖిల భారత సర్వీసుల్లో ఉన్న అధికారులను సస్పెండ్ చేసే ముందు సెక్షన్ 3 కింద కేంద్ర ప్రభుత్వానికి సమాచారమివ్వాలి. కేంద్రం సంతృప్తి చెందితేనే వారిని సస్పెండ్ చేయాల్సి ఉంటుంది. కేంద్రానికి సమాచారం ఇవ్వకుండా, వెంకటేశ్వరరావు వివరణ కూడా తీసుకోకుండా దురుద్దేశపూర్వకంగా ఆయన్ను సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేసి...వెంటనే జీతం చెల్లించేలా ఆదేశించాలి' అని కోరారు. ఆయనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన విచారణ ప్రాథమిక దశలో ఉందని, ఈ దశలో సస్పెన్షన్‌ను రద్దుచేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వరాదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. వెంకటేశ్వరరావుకు జీతం ఎందుకు ఇవ్వలేదని న్యాయమూర్తి ప్రశ్నించగా.. జీతమివ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. సస్పెన్షన్ విషయాన్ని కేంద్రానికి తెలియజేశారా అని అడుగగా.. ఇటీవల సెక్షన్ 3కి వచ్చిన సవరణ మేరకు కేంద్రానికి సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదని బదులిచ్చారు. అన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని, అందుకు గడువు ఇవ్వాలని కోరారు. సస్పెన్షన్‌పై ముందుగా ప్రభుత్వానికి అప్పీల్ చేసుకోవాలని, నేరుగా క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదని తెలిపారు. సస్పెన్షన్‌పై స్టే ఇవ్వడానికి ట్రైబ్యునల్ నిరాకరించింది. ఈ పిటిషన్‌ను తానొక్కడినే వినాలా లేదా చైర్మన్ నేతృత్వంలోని ధర్మాసనం వినాలా అన్నది నిర్ణయిస్తామని న్యాయమూర్తి పేర్కొంటూ తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేశారు. ఆ రోజున ఈ కేసులో పూర్తిస్థాయిలో వాదనలు వింటామని.. అంతకు రెండు, మూడు రోజుల ముందే కౌంటర్ దాఖలు చేయాలని ప్రకాశ్‌రెడ్డికి సూచించారు.

## హద్దుమీరే పోలీసులపై చర్యలు

▸▸ రూల్స్ అతిక్రమిస్తే ఉపేక్షించొద్దు.. సీఆర్‌పీసీపై వారికి అవగాహన

▸▸ హెబియస్ కార్పస్ దాఖలునకు ముందే కదిలేలా శిక్షణ ఇవ్వండి

▸▸ డీజీపీకి రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు.. విచారణకు హాజరయిన సవాంగ్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించి వ్యవహరించే పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని, అలాంటి వారిని ఉపేక్షించవద్దని హైకోర్టు డీజీపీని ఆదేశించింది. సీఆర్‌పీసీపై వారికి అవగాహన కల్పించడంతోపాటు తగిన శిక్షణ ఇవ్వాలని సూచించింది. సెర్చ్‌వారంట్ లేకుండా ఇళ్లలోకి జొరబడవద్దని, అరెస్టు వారంట్ లేకుండా ఎవ్వరినీ అరెస్టు చేయవద్దని ఆదేశించింది. చట్టప్రకారమే నడుచుకోవాలి తప్ప, ఎట్టిపరిస్థితుల్లోనూ అతిక్రమించరాదని స్పష్టం చేసింది. తమ ఆదేశాలను డీజీపీ తప్పకుండా అమలు చేస్తారనే ఆశిస్తున్నామని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాకేశ్‌కుమార్, జస్టిస్ డి. రమేశ్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తన కుమారుడు, కోడల్ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారంటూ విశాఖకు చెందిన వ్యక్తి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. పోలీసుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. డీజీపీ హాజరై వివరణ ఇవ్వాలని గత బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం డీజీపీ గౌతం సవాంగ్ స్వయంగా ధర్మాసనం ముందు హాజరై వివరణ ఇచ్చారు. అరెస్టులకు సంబంధించి 1987లో సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని, పోలీసులు మాత్రం వాటిని సక్రమంగా పాటించడం లేదని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. మనుషులు కనిపించకుండాపోయిన కేసుల వ్యవహారంలో ఉదాసీనత కనబరచరాదని సూచించింది. కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలయ్యాకే పోలీసులు తగిన చర్యలకు ఉపక్రమిస్తున్నారని, ఇది సరికాదని పేర్కొంది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరాంను ఆదేశిస్తూ, తదుపరి విచారణను 25వ తేదీకి వాయిదా వేసింది. ఈ విచారణకు డీజీపీ హాజరును మినహాయించింది. డీజీపీతోపాటు విశాఖ పోలీసు కమిషనర్ ఆర్‌కే మీనా, గుంటూరు ఐజీ వినీత్‌కుమార్ బ్రిజ్‌లాల్ కూడా విచారణ కోసం కోర్టుకు వచ్చారు.



## మంధాన @ 4

**దుబాయ్:** భారత మహిళల స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి చేరుకుంది. శుక్రవారం ఐసీసీ వెల్లడించిన మహిళా క్రికెటర్ల జాబితాలో ఆమె మూడు స్థానాలను మెరుగుపర్చుకుంది. అయితే జెమీమా రోడ్రిగ్స్ ఏడో స్థానానికి పడిపోయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ 9వ స్థానంలో మార్పు లేదు. న్యూజిలాండ్ క్రికెటర్ సుజీ బేట్స్ నెంబర్‌వన్ స్థానాన్ని కాపాడుకోగా, ఆ జట్టు కెప్టెన్ సోఫీ డివైన్ నాలుగు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకుకు చేరింది. బౌలర్లలో భారత్ నుంచి పూనమ్ యాదవ్ ఆరు ర్యాంకులు కోల్పోయి 12కు చేరింది. ఎలిస్ పెర్రీ (7) నాలుగు స్థానాలు ఎగబాకి టాప్-10లో చోటు దక్కించుకుంది.





# బోల్ట్ కంటే మిన్నగా..!

**'కంబళ' పోటీల్లో రికార్డు వేగంతో పరుగు**

**బెంగళూరు:** జమైకన్ చిరుత ఉసేన్ బోల్ట్‌ను ప్రపంచంలోనే అత్యంత వేగంగా పరిగెత్తిన రన్నర్‌గా అంతా గుర్తు పెట్టుకుంటారు. 100మీ. రేసును అతడు కేవలం 9.58 సెకన్లలోనే పూర్తి చేసిన ఒకేఒక్కడుగా నిలిచాడు. అయితే అతడిని మించిన వేగంతో ఓ అనామకుడు భారత్‌లో రాత్రికి రాత్రే సూపర్‌స్టారయ్యాడు. 'దక్షిణకన్నడ' జిల్లాలోని మూడబిద్రికి చెందిన శ్రీనివాస గౌడ ఇక్కడి సంప్రదాయక 'కంబళ' పోటీల్లో 142.5 మీటర్ల దూరాన్ని కేవలం 13.62 సెకన్లలోనే అధిగమించాడు. అయితే ఇదంతా మామూలు ట్రాక్‌పై కాకుండా బురద నీళ్లలో.. రెండు దున్నలను కట్టేసి ఉంచిన తాడును పట్టుకుని ఈ పరుగు తీయడం విశేషం. అయితే గౌడ వేగాన్ని 100మీ.ల దూరానికి లెక్కేస్తే అది 9.55 సెకన్లుగా తేలింది. దీంతో అతడు బోల్ట్‌కంటే కూడా .03 సెకన్లు ముందుగానే పరిగెత్తినట్టయింది. కానీ ఈ రికార్డును నేరుగా బోల్ట్‌తో పోల్చలేమని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే శ్రీనివాస గౌడ వేగం అతడి ఎద్దుల నుంచి ఉత్పత్తి అయ్యిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలంటున్నారు. కర్ణాటకలోని మంగళూరు, ఉడుపిలో ఈ పరుగు పందేలను ఏటా నిర్వహిస్తుంటారు. ఎవరైతే వాటిని వేగంగా పరిగెత్తించి లక్ష్యాన్ని చేరుకుంటారో వారే విజేతలుగా నిలుస్తారు. అయితే బోల్ట్‌తో పోలిక ఎలా ఉన్నా ఈక్రమంలో తను కంబళ పోటీల్లో 30 ఏళ్ల రికార్డును బద్దలు కొడుతూ అత్యంత వేగంగా పరిగెత్తిన వ్యక్తిగా కూడా నిలిచాడు. ఓ జర్నలిస్ట్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఇతడి ఫీట్ గురించి అందరికీ తెలిసింది.



## సెమీస్‌కు బోపన్న జోడీ

**రోటర్‌డామ్:** రోహన్ బోపన్న జోడీ.. వరల్డ్ టెన్నిస్ టోర్నీ సెమీస్‌కు చేరుకొంది. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో బోపన్న-డెన్నిస్ షపలోవ్ ద్వయం 6-2, 3-6, 10-7తో జూలియన్ రోజర్-హోరియా టెకావుపై నెగ్గింది. టైబ్రేక్ హోరాహోరీగా సాగినా.. బోపన్న జంట ఒత్తిడిని జయించి మ్యాచ్‌ను కైవసం చేసుకొంది.



## పావనికి ఆరు పతకాలు

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ఆసియన్ యూత్ అండ్ జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్ కేవీఎల్ పావనీ కుమారి ఆరు పతకాలు సాధించి సత్తాచాటింది. ఉజ్బెకిస్థాన్‌లోని తాష్కెంట్‌లో శుక్రవారం జరిగిన బాలికల 45 కిలోల యూత్ విభాగంలో పావని స్నాచ్ (66)లో స్వర్ణం, క్లీన్ అండ్ జర్క్ (79)లో రజతం, మొత్తం 145 కేజీలు ఎత్తి రజతం దక్కించుకుంది. 45 కిలోల జూనియర్ విభాగంలోనూ అదే ప్రదర్శనతో స్వర్ణం, రెండు రజత పతకాలు నెగ్గింది. ఈ సందర్భంగా ఆమెను అధికారులు, కోచ్ అభినందించారు.

## సఫారీల పాక్ టూర్ వాయిదా

**జొహాన్నె‌స్‌బర్గ్:** అధిక పని ఒత్తిడి కారణంగా దక్షిణాఫ్రికా జట్టు తమ పాకిస్థాన్ పర్యటనకు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. ఇరు జట్ల మధ్య ఈ సిరీస్ ఎప్పుడు జరిగేది తర్వాత వెల్లడిస్తారు. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో నాలుగు టెస్టులు, మూడు వన్డేలు ముగించిన ఈ జట్టు తాజాగా అదే జట్టుతో మూడు టీ20ల సిరీస్ ఆడుతోంది. ఈనెల 16న ఇది ముగిశాక ఆసీస్‌తో తిరిగి మూడు వన్డేలు, మూడు టీ20లు జరుగుతాయి. వారం వ్యవధిలోనే మూడు వన్డేల సిరీస్ కోసం సఫారీలు భారత్‌కు రానున్నారు. ఆ తర్వాత వెంటనే మూడు టీ20ల కోసం పాక్‌కు వెళ్లాల్సి ఉంది. అయితే ఇంత బిజీ షెడ్యూల్ కారణంగా క్రికెటర్లు తీవ్రంగా అలసిపోతారనే ఉద్దేశంతో ప్రస్తుతానికి పాక్ టూర్‌కు వెళ్లకపోవడమే మంచిదని నిర్ణయించుకున్నారు.

## హంపికి వరుసగా రెండో గెలుపు

**● హారికకు మరో డ్రా ● కెయిన్స్ కప్**

**సెయింట్ లూయిస్ (యూఎస్):** కెయిన్ కప్ చెస్ టోర్నీలో తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి వరుసగా రెండో విజయంతో టాప్‌కు దూసుకెళ్లింది. ఆరో రౌండ్ గేమ్‌లో మాజీ వరల్డ్ చాంపియన్ అలెగ్జాండ్రా కోస్టెనిక్ (రష్యా)పై హంపి నెగ్గింది. తెల్లపావులతో ఆడిన హంపి 61 ఎత్తుల్లో ప్రత్యర్థి ఆటకట్టించింది. దీంతో ఆరు రౌండ్ల నుంచి మొత్తం 4 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానానికి ఎగబాకింది. కాగా, చైనా గ్రాండ్ మాస్టర్ వెన్‌జున్ జుతో గేమ్‌ను హారిక డ్రా చేసుకొంది. నల్లపావులతో ఆడిన ఆమె 40 ఎత్తుల అనంతరం వెన్‌జున్‌తో డ్రాకు అంగీకరించింది. మొత్తం 3 పాయింట్లతో హారిక ఆరో స్థానంలో ఉంది.

## హరికృష్ణకు డ్రా

**ప్రేగ్ చెస్ ఫెస్టివల్**



**ప్రేగ్ (చెక్ రిపబ్లిక్):** ప్రేగ్ చెస్ ఫెస్టివల్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు పెంట్యాల హరికృష్ణ, విదిత్ గుజరాతికి డ్రాలే ఎదురయ్యాయి. రెండో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన హరి.. 31 ఎత్తుల అనంతరం ప్రత్యర్థి జాన్ క్రైజిటోఫ్ దుడా (పోలెండ్)తో పాయింట్ పంచుకున్నాడు. స్పెయిన్ గ్రాండ్ మాస్టర్ డేవిడ్ గుజ్జరోతో గేమ్‌ను విదిత్ డ్రా చేసుకున్నాడు.

## ఓటమి బాటలో ఆంధ్ర

**నడియాడ్:** గుజరాత్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర ఓటమి అంచున నిలబడింది. 229 పరుగుల లోటుతో బరిలోకి దిగిన ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 216/7 స్కోరు చేసింది. కిరణ్ షిండే (64) అర్ధ శతకం సాధించగా.. సుమంత్ (47) ఫర్వాలేదనిపించాడు. అక్షర్ పటేల్ (5/77) ఐదు వికెట్లతో ఆంధ్ర బ్యాటింగ్ పనిబట్టాడు. అంతకు ముందు 354/6తో మూడో రోజైన శుక్రవారం ఆటను కొనసాగించిన గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 406 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులు చేసింది. కాగా, విదర్భతో రంజీలో హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 139/7తో ఆడుతోంది. అంతకు ముందు 242/4తో మూడో రోజు ఆటను కొసాగించిన విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 333 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 272 పరుగులు చేసింది.

# శతకంతో ఆదుకున్న విహారి

**రాణించిన పుజార ● భారత్ 263 ఆలౌట్ ● కివీస్ లెవెన్‌తో వామప్ మ్యాచ్**



పుజార (93)

**హామిల్టన్:** బ్యాట్స్‌మెన్ వైఫల్యంతో టీమిండియా ఇబ్బందుల్లో పడినా.. హనుమ విహారి (182 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 101 రిటైర్డ్ అవుట్), చటేశ్వర్ పుజార (93) ఆదుకోవడంతో న్యూజిలాండ్ లెవన్‌తో వామప్ మ్యాచ్‌లో భారత్ తడబడి నిలబడింది. టీమిండియా ఓపెనింగ్ స్థానం కోసం పోటీపడుతున్న ముగ్గురు కుర్రాళ్లు... మయాంక్ అగర్వాల్ (1), పృథ్వీ షా (0), శుభ్‌మన్ గిల్ (0) అధికంగా బౌన్స్ అయ్యే బంతులను ఎదుర్కోలేక పెవిలియన్ చేరడం ఆందోళనకు గురి చేసే అంశం. విరాట్ కోహ్లీ నెట్ సెషన్‌కే పరిమితం కావడంతో గురువారం మొదలైన వామప్ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 263 పరుగులకు ఆలౌటైంది. కుగ్గెయిన్ (3/40) టాపార్డర్ పనిపట్టగా.. స్పిన్నర్ ఇష్ సోధీ (3/72) మిడిల్ ఓవర్లలో వికెట్లు పడగొట్టాడు. పిచ్‌ను అర్థం చేసుకోవడంలో తీవ్రంగా ఇబ్బంది పడిన భారత బ్యాట్స్‌మన్ ఏడుగురు సింగిల్స్ డిజిట్‌కే పెవిలియన్ చేరగా.. వారిలో నలుగురు డకౌట్ కావడం గమనార్హం..! పుజార-హనుమ ఐదో వికెట్‌కు 195 పరుగుల భాగస్వామ్యం జత చేయకపోతే టీమిండియా పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది.

**ఆరంభంలోనే టప..టపా..**

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే కుగ్గెయిన్.. బౌన్సీ బంతితో ఓపెనర్ పృథ్వీ షాను అవుట్ చేసి షాకిచ్చాడు. ఫామ్‌లో లేని అగర్వాల్.. కుగెలిన్ బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచిచ్చాడు. భారత్-ఎ తరపున డబుల్ సెంచరీతో అదరగొట్టిన గిల్.. తొలి బంతికే పెవిలియన్ చేరాడు. కుగెలిన్ డెలివరీని డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నించిన గిల్.. గల్లీలో సీఫెర్ట్ చక్కని క్యాచ్ అందుకోవడంతో వెనుదిరగాడు. దీంతో 5/3తో భారత్ వణికిపోయింది. రహనె (18) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేక పోయాడు. ఈ దశలో వన్‌డౌన్‌లో వచ్చిన పుజారకు తోడైన విహారి పరిస్థితిని చక్కదిద్దాడు. బంతి కొంత పాతబడడంతో రెండు, మూడు సెషన్లలో ఆట కొంత సులువైంది. స్పిన్నర్ల రంగంలోకి దిగడంతో పుజార, విహారి బ్యాట్‌లను ఝుళిపించారు. లెఫ్టామ్ స్పిన్నర్ రవీంద్ర బౌలింగ్ విహారి మూడు సిక్సర్లు బాదాడు. అయితే, ఆఖరి సెషన్‌లో గిబ్సన్ (2/26) బౌలింగ్‌లో హుక్ చేసే క్రమంలో పుజార అవుటయ్యాడు. సెంచరీ చేసిన విహారి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో.. టీమిండియా పతనం వేగంగా జరిగిపోయింది. రిషభ్ పంత్ (7).. షాట్ సెలెక్షన్‌లో మరోసారి తన బలహీనతను ప్రదర్శించాడు. సాహా (0), అశ్విన్ (0) డకౌట్‌లు కాగా.. జడేజా (8) ఆశించిన మేరకు రాణించలేక పోయాడు.



హనుమ విహారి (101)

### ఆ ఇద్దరి ప్రతిభకు ఆకాశమే హద్దు



పృథ్వీ షా, శుభ్‌మన్ గిల్‌లకు అపార ప్రతిభ ఉందని జట్టు ప్రధాన కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. వారిద్దరి నైపుణ్యానికి ఆకాశమే హద్దని కొనియాడాడు. రెగ్యులర్ ఓపెనర్ రోహిత్ శర్మ గాయంతో టెస్టు సిరీస్‌కు దూరం కావడంతో మయాంక్‌తో ఓపెనింగ్ చేసేందుకు షా, గిల్ పోటీపడుతున్నారు. 'ఈ ఇద్దరిలోనూ నైపుణ్యానికి కొదవ లేదు. తుది జట్టులో చోటెవరికి దక్కుతుందనే విషయం వదిలేస్తే వారు ప్రస్తుతం జట్టుతోపాటే ఉన్నారనే విషయం గుర్తుంచుకోవాలి. గిల్, షా ఒకే వాతావరణం నుంచి వచ్చారు. కొత్త బంతిని ఎదుర్కోవడానికి ఇష్టపడతారు' అని రవిశాస్త్రి తెలిపాడు.

### స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** పృథ్వీ షా (సి) రవీంద్ర (బి) కుగ్గెయిన్ 0, మయాంక్ అగర్వాల్ (సి) క్లీవర్ (బి) కుగ్గెయిన్ 1, పుజార (సి) క్లీవర్ (బి) గిబ్సన్ 93, శుభ్‌మన్ గిల్ (సి) సీఫెర్ట్ (బి) కుగ్గెయిన్ 0, రహానె (సి) టామ్ బ్రూస్ (బి) నీషమ్ 18, హనుమ విహారి (రిటైర్డ్ హర్ట్) 101, రిషభ్ పంత్ (సి) కుగ్గెయిన్ (బి) సోధీ 7, సాహా (సి) క్లీవర్ (బి) గిబ్సన్ 0, అశ్విన్ (ఎల్బీ) సోధీ 0, ఉమేష్ యాదవ్ (నాటౌట్) 9, జడేజా (సి) ఫిన్ అలెన్ (బి) సోధీ 8; **ఎక్స్‌ట్రాలు: 26; మొత్తం 78.5 ఓవర్లలో 263 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-5, 3-5, 4-38, 5-233, 6-245, 7-246, 8-246, 9-250; **బౌలింగ్:** స్కాట్ కుగ్గెయిన్ 14-2-40-3, బ్లెయిర్ టిక్నర్ 15-3-37-0, డేరిల్ మిచెల్ 7-1-15-0, నీషమ్ 13-3-29-1, జేక్ గిబ్సన్ 10-1-26-2, ఇష్ సోధీ 14.5-0-72-3, రచిన్ రవీంద్ర 5-1-30-0.

## తిహాడ్ జైలుకు బుకీ చావ్లా

**ఆదేశించిన హైకోర్టు**



**న్యూఢిల్లీ:** బుకీ సంజీవ్ చావ్లాకు తాత్కాలిక ఊరట లభించింది. పోలీసు కస్టడీలో ఉన్న అతడిని తిహాడ్ జైలుకు తరలించాలని ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు అక్కడే ఉంచాలని స్ప ష్టం చేసింది. 2000లో భారత్‌లో దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా జరిగిన వన్డే సిరీస్‌లో చావ్లా మ్యా చ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని ఢిల్లీ పోలీసులు ఆరోపించారు. లండన్‌లో ఉన్న అతడిని గురువారం భారత్‌కు తీసుకువచ్చారు. ట్రయల్ కోర్టు సంజీవ్‌ను 12 రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది. కాగా, చావ్లాను తిహాడ్ జైల్లో ఉంచి విచారణ చేస్తామని హోం మంత్రిత్వ శాఖ.. యూకే ప్రభుత్వానికి హామీ ఇస్తూ లేఖ రాసింది.

## ఆర్‌సీబీ లోగో మారింది..

**బెంగళూరు:** ముచ్చటగా మూడోసారి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు తమ లోగోను మార్చుకుంది. తమ సరికొత్త లోగోను శుక్రవారం విడుదల చేసింది. దీంట్లో పంజా విసురుతున్న సింహాన్ని కాస్త పెద్దదిగా చేసి సర్కిల్‌ను తొలగించారు. 'కొన్ని రోజులుగా మీరు ఎదురుచూస్తున్న క్షణం ఇదే. కొత్త ఏడాది.. కొత్త దశాబ్ది.. కొత్త లోగో' అంటూ సోషల్ మీడియాలో ఆర్‌సీబీ యాజమాన్యం పోస్ట్ చేసింది. ఈ లోగోపై కెప్టెన్ విరాట్ కోహ్లీ సంతృప్తి వ్యక్తం చేశాడు.

# ఓపెనింగ్‌కూ సిద్ధమే!

**టెస్టు బ్యాట్స్‌మన్ హనుమ విహారి**

**స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ గాయం ఒక్కసారిగా భారత జట్టును సమస్యల్లో పడేసినట్టయింది. అతడి లేని లోటుతో ఇప్పటికే వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత్.. ఇప్పుడు టెస్టు ఫార్మాట్‌లోనూ ఎవరితో ఓపెనింగ్ చేయాలో తేల్చుకోలేకపోతోంది. పోటీలో ఉన్న పృథ్వీ షా, శుభ్‌మన్ గిల్ వామప్‌లో డకౌట్‌లు కావడం టీమ్ మేనేజ్‌మెంట్‌కు షాకిచ్చింది. ఈనేపథ్యంలో హనుమ విహారి ఈ బాధ్యత తీసుకునేందుకు సై అంటున్నాడు..**

**హామిల్టన్:** టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటే టెస్టుల్లో ఓపెనింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని హనుమ విహారి చెబుతున్నాడు. ద్వితీయ శ్రేణితో కూడిన కివీస్ లెవెన్ బౌలింగ్‌ను పృథ్వీ షా, శుభ్‌మన్ గిల్ ఎదుర్కోలేక ఖాతా తెరవలేకపోయారు. అటు రెగ్యులర్ ఓపెనర్ మయాంక్ చేసింది కూడా ఒక్క పరుగే. అయితే ఆరో నెంబర్‌లో బరిలోకి దిగిన విహారి మాత్రం శతకంతో ఆకట్టుకుని భారత్ పరువు కాపాడాడు. ఎక్స్‌ట్రా బౌన్స్, పేస్‌తో ఇబ్బంది పెట్టిన కివీస్ బౌలర్ల ధాటికి విహా రి, పుజారా మినహా అంతా విఫలమయ్యా రు. దీంతో అసలైన మ్యాచ్‌లో వాగ్నర్, బౌల్ట్, హెన్రీ ధాటిని వీరు ఎలా ఎదుర్కొంటారనే ప్రశ్న తలెత్తుతోంది. ఈనేపథ్యంలో విహారి మీడియాతో మాట్లాడాడు.

**ఎక్కడైనా ఆడేస్తా..:** ఓ ఆటగాడిగా నేను ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధంగా ఉన్నాను. ప్రస్తుతానికైతే ఓపెనింగ్ విషయంలో ఎవరూ సంప్రదించలేదు. అయితే నేనింతకు ముందే ఓ విషయం స్పష్టం చేశాను. ఫలానా స్థానంలో ఆడాలని జట్టు కోరితే నేను వంద శాతం రెడీగా ఉంటాను.

**విచారమేమీ లేదు:** వరుసగా నాలుగు టెస్టుల్లో నేను తుది జట్టులో లేనందుకు చింతించడం లేదు. కొన్ని సార్లు ఐదుగురు బౌలర్లతో ఆడుతాం. ఇలా జట్టు వ్యూహాలకు తగ్గట్టు కాంబినేషన్ ఉంటుంది. దీన్ని తప్పుగా అర్థం చేసుకోకూడదు.

**అదనపు బౌన్స్ ఊహించలేదు:** వామప్ మ్యాచ్‌లో కివీస్ బౌలర్లు మాకు సవాల్ విసిరారు. నిజానికి ఎక్స్‌ట్రా బౌన్స్‌ను ఊహించకపోయినా నేను దీటుగానే ఆడాను. కివీస్ 'ఎ'తో ఇక్కడ ఆడినప్పుడు బంతి ఇలా బౌన్స్ కాలేదు. అయితే తొలి టెస్టుకు నాకిది మంచి సన్నాహకం.

**సిరీస్‌కు ఇలాంటి పిచ్‌లే:** కివీస్ బలం వారి పేసర్లే. అందుకే ఈ సిరీస్‌లో ఇలాంటి పిచ్‌లే ఉంటాయేమో. వారికి అనుభజ్ఞులైన లైనప్ ఉంది. నాకు తెలిసి ఎక్కువగా వారు షార్ట్ బాల్స్‌తో దాడి చేస్తారనుకుంటా. అదృష్టవశాత్తూ పుజార, నేను కొద్ది సమయం క్రీజులో గడపగలిగాం. ఈ వికెట్‌పై ఎక్కువ బంతులను వదిలేయమని పుజార నాకు సలహా ఇచ్చాడు. అదే పాటించి శతకం బాదాను.

# సెమీస్‌కు భారత్

**గెలిపించిన శ్రీకాంత్ జోడీ**
**3-2తో థాయ్‌పై విజయం**
**కనీసం కాంస్యం ఖాయం**
**ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్స్**



**మనీలా (ఫిలిప్పీన్స్):** ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో భారత పురుషుల జట్టు సెమీస్ చేరి కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకొంది. శుక్రవారం హోరాహోరీగా సాగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో భారత్ 3-2తో థాయ్‌లైండ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. 2-2తో స్కోరు సమమైన స్థితిలో ఆఖరి డబుల్స్ మ్యాచ్‌లో చిరాగ్ షెట్టికి జోడీగా బరిలోకి దిగిన కిదాంబి శ్రీకాంత్ 21-15, 16-21, 21-15తో మనీపోంగ్ జోన్‌జిట్-నిపిటపోన్‌పై నెగ్గి భారత్‌ను సెమీస్‌కు చేర్చాడు. సింగిల్స్‌లో సాయి ప్రణీత్, శ్రీకాంత్ పరాజయం పాలైనా.. రెండు డబుల్స్, మరో సింగిల్స్‌లో నెగ్గిన భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగే ఫైనల్-4 మ్యాచ్‌లో డబుల్ డిఫెండింగ్ చాంప్ ఇండోనేసియాతో భారత్ తలపడనుంది. తొలి మ్యాచ్‌గా జరిగిన సింగిల్స్‌లో సాయి ప్రణీత్.. వాంగ్‌చరోయిన్ చేతిలో, శ్రీకాంత్... విటిడ్‌శర్న్ చేతిలో ఓడడంతో భారత్ 0-2తో వెనుకబడింది. అయితే, మూడో మ్యాచ్‌గా జరిగిన డబుల్స్‌లో అర్జున్-ధ్రువ్ కపిల జోడీ, తర్వాత జరిగిన సింగిల్స్‌లో లక్ష్యసేన్ అద్భుత విజయంతో స్కోరు 2-2తో సమమైంది. ఆఖర్లో శ్రీకాంత్ జోడీ ఫినిషింగ్ టచ్ ఇచ్చింది.



గిరినాథ్ రెడ్డి

## అదరగొట్టిన గిరినాథ్

**కుప్పకూలిన మహారాష్ట్ర**

**డెంకాడ (విజయనగరం):** గిరినాథ్ రెడ్డి అద్భుత బౌలింగ్‌తో 8 వికెట్లు పతనం చేయడంతో ఆంధ్రతో శుక్రవారం మొదలైన సీకే నాయుడు అండర్-23 మ్యాచ్‌లో మహారాష్ట్ర 134 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహారాష్ట్ర కేవలం 51 ఓవర్లలోనే చాపచుట్టేసింది. ఓం భోంస్లే అత్యధికంగా 43 పరుగులు చేశాడు. గిరినాథ్ 50 పరుగులిచ్చి 8 వికెట్లు పతనం చేశాడు. కౌశిక్‌కు రెండు వికెట్లు లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు తొలిరోజు ఆట చివరికి 4 వికెట్లకు 77 పరుగులు చేసింది. వంశీకృష్ణ 44 పరుగులు చేశాడు. గిరినాథ్ (26), కౌశిక్ (1) క్రీజులో ఉన్నారు.





# 2,200 ఇది ఆదాయం కోటి దాటిన వృత్తి నిపుణుల సంఖ్య!

**ఐటీ శాఖ వెల్లడించిన ఆశ్చర్యకర వాస్తవం**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ఏకంగా 130 కోట్ల జనాభా.. లక్షల మంది ఆగర్భ శ్రీమంతులు.. కోట్ల మంది సంపన్నులు.. భారీగా ఆర్జించే వృత్తి నిపుణులు..! ఈ లెక్కన.. దేశంలో ఏటా రూ.కోటి కనీస ఆదాయం ఉన్న వృత్తి నిపుణులు లక్షల్లో ఉండాలి. కానీ, వారి సంఖ్య 2 వేలకు అటు ఇటుగానే ఉంది. విస్తుపోయేలా ఉన్నా, ఇది ఆదాయ పన్ను శాఖ చెప్పిన వాస్తవం..! 2019-20 ఆర్థిక సంవత్సరం భారత్‌లో 2,200 మంది వైద్యులు, న్యాయవాదులు, సీఏలు, ఇతర వృత్తి నిపుణులే తమ ఆదాయం రూ.కోటి అని పేర్కొంటూ ఐటీఆర్ ఫైల్ చేశారని ఐటీ శాఖ తెలిపింది. ఇందులో వారి అద్దెలు, వడ్డీలు, మూలధన లాభాల ఆదాయం కలపలేదని పేర్కొంది. 2018-19కి సంబంధించి ఆదాయాన్ని పేర్కొంటూ ఈ ఏడాది 5.78 కోట్ల మంది ఐటీఆర్‌లు సమర్పించారని వివరించింది.

| ఆదాయం(రూ.ల్లో) | వృత్తి నిపుణులు |
|---|---|
| 2.5 లక్షల్లోపు | 1.03 కోట్లు |
| 2.5-5 లక్షలు | 3.29 కోట్లు |
| 5 -10 లక్షలు | కోటి |
| 10 లక్షల పైనే | 46 లక్షలు |
| 50 లక్షల పైనే | 3.6 లక్షలు |
| 5 కోట్ల పైనే | 8,600 |

## ఎన్పీఆర్‌పై రాష్ట్రాలతో చర్చలు షురూ!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: జాతీయ జనాభా చిట్టా(ఎన్పీఆర్) తయారీని బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కేంద్రం రంగంలోకి దిగింది. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించి వారి భయాందోళనలను పోగొట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. దీనిలో భాగంగా కేంద్ర జనాభా లెక్కల విభాగం రిజిస్ట్రార్ జనరల్ వివేక్ జోషి శుక్రవారం పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్‌ను కలిసి చర్చలు జరిపారు.

## ప్రసూతి సేవల ఖర్చు 7,500కు పెంపు: ఈఎస్ఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 : గర్భిణులకు చెల్లించే ప్రసూతి సేవల ఖర్చును రూ.5 వేల నుంచి రూ.7,500కు పెంచుతూ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ) నిర్ణయం తీసుకుంది. ఈఎస్ఐసీ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో అనివార్య కారణాలతో సేవలు పొందలేక, వేరే ఆస్పత్రులకు వెళ్లే గర్భిణులకు ప్రసూతి వైద్యం కింద ఈ ఖర్చులు చెల్లిస్తారు. అలాగే 2020-21 నుంచి ఈఎస్ఐసీ వైద్య సంస్థల్లో ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేసేందుకూ ఈఎస్ఐసీ ఆమోదం తెలిపింది.

## 20 రోజులుగా అజ్ఞాతంలో హార్దిక్ పటేల్!

అహ్మదాబాద్ (గుజరాత్), ఫిబ్రవరి 14: పటీదార్ ఉద్యమ నేత, గుజరాత్ కాంగ్రెస్ నాయకుడు హార్దిక్ పటేల్ 20 రోజులుగా కనిపించడం లేదని అతడి భార్య కింజల్ పటేల్ చెప్పారు. గుజరాత్ ప్రభుత్వం తన భర్తను లక్ష్యంగా చేసుకుని వేధిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్టు చేశారు.

## రైల్లో భార్యకు సీటు అడిగితే కొట్టి చంపారు

పుణె, ఫిబ్రవరి 14: రైల్లో తన భార్య కోసం సీటు ఇవ్వమని అభ్యర్థించినందుకు ఓ వ్యక్తిని 12మంది మూకుమ్మడిగా కొట్టి చంపారు. దాడికి పాల్పడిన వారిలో ఆరుగురు మహిళలూ ఉన్నారు. ముంబై నుంచి బీదర్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైల్లో ఈ ఘటన జరిగింది. మృతిచెందిన ప్రయాణికుడిని కళ్యాణ్ ప్రాంతానికి చెందిన సాగర్ మార్కండ్‌గా గుర్తించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



కరుగుతున్న అంటార్కిటికా ..

అంటార్కిటికాలో ఉష్ణోగ్రతలు మునుపెన్నడూ లేనంతగా పెరుగుతున్నాయి. వాతావరణ మార్పులు, కాలుష్యం, భూతాపం కారణంగా ఇక్కడి సీమార్ ద్వీపంలో 20.75 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇదే అంటార్కిటికాలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత అని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఇవే పరిణామాలు కొనసాగితే.. అంటార్కిటికాలోని హిమానీనదాలు కరిగి.. సముద్రమట్టాలు పెరిగి తీర ప్రాంతాల ఉనికి ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు.

## మనకు తెలియని మరో ఆది మానవ జాతి



అరుణ్ శ్రీరాం

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: నియండెర్తల్, హోమోసెపియన్స్, డెనిజోవన్స్ ఇలా ఎన్నో ఆది మానవుల జాతులను పురాతత్వ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. పశ్చిమ ఆఫ్రికాకు చెందిన 405 మందికి సంబంధించిన డీఎన్ఏ విశ్లేషక ఫలితాలు.. మరో కొత్త ఆది మానవ జాతికి సంబంధించిన ఆనవాళ్లను బయటపెట్టాయి. అమెరికాలోని కాలిఫోర్నియా వర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయనంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వారు కనుగొన్న సరికొత్త డీఎన్ఏ.. ఏ ఇతర ఆది మానవ జాతుల డీఎన్ఏలతోనూ సరిపోలడం లేదని స్పష్టమైంది. ఆ వైవిధ్యభరిత డీఎన్ఏతో కూడిన ఆది మానవులు 5 లక్షల నుంచి 3.60 లక్షల ఏళ్ల క్రితం జీవించి ఉండొచ్చనే అంచనాకు వచ్చారు. వారు నియండెర్తల్, డెనిజోవన్లకు సమకాలికులై ఉండొచ్చన్నారు. 50వేల ఏళ్ల క్రితం వాళ్లు నైజీరియా, సియెర్రా లియోన్, జాంబియాల్లోని ఇతర ఆది మానవ జాతులతోనూ సంబంధాలు ఏర్పరుచుకున్నారని శాస్త్రవేత్తలు విశ్లేషించారు. కాగా, అధ్యయనం నిర్వహించిన శాస్త్రవేత్తల బృందంలో భారత సంతతికి చెందిన అరుణ్ దుర్వాసుల, శ్రీరాం శంకరరామన్ ఉండటం విశేషం.

# ఆ నలుగురికి డెత్ వారెంట్లు ఇవ్వొచ్చు



## కేంద్ర వ్యాజ్యం ప్రతిబంధకం కాదు

**దోషి వినయ్ శర్మ వ్యాజ్యం తిరస్కృతి**

**నిర్భయ దోషుల ఉరిపై సుప్రీం స్పష్టత**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: నిర్భయ కేసులో దోషుల ఉరిశిక్ష అమలుకు ట్రయల్ కోర్టు డెత్ వారెంట్ల జారీకి ఎలాంటి ప్రతిబంధకాలూ లేవని సుప్రీం కోర్టు తెలిపింది. న్యాయమూర్తి జస్టిస్ ఆర్ భానుమతి నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులను విడివిడిగా ఉరి తీసేందుకు అనుమతించాలని కోరుతూ కేంద్రం దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ధర్మాసనం విచారించింది. నలుగురు దోషులలో ముగ్గురి వ్యాజ్యాలు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో లేవని, వారి క్షమాభిక్ష దరఖాస్తులను రాష్ట్రపతి తిరస్కరించారని, నాలుగో దోషి పవన్ గుప్తా క్షమాభిక్షకు దరఖాస్తు చేసుకోలేదని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఉరిశిక్ష అమలుకు ట్రయల్ కోర్టు తాజాగా డెత్ వారెంట్లు జారీ చేయవచ్చని స్పష్టంచేసింది. దోషుల ఉరికి కొత్త తేదీలను కోరుతూ తిహార్ జైలు అధికారులు వేసిన వ్యాజ్యంపై విచారణను ట్రయల్ కోర్టు ఈనెల 17కు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కింది కోర్టు ఆదేశాలు వచ్చే దాకా నిరీక్షించడం మంచిదని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా, ఈ కేసులో దోషి వినయ్ శర్మ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని కొట్టివేసింది. న్యాయమూర్తి జస్టిస్ ఆర్ భానుమతి నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. వినయ్ శర్మ క్షమాభిక్ష దరఖాస్తును రాష్ట్రపతి తిరస్కరించడంపై న్యాయ సమీక్ష జరపడానికి తగిన కారణమేదీ కనిపించడం లేదని ధర్మాసనం పేర్కొంది.

### సొమ్మసిల్లిన జస్టిస్ భానుమతి

సుప్రీంకోర్టులో శుక్రవారం నిర్భయ కేసులో తీర్పుని చదువుతుండగా న్యాయమూర్తి జస్టిస్ ఆర్ భానుమతి స్పృహ తప్పి పడిపోయారు. నిర్భయ దోషులను విడివిడిగా ఉరితీసేందుకు అనుమతించాలంటూ కేంద్రం దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ భానుమతి తీర్పు చదువుతున్నప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. కొద్దిసేపటికే ఆమె స్పృహలోకి వచ్చారు. న్యాయమూర్తిని వెంటనే వీల్‌ఛైర్‌లో వైద్య చికిత్స కోసం తరలించారు.

### బాంబు కలకలం!

సుప్రీంకోర్టులో శుక్రవారం బాంబు భయం కొద్దిసేపు కలకలం సృష్టించింది. ఎవరో అజ్ఞాత వ్యక్తి పెట్టిన బ్యాగులో నుంచి పవర్ బ్యాంక్ బీపింగ్ శబ్దం రావడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. భద్రతా సిబ్బంది ఆ బ్యాగ్‌ను తనిఖీ చేసి దాన్ని కంట్రోలు రూమ్‌కు అప్పగించారు.

## మరణశిక్ష అప్పీళ్లపై ఆర్నెల్లలోపు విచారణ: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: మరణశిక్షకు సంబంధించిన క్రిమినల్ అప్పీళ్లపై విచారణను వేగిరం చేయడానికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. హైకోర్టులో మరణశిక్ష తీర్పు వెలువడిన తర్వాత దానికి వ్యతిరేకంగా దాఖలు చేసుకునే అప్పీలు విచారణకు ఆర్నెల్లు గడువు నిర్దేశించింది. అప్పీలు రెడీ అయిందా లేదా అన్న దానితో సంబంధం లేకుండా దాన్ని ధర్మాసనం ముందు ఉంచాల్సిందేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. నిర్భయ సామూహిక అత్యాచారం, హత్య కేసులో నలుగురు దోషులకు ఉరి శిక్ష అమలులో తీవ్ర జాప్యం జరుగుతున్న తరుణంలో సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

## జూన్ 23 నుంచి అమర్‌నాథ్ యాత్ర

జమ్ము, ఫిబ్రవరి 14: అమర్‌నాథ్ యాత్ర జూన్ 23న ప్రారంభమవుతుందని శుక్రవారం అధికారులు ప్రకటించారు. దక్షిణ కశ్మీరులోని హిమాలయాల్లో ఉన్న అమర్‌నాథ్ ఆలయాన్ని దర్శించుకోవడానికి 42 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుంది. ఆగస్టు 3న ముగుస్తుంది. అమర్‌నాథ్ యాత్ర కోసం రిజిస్ట్రేషన్లు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతాయి. 13 కన్నా తక్కువ, 75 కన్నా ఎక్కువ వయసున్న వారిని యాత్రకు అనుమతించరు. నిరుడు అమర్‌నాథ్ యాత్ర 40 రోజులు మాత్రమే కొనసాగింది.

## 'పుల్వామా'తో లబ్ధి పొందిందెవరు?

**ఉగ్రదాడిపై దర్యాప్తులో ఏం తేల్చారు?.. కేంద్రానికి రాహుల్ ప్రశ్న**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: పుల్వామా ఉగ్రదాడి జరిగి ఏడాదైన సందర్భంగా దేశం మొత్తం అమర జవాన్లకు నివాళులర్పిస్తుండగా.. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఆ దాడి నుంచి లబ్ధి పొందింది ఎవరు? దర్యాప్తులో ఏం తేల్చారు? దాడి జరగడానికి కారణమైన భద్రతా లోపాలకు బీజేపీ సర్కారులో ఎవరు బాధ్యత వహిస్తారు?" అని ప్రశ్నిస్తూ శుక్రవారం రాహుల్ ట్వీట్ చేశారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నర్సింహారావు మండిపడ్డారు. జాతి మొత్తం అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న వేళ రాహుల్ మాత్రం వారిని అవమానిస్తున్నారని ఆరోపించారు. ఆయన లష్కరే తాయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థలకు సానుభూతిపరుడని పేర్కొన్నారు. కాగా, పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతీ ఇరానీ శుక్రవారం నివాళులర్పించారు.

### 'పుల్వామా' అమరవీరులకు చంద్రబాబు నివాళులు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'పుల్వామా దాడి జరిగి ఏడాదైయింది. దారుణమైన ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నా వినయపూర్వక నివాళులు అర్పిస్తున్నా' అని టీడీపీ అధినేత చంద్రబాబు ట్వీట్ చేశారు.

## కరోనాకు ఆరోగ్య కార్యకర్తలూ బలి

**రక్షణలేక చైనాలో ఆరుగురు మృతి.. 1,488కి చేరిన మరణాలు**

బీజింగ్, టోక్యో, ఫిబ్రవరి 14: చైనాలో కరోనా వైద్య సిబ్బందినీ బలి తీసుకుంటోంది. వందలు, వేల కొద్దీ బాధితులను పరీక్షిస్తుండటం.. మాస్కులు, బాడీ సూట్స్ వంటి రక్షణ సామగ్రి సరిపడా లేకపోవడంతో వారు వైరస్ బారినపడుతున్నారు. ఇప్పటివరకు కొవిడ్ -19 కారణంగా ఆరుగురు ఆరోగ్య కార్యకర్తలు మృతి చెందారని, 1,716 మందికి వైరస్ నిర్ధారణ అయిందని జాతీయ ఆరోగ్య కమిషన్ ప్రకటించింది. దీంతో యంత్రాంగం అత్యవసరంగా పరికరాల పంపిణీ చర్యలు చేపట్టింది. మరోవైపు చైనాలో కరోనా మరణాలు 1,488కు చేరాయి. కొత్తగా 121 మంది మృతి చెందారు. వీరిలో 116 మంది హుబెయ్ ప్రావిన్స్‌వారే. భారత్‌లో కరోనా అదుపులో ఉందని, ప్రధాన మంత్రి కార్యాలయం ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటోందని కేంద్ర ఆరోగ్య శాఖ శుక్రవారం తెలిపింది. జపాన్ నౌకలోని 138 భారతీయుల్లో మూడో వ్యక్తికి కొవిడ్-19 సోకినట్లు తేలింది. వారిని ఆసుపత్రికి తరలించినట్లు ఎంబసీ తెలిపింది. వైరస్ పరీక్షలు నెగిటివ్‌గా తేలిన 80 ఏళ్లు పైబడిన వృద్ధులను జపాన్ నౌక నుంచి తరలించి ఐసోలేషన్‌కు పంపుతోంది. పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం నుంచి ఢిల్లీ-హాంకాంగ్ విమాన సర్వీసును రద్దు చేస్తున్నట్లు స్పైస్ జెట్ ప్రకటించింది. పారదర్శకత లోపించడంతో.. వైరస్‌కు సంబంధించిన సమాచారాన్ని అమెరికాతో పంచుకునేందుకు చైనా నిరాకరించింది. తమ చొరవను అడ్డుకోవడంపై అమెరికా అభ్యంతరం చెప్పింది. కరోనాపై పోరాటానికి మద్దతిస్తామని ప్రకటించిన భారత ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపింది.

# అమ్మాయిల లోదుస్తులు విప్పించి..

## నెలసరి అనుమానంతో 68 మందికి అగ్ని పరీక్ష

**గుజరాత్‌లోని స్వామి నారాయణ్ అనుబంధ కాలేజీలో దారుణం**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: నెలసరి సమయంలో హాస్టల్ వంటగదిలోకి వచ్చారన్న అనుమానంతో.. 68 మంది విద్యార్థినుల లోదుస్తులు విప్పించి పరిశీలించిందో కాలేజీ యాజమాన్యం! ఈ ఘటన భుజ్ గుజరాత్‌లోని భుజ్‌లో 'సహజానంద్ గర్ల్స్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగింది. భుజ్‌లో స్వామినారాయణ్ మందిర్ సభ్యులు నడిపే ఈ కళాశాలను 2012లో ఏర్పాటు చేశారు. 1 నుంచి 12వ తరగతి దాకా క్లాసులున్నాయి. కాలేజీలో 1500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో 68 మంది దూరప్రదేశాల నుంచి వచ్చినవారు కావడంతో అక్కడే హాస్టల్‌లో ఉంటున్నారు. నెలసరి సమయంలో వారి కదలికలపై కాలేజీ యాజమాన్యం తీవ్ర ఆంక్షలు విధించింది. ఆ సమయంలో విద్యార్థినులు మిగతా విద్యార్థినులను తాకకూడదు, హాస్టల్ వంటగదిలోకి వెళ్లకూడదు. ఇతర విద్యార్థులతో కలిసి భోంచేయకూడదు. ప్రాంగణంలో ఉన్న స్వామినారాయణ్ మందిర్‌కు వెళ్లకూడదు. అయితే, ఇటీవల కొందరు విద్యార్థినులు హాస్టల్ వంటగదిలోకి వచ్చారని.. రెక్టార్‌కు అనుమానం వచ్చింది. వెంటనే ఆమె కాలేజ్ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు.



**అవమానించారు..**

"ఈనెల 12న హాస్టల్ యంత్రాంగం మామీద ఈ ఆరోపణలు చేసి మమ్మల్ని అవమానించింది. గురువారం.. రెక్టార్ అంజలీబెన్ ప్రిన్సిపాల్‌కు మా మీద ఫిర్యాదు చేసింది. దీంతో ప్రిన్సిపాల్ మమ్మల్నందరినీ తరగతి గదుల్లోంచి బయటకు పిలిపించి వరుసగా నిలబెట్టారు. 'మీలో ఎవరికి నెలసరి వచ్చింది?' అని ప్రశ్నించారు. ఇద్దరు విద్యార్థినులు తమకు రుతుస్రావం అవుతోందని చెప్పి పక్కకు వెళ్లారు. మిగతావారిని నమ్మని ప్రిన్సిపాల్.. అందరినీ మరుగుదొడ్ల వద్దకు పంపించారు. అక్కడ మహిళా అధ్యాపకులు మాలో ఒక్కొక్కరినీ పిలిచి లోదుస్తులు విప్పించి పరిశీలించారు" అని ఒక విద్యార్థిని వివరించింది. ఈ ఘటనపై విచారణకు కచ్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ దర్శన ఢోలాకియా ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఇందుకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకుంటామని కాలేజీ ట్రస్టీ హిరానీ చెప్పారు. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) కూడా ఈ ఘటనపై స్పందించి విచారణ కమిటీని నియమించింది.

# భీమా-కోరెగావ్ కేసు ఎన్ఐఏకు

**ఎన్సీపీకి చెందిన హోం మంత్రిని పట్టించుకోకుండా మహారాష్ట్ర సీఎం నిర్ణయం**

**ఉద్ధవ్ ఠాక్రేపై పవార్ ఆగ్రహం**

పుణె, ఫిబ్రవరి 14: భీమా కోరెగావ్ కేసు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు బదిలీ అయింది. ఈ కేసు దర్యాప్తును పుణె పోలీసుల నుంచి తమకు అప్పగించాలని ఎన్ఐఏ కోరడం... దీనికి అభ్యంతరం లేదని మహారాష్ట్ర ప్రభుత్వం తెలపడంతో పుణె కోర్టు శుక్రవారం 'బదిలీ' ఆదేశాలు జారీ చేసింది. కేసుకు సంబంధించిన రికార్డులు, ప్రొసీడింగ్‌లు, పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, వస్తువులను ముంబైలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టుకు తరలించాలని, నిందితులందర్నీ ఈ నెల 28లోపు ఆ కోర్టులో హాజరుపరచాలని పుణె కోర్టు అడిషనల్ సెషన్స్ జడ్జి ఆదేశించారు. ఎన్ఐఏకు బదలాయించడానికి గత నెలలో ఒప్పుకోని ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే... ఇప్పుడు అభ్యంతరం లేదనడం విశేషం. ఠాక్రే నిర్ణయంపై ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. "దర్యాప్తును రాష్ట్రం చేతుల్లోంచి కేంద్రం తీసేసుకోవడం తప్పు. వారి నిర్ణయానికి మహారాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడం కూడా తప్పే" అని మండిపడ్డారు. తన అభిప్రాయాన్ని పట్టించుకోకుండా కేసు బదిలీకి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని ఎన్సీపీకి చెందిన హోం మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ తెలిపారు. బీజేపీతో అవగాహనకు వచ్చాకే కేసు బదిలీకి ఉద్ధవ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కెనడా సెనేట్ స్పీకర్ జార్జ్.జె.ఫ్యురేతో వెంకయ్య

## తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామిక కారిడార్ల పనులు వేగవంతం చేయండి

**కేంద్ర మంత్రి గోయల్‌తో ఉపరాష్ట్రపతి వెంకయ్య**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, వరంగల్, విశాఖపట్నం, చిత్తూరులో ప్రతిపాదించిన పారిశ్రామిక కారిడార్ల పనులను వేగవంతం చేయాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కేంద్ర వాణిజ్య, భారీ పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌కు సూచించారు. శుక్రవారం గోయెల్‌తో పాటు వాణిజ్య శాఖ కార్యదర్శి, భారీ పరిశ్రమల శాఖ కార్యదర్శులతో ఆయన భేటీ అయ్యారు. హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-నాగపూర్ పారిశ్రామిక కారిడార్ల పనులపై అడిగి తెలుసుకున్నారు.రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల సమీపంలో ఫార్మా సిటీపైనా వివరాలు అడిగారు. కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఏర్పాటుపై చర్చించారు. గుంటూరులో మసాలా దినుసుల పార్క్ ఏర్పాటుచేయాలని వెంకయ్య సూచించారు.

## ప్రమాణస్వీకారానికి రండి మోదీకి కేజ్రీవాల్ ఆహ్వానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ఈనెల 16న తన ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ప్రధాని మోదీని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆహ్వానించారు. ఢిల్లీ బీజేపీ ఎంపీలు, కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలకూ ఆయన ఆహ్వానం పంపించారు. అయితే ఆరోజు మోదీ తన నియోజకవర్గమైన వారాణసీలో పర్యటించనున్నారు. కాగా ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్‌ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నియమించారు. ఆయన సలహాపై ఆరుగురిని మంత్రులుగా నియమించారు.

## బంగ్లాదేశీయులనే అనుమానంతో గూడు కూల్చేశారు!

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు మారతహళ్లి సమీపంలోని మునేకొళాలు వద్ద చెత్తకాగితాలు ఏరుకునే నిరుపేదలు ఉంటున్న షెడ్లను కొందరు దుండగులు కూల్చివేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికులు గత 13 ఏళ్లుగా 20 షెడ్లు వేసుకుని నివసిస్తున్నారు. గురువారం సాయంత్రం 3 పొక్లెయిన్‌తో వచ్చిన 50 మంది ఆ షెడ్లను కూల్చివేశారు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు భూవివాదం కారణమని కొందరు అంటుంటే... బంగ్లాదేశీయులు అక్రమంగా నివసిస్తున్నారనే అనుమానంతో వీటిని కూల్చివేశారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.




Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.

epaper.andhrajyothy.com